ఆంధ్రప్రదేశ్

జూలై 1971 | 50 పైసలు





ఆంధ్రప్రదేశ్

సచిత్ర మాసపత్రిక

జూలై, 1971

(ఆషాఢం-శ్రావణం 1893 శా. శ)

సంపుటి: 15 సంచిక: 6

ప్రధాన సంపాదకులు : పెండ్యాల వామనరావు

సంపాదకులు : కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి

గమనిక

అనివార్య కారణాలవల్ల 1971 ఏప్రిల్, మే, జూన్, నెలల ఆంధ్రప్రదేశ్ [తెలుగు] సంచికలు ప్రచురించడం వీలుపడలేదు. పాఠకులకు, చందాదార్లకు, ఏజంట్లకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాము.

—ప్రధాన సంపాదకుడు

ముఖచిత్రం:
మన ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధి

రెండో అట్ట:
కొత్తవెలుగులోకి

చివరిఅట్ట:
లేపాక్షి బసవన్న

వెల : 50 పైసలు

సాలు చందా: 6 రూపాయలు

రిజిస్టర్డ్ నెం. 133

ఈ సంచికలో

పేజీ

సోషలిస్టు సోపాన మార్గంలో....

లోకసభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో, సోషలిస్టు కార్యక్రమాలు అమలు పరచడానికీ, తద్వారా ఆర్థిక అభివృద్ధిస్థాయి పెంచడానికీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధికి ప్రజానీకం సంపూర్ణమైన అధికారం యిచ్చింది. ఆంధ్రప్రదేశ్‌తోసహా దేశమంతటా ప్రశాంత వాతావరణంలో యీ ఎన్నికలు జరుగడంవల్ల దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బాగా స్థిరపడిందని ఋజువైంది. భారతదేశంలో ప్రజాస్వామ్యం ఏమవుతుందోనని ఆందోళన చెందిన సద్విమర్శకుల వూహాలూ, ఇటువంటి దురభిప్రాయాలూ సరియైనవి కావని తేలింది.

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు సెలవిచ్చినట్లు "మనదేశం సోషలిస్టు మార్గంలో మరొక ముందడుగు వేయడానికి సర్వసన్నద్ధమై వున్నందున యీ యేటికి ఒక ప్రత్యేకత వచ్చింది. లోకసభ మధ్యంతర ఎన్నికల్లో మనం అనుసరిస్తున్న అభ్యుదయకర విధానాలకు బ్రహ్మాండమైన విజయం చేకూరింది. అంతేకాక శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో మరో ఐదు సంవత్సరాలపాటు దేశానికి సుస్థిరమైన ప్రభుత్వం లభించింది.

సామరస్య, సమైక్యతా శక్తులను ప్రోత్సహించాలనీ, అసూయా ద్వేషాలను విస్మరించి, భేదభావాలను తొలిగించుకోవాలనీ, ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో సాధించబడిన సుస్థిరత్వాన్ని ప్రత్యేకంగా గుర్తుచేశారు. "భవిష్యత్తులోకూడా మన రాష్ట్రంలో సుస్థిరప్రభుత్వం వుంటుందనడంలో సందేహంలేదు. అలావుంటేనే రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. ఐక్యతా శక్తులను సమర్థించడం, బలపరచడం మనందరి విద్యుక్తధర్మం" అన్నారు ముఖ్యమంత్రి.

శ్రీమతి ఇందిరాగాంధీ నిర్ద్వంద్వమైన జాతినేతగా అధికారాన్ని పొందింది. దీని ప్రాధాన్యాన్ని ప్రపంచ దేశాలన్ని గుర్తించాయి. భారతదేశం ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలన్నింటిలో అగ్రతాంబూలం పొందినదేశం. అనేక చారిత్రిక కారణాలవల్ల, స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ నిర్దేశించిన వినూత్న మార్గం వల్లనైతేనేమి, ప్రపంచమంతటినీ ప్రభావితం చేసిన ఆయన నైతిక నాయకత్వంవల్లనైతేనేమి, పదిహేడు సంవత్సరాలపాటు ఏకచ్ఛత్రంగా ప్రధాన మంత్రి పదవి నిర్వహించిన జవహర్‌లాల్ నెహ్రూ వ్యక్తిత్వం వల్లనేమి, కొద్దికాలంపాటే అయినా యీ రాజ్యనౌకను సమర్థవంతంగా నడిపిన శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి ప్రతిభా విశేషాలవల్లనైతేనేమి, అభ్యుదయం, మతాతీత లౌకిక రాజ్యవ్యవస్థ, సోషలిజం అనే మహాలక్ష్యాలను మూర్తీభవించిన శ్రీమతి ఇందిరాగాంధీ పేరుప్రతిష్టలవల్లనైతేనేమి, అంతర్జాతీయ రంగాలలో యీనాడు మనదేశం అతి ప్రధానమైన స్థానాన్ని అలంకరించి వున్నది. ఐక్యతకు ప్రతినిధిగా, సమైక్యతా సాధనశక్తిగా, సుస్థిరత్వానికి చిహ్నంగా శ్రీమతి ఇందిరాగాంధీ ప్రజల మనస్సులమీద గాఢముద్ర వేసింది. తన తండ్రి హయాంలో ఏ జాతీయ లక్షణాలు, లక్ష్యాలు మనకు గర్వకారణమైనవో, వాటిని తిరిగి భారతదేశంలో ఆమె సుప్రతిష్ఠితం చేసింది.

ప్రజలను పరిపాలించడంతోపాటు వారి హృదయాలను కూడా పాలించిన భారత వీర నారీమణులు చరిత్రలో వ్రేళ్ళమీద లెక్కించదగినంతమంది మాత్రమే వుంటారు. అటువంటి వారందరిలో అగ్రగామి శ్రీమతి ఇందిరాగాంధీ. ప్రజా సేవా సంప్రదాయం, త్యాగనిరతి, విప్లవ భావాలు ఆమెకు వారసత్వంగా సంక్రమించాయి. జాతికోసం త్యాగం చేయడం అనే అగ్నిపరీక్షలో ఆమె ఉత్తీర్ణత సాధించింది. భారత జాతీయ సంప్రదాయానికి కట్టుబడి వున్నప్పటికీ, ఆమె ఊహలు ఆధునికములు, అభ్యుదయ భావపూరితములు. ఆమె నికార్సయిన జాతీయవాది; ఆమె నరనరాలలో భారతీయత ప్రవహిస్తుంటుంది. ఆధునిక నాగరికతా పరిధిలో మన దేశాన్ని గొప్ప దేశంగా అభివృద్ధిపరచడమే ఆమె ప్రధానాశయం; మన దేశ సంప్రదాయాలనూ, ఆధునిక సాంకేతిక, శాస్త్రీయ అభివృద్ధి ఫలితాలనూ సమ్మేళన చేయడం ద్వారా దేశ ప్రగతిని సాధించడమే ఆమె ప్రధాన లక్ష్యం.

—పి. వి. ఆర్.



1971-72 సం. పు ఆంధ్రప్రదేశ్ మధ్యాంతర బడ్జెటు

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, శాసన మండలిలో 1971–72 సంవత్సరపు బడ్జెటును సమర్పిస్తూ, 1971 మార్చి 11వ తేదీన ఆర్థికమంత్రి శ్రీ కె. విజయభాస్కరరెడ్డిగారు చేసిన ప్రసంగం నుండి:

1971-72 సంవత్సరపు బడ్జెట్ అంచనాలు

1971–72 బడ్జెట్ అంచనా ప్రకారం, మొత్తం ఆదాయం రూ. 310.04 కోట్లు వుండగలదు–1970–71 సవరించిన అంచనాల ప్రకారం ఈ మొత్తం రూ. 286.59 కోట్లు. ఈ పెరుగుదలకు ముఖ్యకారణం–కేంద్రపు పన్నులలో రాష్ట్రపు వాటాకింద ఆశిస్తున్న అదనపు జమలు. ఆర్థిక సంఘపు తీర్పుదృష్ట్యా, ఆదాయపు పన్ను విషయమై ముందుగా జరిగే వసూళ్లలో వాటాను రాష్ట్ర ప్రభుత్వం 1971–72 నుంచి పొందగలుగుతుంది. రాష్ట్ర ఎక్సయిజు సుంకాలు, అమ్మకపు పన్ను విషయంలోకూడా మామూలుగానే అదనపు పెరుగుదలలుకూడా లభించవచ్చు. రాష్ట్ర ప్రణాళిక కింద రూ. 15.3 కోట్లమేరకు, కేంద్రం ప్రతిపాదిత పథకాల కింద రూ. 10.89 కోట్లమేరకు కేంద్రంనుంచి సహాయగ్రాంట్లు రివిన్యూ ఖాతాన జమచూపబడినై.

బడ్జెటులో ఈ కేటాయింపులు ఇలా ఉన్నాయి— మొత్తం రివిన్యూ ఖాతాన ఖర్చు —రూ. 300.14 కోట్లు; ప్రణాళికకు చెందని ఖర్చు రూ. 268.8 కోట్లు, రాష్ట్ర ప్రణాళికకు రూ. 19.93 కోట్లు; కేంద్రం ప్రతిపాదించిన పథకాలకు రూ. 11.41 కోట్లు 1970–71 సవరించిన అంచనాలలో కరువుకాటకాల బాధితులకు సహాయంకై కేటాయించిన రూ. 8.81 కోట్లు మినహా, 1971–72 బడ్జెటు అంచనాలలోని రూ. 0.75 కోటి మినహా, రివిన్యూ ఖాతాన నికర ఖర్చు రూ. 7.41 కోట్లు వుంటుంది.

పెట్టుబడి వినియోగం

ప్రణాళిక పథకాలకు, ఇతర పథకాలకు పెట్టుబడి వినియోగం 1971–72లో రూ 46.22 కోట్లు వుండగలదని అనుకుంటున్నాం. పెట్టుబడి తరగతికి చెందిన చిన్నపాటి అంశాలకు మాత్రమే ప్రణాళికేతర విషయాల కేటాయింపు వర్తిస్తుంది. ఇది పోను, రాష్ట్ర ప్రణాళిక పెట్టుబడి వినియోగం రూ. 45.53 కోట్లు వుంటుంది. ప్రణాళిక వివిధ రంగాల్లోని భారీ ప్రాజెక్టులకు ఈ కేటాయింపు వర్తిస్తుంది.

పబ్లిక్ ఋణం

ఈ ఏడాది ప్రకటించాలనుకుంటున్న బహిరంగ మార్కెటు ఋణంవల్ల స్థూలంగా లభించే మొత్తం రూ. 16.08 కోట్లు వుండ

గలదని బడ్జెటులో ప్రతిపాదించబడింది. ఈ ఏడాది చెల్లించవలసిన ఋణం నిమిత్తమై రూ 6.58 కోట్లను సమకూర్చిన తర్వాత, నికరలబ్ధి రూ. 9.5 కోట్లు వుంటుంది. చిన్న పొదుపు ఉద్యమంలో వాటాద్వారా లభించగల మొత్తం రూ. 3.5 కోట్లు వుండవచ్చు— 1970–71లో రూ. 3 కోట్లు లభించింది

మొత్తం పరిస్థితి

పైన ప్రస్తావించిన అంచనాలు ఆధారంగా, రివిన్యూ ఖాతాన రూ. 9.89 కోట్లు మిగులు ఉండగలదని భావిస్తున్నాం. అయితే పెట్టుబడి వినియోగం, పబ్లిక్ ఋణం, పబ్లిక్ అకౌంట్—వీటి దృష్ట్యా, మొత్తం పరిస్థితి ఎలా వుంటుందంటే, రూ. 9.9 కోట్ల తరుగు వుంటుందన్నమాట — 1971–72 బడ్జెట్ వ్యవహారాల ఫలితంగా.

రొక్కపు నిల్వ

ఇంతకుముందు చెప్పినట్లు, 1970–71 సంవత్సరం రూ. 15.5 కోట్ల తరుగుతో ముగియవచ్చు. 1971–72లో ఏర్పడుతుందనుకుంటున్న బడ్జెట్ తరుగు ఫలితంగా, ఆ సంవత్సరం రూ 25.4 కోట్ల తరుగు రొక్కపు నిల్వతో ముగియవచ్చు. ఈ సందర్భంలో నేనొక మాట చెప్పాలి:— ప్రణాళికకు చెందని పథకాలకు రూ. 10 కోట్లు, రాష్ట్ర ప్రణాళికకు అదనపు సహాయం రూ. 8 కోట్లు సహాయం కేంద్రంనుంచి లభించగలదని భావిస్తున్నాం. ఆ విధంగా బడ్జెటులో ఈ మొత్తాలు జమ చూపబడినై.

(i) షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు, షెడ్యూల్డు జాతులు, మిగతా వెనుకబడ్డ వర్గాలకు ఇళ్ళస్థలాలను సంపాదించేందుకై అయ్యే ఖర్చుకుగాను మొత్తం ఒకకోటి రూపాయలు 1970–71 బడ్జెటు అంచనాల్లో కేటాయించబడినై. ఇందునిమిత్తమై 1971–72 బడ్జెటు అంచనాల్లో కేటాయింపు రూ. 1.5 కోట్లకు పెంచబడింది–ఇప్పటికన్న పెద్ద కార్యక్రమాన్ని అమలు జరిపేందుకుగాను.

(ii) ప్రణాళికకు చెందని కేటాయింపుక్రింద, షెడ్యూల్డు కులాలకై మంచినీటి బావుల కేటాయింపు, ఇప్పటి రూ. 6 లక్షల కేటాయింపునుంచి రూ. 12 లక్షలకు పెంచబడింది.

(iii) గౌరవ సభ్యులకు తెలుసు–రాష్ట్రంలోని పురపాలకసంఘాల ఆర్థిక పరిస్థితులను పరిశీలించేందుకై ఒక ఉన్నత సంఘం ఏర్పాటు చేయబడింది. 1971–72లో ఈ సంఘం సిఫార్సుల అమలుకై బడ్జెటు అంచనాల్లో ఒక కోటి రూపాయలు కేటాయించబడినై.

(iv) సంక్షేమ పథకాలను అమలు జరిపేందుకై జిల్లా పరిషత్తులకు, పంచాయతీ సమితులకు తగినఆర్థిక వసతులను సమకూర్చేందుకుగాను, బడ్జెటు అంచనాల్లో రూ. 3 కోట్ల అదనపు కేటాయింపు చేయబడింది.

(v) మోటారుకార్ల కొనుగోలుతోసహా, పోలీసు శాఖను మరింత పటిష్ఠపరచేందుకుగాను 1970–71లో రూ. 50 లక్షలు అదనంగా కేటాయించబడినై. 1971–72బడ్జెట్ అంచనాల్లో ఇందుకు సమానమైన మొత్తం కేటాయించబడింది—ఏర్పాటుచేయాలని అనుకుంటున్న పోలీసు గృహవసతి, సంస్థకు సమకూర్చాలనుకుంటున్న రూ. 25 లక్షలుకూడా ఈ మొత్తంలో చేర్చబడినాయి.

తెలంగాణా అభివృద్ధి

ఈ సంవత్సరపు రాష్ట్ర ప్రణాళిక కోసం రూ. 77.39 కోట్ల మొత్తం 1970–71 బడ్జెటులో కేటాయించబడింది. తెలంగాణా ప్రత్యేక అభివృద్ధి, రాయలసీమ, కోస్తా ఆంధ్ర జిల్లాల వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకాలను చేర్చేందుకుగాను ప్రణాళికా వినియోగం అధికంచేయ బడుతుంది అని సూచించబడింది. శాసనసభ 1970, జూలై సమావేశంలో, ఈ చెప్పిన పథకాలకు, గిరిజన సంక్షేమ పథకానికి అయ్యే ఖర్చు నిమిత్తం అనుబంధ ప్రతిపాదనలు ఆమోదించబడినాయి. ఈ విధంగా రాష్ట్ర ప్రణాళిక వ్యయం రూ. 97.42 కోట్లవరకుఉండవచ్చు. తెలంగాణా ప్రత్యేక అభివృద్ధి పథకాలకు రూ. 9 కోట్లు, రాయలసీమ అభివృద్ధికి రూ 4 కోట్లు ఈ మొత్తంలో చేర్చబడినాయి. అలాగే గిరిజన సంక్షేమ పథకానికై రూ. 1.6 కోట్లు, పోచంపాడు ప్రాజెక్టుకై అదనంగా కేటాయించిన రూ. 2 కోట్లు కూడా ఈ మొత్తంలో చేర్చబడినై. ఈ ఏడాది ప్రణాళిక నిమిత్తమైన కేంద్రసహాయం రూ. 45.56 కోట్ల మేరకు మాత్రమే లభించింది–తెలంగాణా ప్రత్యేక అభివృద్ధి పథకాలకయ్యే రూ. 9 కోట్ల మొత్తం కాకుండా.

1971–72 వార్షిక ప్రణాళిక

వార్షిక ప్రణాళికను గురించిన చర్చలో, ప్రణాళికా సమితి వారు, 1971–72 ప్రణాళికకు రాష్ట్రపు మొత్తం వసతులు రూ. 87 కోట్ల మేరకు మాత్రమే సమకూరగలవని సూచించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పటీన అభివృద్ధి వేగాన్ని తగ్గించకుండా వుండాలంటే, ప్రణాళికా వ్యయం ఇంకా చాలా ఎక్కువస్థాయిలో వుండాలని వివరించాం. తప్పనిసరియైన అవసరాల దృష్ట్యా, పూర్వపు నిర్ణయాల దృష్ట్యా, 1971–72లో ప్రణాళికా వ్యయం క్రింద 105.59 కోట్లు కేటాయించబడినాయి తెలంగాణా ప్రత్యేక అభివృద్ధికిగాను చేసిన రూ. 9 కోట్ల ప్రత్యేక కేటాయింపును ఈ మొత్తంలో చేర్చలేదు ఇందు నిమిత్తమై ప్రాంతీయ సంఘపు సిఫార్సును ప్రత్యేకంగా పొంది, తగిన ప్రతిపాదనలను తర్వాత శాసన సభముందు నివేదిస్తాం. రూ. 105.59 కోట్ల ప్రణాళికా వ్యయంలో ఈ క్రింది కేటాయింపులు చేర్చబడినై:

		రూ. కోట్లలో
నాగార్జునసాగర్ ప్రాజెక్టు	...	10 62
పోచంపాడు ప్రాజెక్టు	...	6.00
శ్రీశైలం ప్రాజెక్టు	...	4.20

రాయలసీమ అభివృద్ధి సంఘపు సిఫార్సును అనుసరించి, రాయలసీమ అభివృద్ధి పథకాల నిమిత్తమై రూ. 4 కోట్ల వినియోగం ప్రణాళికలో కేటాయించబడింది 1970–71లో అమలు జరుపబడుతున్న గిరిజన అభివృద్ధి పథకానికిగాను, రూ. 146 లక్షల మొత్తం వినియోగాన్ని ప్రణాళిక సమకూరుస్తుంది. ★

ఇందిరాగాంధి - రెండు తరాల మధ్య వారధి



"మనుషుల్లో రెండు రకాలవారున్నారు. పనిచేసేవాళ్ళు ఒకరకం అయితే ఆ పని ఫలితాన్ని అనుభవించేవారు రెండో రకం" అని ఒకసారి మహాత్మాగాంధీ ఇందిరాగాంధీతో అన్నారు. ఈ రెండింటిలో మొదటివర్గానికి చెందడానికే తాను ఎప్పుడూ ప్రయత్నిస్తుంటానని ఇందిరాగాంధి చెప్పుకున్నారు.

ఇందిరా ప్రియదర్శిని 1917 నవంబరు 19న అలహాబాదులో జన్మించింది. నెహ్రూల స్వగృహం ఆనందభవన్‌లోని రాజకీయ వాతావరణం, అక్కడి కార్యకలాపాలు ఆమె మీద చెరగని ముద్ర వేసాయి. చిన్నప్పటి స్మృతుల్ని నెమరువేసుకుంటూ ఆమె, తన బాల్యంలోని ఆటపాటలన్నీ రాజకీయాలతో ముడిపడివుండేవని చెప్పుకుంది.

చిన్నప్పుడు జోన్ ఆఫ్ ఆర్క్ కథచదివి, ఆంగ్లేయుల్ని దేశంనించి తరిమేసేందుకు ఖడ్గధారియై అశ్వారూఢియైనట్టు తననుతాను ఊహించుకునేది.

ఇందిరా ప్రియదర్శిని పూర్వీకులు కాశ్మీరునించి వలసవచ్చి 1716లో ఢిల్లీలో స్థిరపడ్డారు. కాలవ వద్దునవున్న వీరి యిల్లు ఆ తర్వాత తర్వాత 'నెహ్రూల'గృహంగా మారింది. హిందీలో కాలువకు నెహర్ అని అర్థం.

ఇందిరా ప్రియదర్శిని చాలాచిన్నప్పుడే మహాత్మాగాంధీగారి చరఖా సంఘానికి సంబంధించిన బాలల విభాగాన్ని ప్రారంభించింది. 12వ యేట సహాయనిరాకరణోద్యమంలో బాలల విభాగాన్ని ఒకదానిని ప్రారంభించింది. దీనికే వానరసేనఅనిపేరు. అలహాబాదులో యీ సంఘానికి ఆరువేల మంది సభ్యులు వుండేవారు. దీనికి బొంబాయిలోనూ, మరికొన్ని పట్టణాలలోనూ శాఖలుకూడా వుండేవి. ఈ సంఘం సభ్యులు స్వాతంత్ర్యోద్యమకాలంలో పెద్దలు ముఖ్యమైన పనులను చేయడానికి వీలుగా వారిని చిన్నచిన్న పనులనుండి తప్పిద్దామని వార్తల్ని అందజేయడం, వంటపనిచేయడం, వస్త్రాలు కుట్టడం, ప్రథమ చికిత్స చేయడంవంటి పనులను చేపట్టేవారు. తన తల్లిదండ్రులు అస్తమానం జైల్లోనూ, బైటా గడపవలసి రావడం వల్ల ఆమె విద్యాభ్యాసం సాంప్రదాయిక పద్ధతిలో సాగలేదు.

తండ్రి జైలులోనుంచి కూతురుకురాసే లేఖలవల్లనే ఆమెకు విద్య, జ్ఞానం అలవడ్డాయి. ఆవుత్తరాలు ఆ తరువాత "కుమార్తెకు తండ్రి వ్రాసిన లేఖలు", 'ప్రపంచచరిత్రావలోకనం' అనే ప్రసిద్ధ గ్రంథాలుగా అయ్యాయికూడా.

కొత్త ఢిల్లీలోని ప్రధానమంత్రి గృహంలోని ఆమె పదిహేడేళ్ళ జీవితమే ఆమె విజ్ఞానార్జనలో అపూర్వమైనది. జవహర్‌లాల్‌నెహ్రూ ఎప్పుడూ ఏదో ఒకపనిచేస్తూనే వుండేవారు. ఆ ఇంటికి నిరంతరంగా అతిథులు వస్తూవుండేవారు. ప్రపంచం నలుమూలలనుంచీ ప్రముఖులు ఆ ఇంటికి వస్తూనేవుండేవారు. సమావేశాలు, చర్చలు జరుగుతుండేవి. ఈ వాతావరణమే ఆమెకు చక్కని రాజకీయ శిక్షణ అందజేసింది. నెహ్రూ అంతరంగిక భావాలలోనూ, ఆలోచనలోనూ ఇందిర పాలుపంచుకునేది. అనేక ముఖ్యమైన విధానాలను రూపొందించడంలో ప్రధానమైన నిర్ణయాలను తీసుకోవడంలో ఇందిర తండ్రికి తోడ్పడుతుండేది.

ప్రజల సంక్షేమమే ఇందిర జీవిత లక్ష్యం. శిశు సంక్షేమానికి సంబంధించిన అంతర్జాతీయ సంఘానికి ఆమె ఉపాధ్యక్షురాలు. భారతీయ శిశుసంక్షేమ మండలి కార్యనిర్వాహక వర్గం సభ్యురాలు. విద్యామంత్రిత్వ శాఖ ప్రారంభించిన బాల భవన్, బాలల మ్యూజియంకు అధ్యక్షురాలు. ఢిల్లీలోని బాల సహయోగ్ వ్యవస్థాపకురాలూ, అధ్యక్షురాలూను. అలహాబాదులోని కమలా నెహ్రూ స్మారక ఆసుపత్రి బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సభ్యురాలు. అలహాబాదులోని మోతీలాల్ నెహ్రూ గ్రామభారతి అధ్యక్షురాలు,

విద్యా విషయాలలో ఇందిరాగాంధికి అభిలాష ఎక్కువ. విద్యా విషయక కేంద్రసలహా సంఘంలో ఆమె సభ్యురాలు. ఢిల్లీ విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యురాలుకూడా. యునెస్కో కార్య కలాపాలతో ఆమెకు సన్నిహిత సంబంధం వుంది. 1960_64లో యునెస్కో కార్యనిర్వాహక సభ్యురాలుగా వున్నారు. సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలుగా వ్యవహరిస్తున్నారు,

1962లో చైనా దురాక్రమణ చేసినప్పుడు పౌరకేంద్రమండలి నెలకొల్పబడిన సందర్భంగా ఆమె ఆ మండలి అధ్యక్షురాలుగా వున్నారు. ఆ పదవిలోవుంటూ పౌర రక్షణ దళాల కృషిని సమీకరించి, యుద్ధరంగంలో పోట్లాడుతున్న జవాన్లకు సౌకర్యాలను కల్పించడంలోనూ, వారి కుటుంబాల సంక్షేమానికి తోడ్పడడం లోనూ విశేషమైన కృషిచేసారు. జాతీయ రక్షణనిధి కార్య నిర్వాహక మండలి సభ్యురాలుగాకూడా ఆమె వ్యవహరించారు.

ఇందిరాగాంధికి అనేక అంతర్జాతీయ బహుమతులు లభించాయి. 1953లో అమెరికా ఆమెకు 'మదర్స్ అవార్డ్' బహూకరించింది. 1960లో ఏల్ యూనివర్శిటీ హౌలాండ్ మెమోరియల్ ప్రైజు లభించింది. ఆగ్రా విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ లెటర్స్ డిగ్రీని ఆమెకు బహూకరించింది. రాజనీతిజ్ఞతలో విశేషమైన ప్రతిభకు ఇసబెల్లా డిఎస్టే అవార్డు ఆమెకు లభించింది.

శ్రీమతి ఇందిరాగాంధి రెండు తరాల మధ్యవారధి. స్వాతంత్ర్యానికై పోరాటం సలిపి దాన్ని సాధించిన తరానికీ, ఆ స్వాతంత్ర్యం అందించే మధురఫలాలను అందుకోడానికి ఆతృతతో ఎదురుచూస్తోన్న తరానికీ మధ్య సేతువు ఆమె.

ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభకు ఎన్నికైన సభ్యులు

బి. రాజగోపాలరావు	(కాంగ్రెసు. సంజీవయ్య)	...శ్రీకాకుళం
బిడ్డిక్యా సత్యనారాయణ	(కాం.సం)	...పార్వతీపురం
కె. నారాయణరావు	(కాం.సం)	... బొబ్బిలి
పి. వి జి. రాజు	(ఇండిపెండెంట్)	...విశాఖపట్నం
శ్రీమతి రాధాభాయి ఆనందరావు	(కాం.సం)	... భద్రాచలం
ఎస్. ఆర్. ఎ. ఎస్. అప్పలనాయుడు	,,	... అనకాపల్లి
ఎం. సంజీవరావు	,,	... కాకినాడ
ఎస్. బి. పి. పట్టాభిరామారావు	,,	... రాజమండ్రి
బి. ఎస్. మూర్తి	,,	...అమలాపురం
ఎం. టి. రాజు	,,	... నరసాపురం
కె. సూర్యనారాయణ	,,	... ఏలూరు
మాగంటి అంకినీడు	,,	... గుడివాడ
డా. కె. ఎల్. రావు	,,	... విజయవాడ
మేడూరి నాగేశ్వరరావు	,,	...మచిలీపట్నం
అంకినీడు ప్రసాదరావు	,,	... ఒంగోలు
కె. రఘురామయ్య	,,	... గుంటూరు
మద్ది సుదర్శనం	,,	... నరసారావుపేట
పి. వెంకటరెడ్డి	,,	... కావలి
డి. కామాక్షయ్య	,,	... నెల్లూరు
టి. బాలకృష్ణయ్య	,,	... తిరుపతి
పి. పార్థసారధి	,,	... రాజంపేట
పి. నరసింహారెడ్డి	,,	... చిత్తూరు
పి. బయ్యప్పరెడ్డి	,,	...హిందూపూర్
పి. ఆంథోనిరెడ్డి	,,	... అనంతపురం
కోదండ రామిరెడ్డి	,,	... కర్నూలు
పి. వెంకట సుబ్బయ్య	,,	... నంద్యాల
వై. ఈశ్వరరెడ్డి	(సి.పి.ఐ)	... కడప
ఎం. భీష్మదేవ్	(తెలంగాణా ప్రజాసమితి)	నాగర్‌కర్నూలు
జి. ఎస్. మేల్కోటె	,,	...హైదరాబాదు
ఎం. ఎం. హాషిమ్	,,	...సికింద్రాబాదు
జి. వెంకటస్వామి	,,	... సిద్దిపేట
మల్లికార్జున్	,,	... మెదక్
వి. తులసీరామ్	,,	... పెద్దపల్లి
ఎం. సత్యనారాయణరావు	,,	... కరీంనగర్
ఎస్. బి. గిరి	,,	... వరంగల్లు
కె. రామకృష్ణారెడ్డి	,,	... నల్గొండ
జె. రామేశ్వరరావు	,,	... మహబూబ నగర్
ఎం. రామగోపాలరెడ్డి	(కాం.సం)	... నిజామాబాదు
టి గంగారెడ్డి	,,	... ఆదిలాబాదు
శ్రీమతి టి. లక్ష్మీకాంతమ్మ	,,	... ఖమ్మం
బి. నరసింహారెడ్డి	(సి.పి ఐ_ఎం)	...మిర్యాలగూడెం

పై కప్పులో కల్లోలం

—మధురాంతకం రాజారాం

పై అధికారులను గురించి క్రింది ఉద్యోగులు ఫిర్యాదు చెయ్యడం సర్వత్రా వున్నదేనని మీరు భావించవచ్చు. ఒకటి రెండు సంఘటనలు ఏకరువు పెడితేగానీ మీకు నా వాదంలోని పసదనం బోధపడదని నాకు తెలుసు. ఉదాహరణకు అలివేలు మంగమ్మ విషయమే తీసుకోండి! ఇందులో నా పొరబాటేమైనా వుంటే మీరే చెప్పండి...

అలివేలు మంగమ్మంటే ఆవిడ గూడా మా హెడ్‌మిస్ట్రెస్ విమలాదేవిలాగా, మా శ్రీమతి రాజేశ్వరిలాగా ఒక మామూలు ఆడమనిషే ననుకునేరు! కాదు. కానేకాదు. శేషాద్రి శిఖరాలపైన తెనుగువారి యిష్టదైవమై వెలుగొందుతున్న శ్రీనివాసమూర్తి వున్నాడుగదా, సాక్షాత్తుగా ఆయనగారి యిల్లాలే ఈ అలివేలు మంగమ్మ! క్షమించాలి. ఈ కథలో ఆమెగూడా ఒక పాత్రగా ప్రవేశపెట్టబడడంలేదు. పాపం, ఆవిడ నిమిత్తమాత్రురాలు. మా బడిలో ఒక ప్రేయర్ హాలుంది. అందులో గోడలపైన దండిగా జాతీయనాయకుల చిత్రాలున్నాయి. మధ్యలో ద్వారబంధానికి ఎగువగా రెండు పెద్దపెద్ద పటాలు ఒక జంటగా అమరివుండేవి. అందులో ఒక పటంలోనేమో వేంకటేశ్వరుడు. రెండో పటంలోనేమో అలివేలు మంగతాయారు బడికంతా ఒక పెద్ద దిక్కులాగా ఆ పురాణ దంపతులక్కడ వాళ్ళపాటుకు వాళ్ళు నెలకొని వుండేవారు. ఈ లోగా ఏం జరిగిందంటే, మా బడిలోని మూషిక రాజాలకు బొత్తిగా తిండి కరువొచ్చిపడింది. ఇది పనికొచ్చేది, యిది పనికిరానిది అన్న విచక్షణలేకుండా అవి ప్రతికాగితాన్నీ అప్పళంలా ఆహారించడం ప్రారంభించేసరికి, మా జాగ్రత్తలో మేముండి పుస్తకాలు, పత్రికలు మొదలైన వాటిని పెట్టెల్లోనూ, బీరువాల్లోనూ పెట్టి తాళం వేసుకోసాగాము. గ్రుద్ధ మూషికాలు కాగితాల తరువాత తినదగిన వస్తువులకోసం పరిశోధన కొనసాగించాయి. ఈ పరిశోధనలో ఒక చిట్టెలుకకు గోడకూ, పటానికీ లంకెగా కట్టివున్న త్రాడు గూడా ఒక ఖాద్య పదార్థంలాగే గోచరించింది. ఈ అవాంతరకృత్యంవల్ల ఒకనాడు అలివేలు మంగమ్మ పటం గబుక్కున నేలపైన పడిపోయింది.

అద్దం ముక్కముక్కలై పోయిందని నేరుగా చెప్పనవసరం లేదు గదా! బాగుచేయించి మళ్ళీదాన్ని యథాస్థానంలో పెట్టవలసింది పోయి, హెడ్‌మిస్ట్రెస్ విమలాదేవి పటాన్ని తీయించి లైబ్రరీలో బీరువాల వెనుక పెట్టించింది.

"పటానికి అద్దం వేయించరా మేడమ్?" అని ప్రశ్నించాను.

"ఇప్పుడేం తొందరొచ్చిందిలెండి! నిదానంగా ఆలోచిద్దాం..."

అదేంమాట! భార్యాభర్తలిద్దరూ కలిసి వుండడమే న్యాయం. లోకం హర్షించేదిన్నీ, సమాజానికి శ్రేయస్కరమైనదిన్నీ అదే; ఎటొచ్చీ వాళ్ళను విడదేయడమే మహాపాపం!

"పోనీ ఒక పనిచేద్దామా మేడమ్! పిల్లల దగ్గర చందాలు వసూలుచేద్దా..."

"మిస్టర్ మూర్తీ! సర్వీసుకు మీరు కొత్తవాళ్ళేమీకాదు. ఎనిమిదేళ్ళుగా యిదే స్కూల్లో పనిచేస్తున్నారు. రూల్సు, రెగ్యులేషన్సు మీకు తెలిసినవే! ఐనా ఉండుండి ఒక అనుచితపు పనిచేసి నా గొంతుమీది కెందుకు తెస్తారో నాకు తెలియకుండావుంది. అదికాదండీ! చీటికీ మాటికీ మీరు పిల్లల దగ్గర డబ్బులు వసూలు చేస్తారా? వాళ్ళు యిళ్ళకు వెళ్ళి డబ్బులకోసం పీడిస్తే, పేరెంట్సు పైవాళ్ళకు అర్జీలు పెడితే, వాళ్ళు ఛార్జస్ ఫ్రేమ్‌చేస్తే ఎక్స్‌ప్లనేషన్సు వ్రాయలేక చచ్చేది నేనేగదా!"

హెడ్‌మిస్ట్రెస్ గారికి యింతఘాటుగా కోపం రావలసిన అవసరమేమిటో నాకు స్ఫురించలేదు.

విమలాదేవి మా బడికి బదిలీ అయిరావడం ఏడెనిమిది నెలలనాటి మాట. ఆమె ఎప్పుడు, ఎందుకు, ఎవరిపైన కోపం వస్తుందో, దాన్ని ఆవిడ ఎలా ఆవిష్కరిస్తుందో తెలుసుకోడం యింతవరకూ నాచేతగాలేదు.

నెలరోజుల క్రితం వరకు గుడ్డిలో మెల్లగా పరిస్థితి ఒకరకంగా వుండేది. ఇటీవల ఒక సరికొత్త పరిణామం పుట్టుకొచ్చింది. ఎందుచేతనో హెడ్‌మిస్ట్రెస్ గారికి ముంగరవారి వీధిలో తాను కాపురమున్న యిల్లు నచ్చలేదు. వేరొక అద్దె యిల్లుకోసం అన్వేషణ జరుగుతోందని విన్నాను. పులిమీద పుట్రలాగా మా వీధిలోనే ఒకయిల్లు కుదిరింది. అక్కడికి రావడంతో, వచ్చిన కొత్తలోనే మా హెడ్‌మిస్ట్రెస్ గారికిన్నీ,

మా శ్రీమతికిన్నీ పరిచయం ఏర్పడింది. అంతటితో గృహ జీవితంలో గూడా నాకు మనశ్శాంతి కరువై పోయే ప్రమాదం పొడ చూపింది—

ఎలాగంటారా ? అదే చెబుతున్నాను—

* * *

ఒకనాటి సాయంకాలం నేనింటికి వెళ్ళేసరికి గంటపైడయింది.

"ఎలాగైనా మీరు మంచివాళ్ళు. బడి వదిలిపెడితే నేరుగా యింటికే వచ్చేస్తారు" అంది రాజేశ్వరి !" "ఈ రోజు కొంచెం ఆలస్యమైందితే రాజేశ్వరీ!" అన్నాను.

"ఆలస్యం కావడం తప్పనిగాదు. కానీ ఒక రోజు నేను సినిమాకు వెళ్ళి ఒకటి రెండు గంటలు ఆలస్యంగా వస్తాననుకోండి! అప్పుడు మీరూరుకుంటారా అనేనేనడగడం?"

విస్సందేహంగా యిది కొత్త ధోరణి ! అందువల్ల గూఢార్థాలకు, దురర్థాలకు తావివ్వకుండా ఆచితూచి మాట్లాడదలచుకున్నాను— "కారణంలేనిదే ఆలస్యం జరుగుతుందా? ఆలస్యంగా రావడమనేది నీ విషయంలో గూడా ఎప్పుడైనా జరగొచ్చు నేనేమీ కోప్పడను..."

"మంచిది! ఒక విషయంపైన మనకు పరిష్కారం కుదిరింది. రెండోది. తెల్లవారు తున్నప్పుడు మీరు పడుకునే వుంటారు నేను లేచి కాఫీచేసి తీసుకొస్తే గానీలేవరు. ఎందుకమ్మా! ఇక మీదట ఒక రోజు నేను లేచి కాఫీచేస్తే, యింకోరోజు మీరు చేసి తీసుకురావాల..."

"ఒప్పుకున్నాను. రేపటి ఉదయం వంతు నాదే!"

"ఇకపోతే సంసారంలో భార్యాభర్తలిద్దరూ సమానమే గదండీ! బండికి చక్రాలెలాగో, మనిషికి కళ్ళెలాగో సంసారంలో భార్యాభర్తలలాగనీ మీరు వినలేదా ? మరైతే నేను మిమ్మల్ని 'మీరు' అంటానుగదా, మీరు మాత్రం నన్ను 'నువ్వు' అని వ్యవహరించడం దేనికి ?"

"ప్చ్ ప్చ్, ఎంత పొరబాటు జరిగిపోయిందో చూచారా రాజేశ్వరీ గారూ ! మన్నించాలి. ఇకపైన నేను మిమ్మల్ని 'మీరు' అనే వ్యవహరిస్తాను. చాలకపోతే 'తమరు' అని గూడా అంటాను. కానీ ఒక సందేహమండీ ! ఈ బుద్ధి మీ అంతట మీకే పుట్టిందా, లేకుంటే ఇతరులెవరైనా బోధించారా ?

తెచ్చి పెట్టుకున్న నిగ్రహం పటాపంచలు కాగా రాజేశ్వరి పక్కున నవ్వేసింది. .."బాబ్బాబూ ! మీకు పుణ్యముంటుంది. చిన్నదాన్ని నన్ను పట్టుకుని మీరు 'అండీ' అనీ, 'మీరు' అనీ మాట్లాడడమేమిటండీ, ఖర్మ. మీకు తెలిసి వుండడం ఎందుకైనా మంచిదని పాఠం అలాగే ఒప్పజెప్పాను. ఇదంతా మీ హెడ్ మిస్ట్రెస్ గారి గీతోపదేశం !"

"అయ్యోపాపం! ఆవిడ ఉపదేశం బూడిదలో పోసిన పన్నీరు కావలసిందేనా రాజేశ్వరీ ! నువ్వు నాతో పోరాటాన్ని ప్రారంభించవా ?" అన్నాను.

"ఊరుకోండి బాబూ ! నా కిప్పుడెంతో హాయిగా వుంది. మీరు కొత్తగా నాకు హక్కులిచ్చినంత పుణ్యం. మీతో పోట్లాట పెట్టుకున్నానంటే నాకు మతిపోతుంది..."

ఇంకానయం! రాజేశ్వరికైతే మతిపోతుంది. ఇల్లుగూడా పదిలంగా వుండదు గనుక నాకప్పుడిక గోదారే శరణ్యం.

పనులన్నీ ముగించుకుని రాజేశ్వరి మళ్ళీ ఓ అరగంట సేపటికి హాల్లోకి వచ్చింది. చలనం లేకుండా వాలు కుర్చీలో పడుకున్న నా వైపు చూస్తూ తెల్లబోయి "నిజంగానే మన యింట్లో పోరాటం ప్రారంభమైపోయినట్లు అలా నిర్ఘాంతపడిపోయి కూచున్నారేమండీ ?" అంటూ పలకరించింది.

"కాదు రాజేశ్వరీ, నువ్వు హక్కుల పోరాటం ప్రారంభిస్తావు. నేను నిరాకరిస్తాను. నువ్వు తిరుగుబాటు చేస్తావు. ఇల్లు రణరంగంలా తయారౌతుంది. ఈ పరిణామం వల్ల ఒక వ్యక్తికి ఆనందం కలిగే పక్షంలో మనమెందుకలా చేయగూడదూ ?

అనుమానంగా నా వైపు చూడసాగింది రాజేశ్వరి.

* * *

పదిరోజుల తర్వాత ఒకనాటి ఉదయం నేను తోటలో రావి చెట్టు క్రింద కూర్చుని వుండగా హెడ్‌మిస్ట్రెస్‌గారి నుంచి పిలుపు వచ్చింది.

"మూర్తిగారూ! సిద్ధార్థుడిలా రావిచెట్టు క్రింద కూచున్నారేమండీ ! క్లాసు లేదా ?"

లేదన్నాను.

నేనూ గమనిస్తున్నాననుకోండి! మునుపటిలా మీరు ఉత్సాహంగా లేరు. అనారోగ్యంగా వుంటే సెలవు పెట్టి ట్రీట్‌మెంటు యిప్పించుకోగూడదూ ?"

"ఎందుకు లెండి మేడమ్ ! సెలవుపెట్టి యింటిదగ్గర కూచుంటే అనారోగ్యం మరింతగా విషమించేటట్టుంది. అది యిల్లుగాదు, అడవి, రగడలేని రోజు లేదు, స్కూల్లో వున్నంత వరకే నా మనసుకు శాంతి. ఇంటికి వెళ్ళడమంటే భయమైపోయింది. ఐనా ఈ బాధలు మీకేమర్థమౌతాయి లెండి మేడమ్ ! ఇలాంటి బాదరబందీ లేవీ మీకు లేవు..."

హెడ్ మిస్ట్రెస్ గారి ముఖం విరిసిన శత పత్రమైపోయింది—"ప్రసక్తివచ్చింది గనుక చెప్పాలనిపిస్తోంది. గృహమే కదా స్వర్గసీమ అని వింటుంటాం. ఊరికే ఎలా తయారౌతుంది. అలా మలచుకోవాలి. సాయంకాలం యింటికి వెళ్తాను. ఎక్కడి వస్తువక్కడ, యిల్లంతా శుభ్రంగా వుంటుంది. మాట్లాడ్డానికి ఎవరో యిరుగు పొరుగు ఆడవాళ్ళు వచ్చి పోతుంటారు. కాలం హాయిగా గడిచిపోతుంది. భోజనం చేసి పడుకోడమే ఆలస్యం-గాఢనిద్ర! 'లేవండమ్మగారూ ! కాఫీ తయారైంది' అంటుంది వంటలక్క. లేచి పేపరు చూస్తుంటాను. టిఫిను సిద్ధం. స్నానం చేస్తాను. డ్రెస్ చేసుకుంటాను. బడికి హాజరైపోతాను. చింతలనీ, వంతలనీ అందరూ అంటుంటే వినడమే ! వాటిరంగూ, రుచీ ఎలా వుంటుందో గూడా నాకు తెలియదు..."

"తీరిక సమయాల్లో మీరు పుస్తకాలు చదవడం గానీ, సినిమాలకు వెళ్ళడం గానీ వుండదా మేడమ్ ?" వీలయినంత సిన్సియర్ గానే ప్రశ్నించాను.

"అబ్బే, అవంటేనే నాకు రోత. వాటిని 'హేట్' చేస్తాననుకోండి! ఎంతసేపైనా ఒక మగవాడున్నా, ఒక ఆడ

మనిషిన్నీ ! లేదంటే రెండు మూడు జంటలు. ఒకరి వెంట ఒకరు. పరిచయాలు ప్రేమలు. వియోగాలు విరహాలు. అసూయాలు అనుమానాలు. వట్టి చెత్త. సారహీనమైన గొడవ గదండీ ! నాకేం నచ్చదు."

"అదృష్టమంటే మీదే మేడమ్. నిండైన ఆనందం మీ సొత్తు. నాకా ప్రాప్తం లేదు" అంటూ వేడిగా నిట్టూర్చాను.

కొన్ని కొన్ని దేవతలను సంతృప్తి పరచడం కోసం ఎన్నెన్నో చేయరాని పనులు చేయడం లేదా ? ఆ దేవతలతో పోల్చి చూస్తే మా హెడ్‌మిస్ట్రెస్ విమలాదేవి ఎంతో మేలు ! ఈవిడకు కొన్ని అపదార్థాలతో మేరు పర్వతమంత ఆనందం కలుగుతుంది. ఆ పదార్థాల పునాదులపైన ఆమె ఒక కృత్రిమమైన ఆనందసౌధం నిర్మించుకోడంలో నాచేతనైన సహాయం నేనూ చేస్తున్నాను. తప్పేముంది ?.

కానీ నాకున్నంత నిదానం, ఉపకార చింతన (నటనాపటిమ అనుకోండి పోనీ) మా ఆవిడకు లేకపోయింది. ఎంతో ప్రయత్నం మీద ఆమె ఒక నెల రోజులుమాత్రం నేను నియమించిన హద్దుల్లో వుండగలిగింది. ఆ నెల రోజుల్లో గూడా ప్రతి దినమూ ఒక కంప్లెయింటే ! మగవాడు స్త్రీకి తీరని అన్యాయం చేశాడు—భోగ వస్తువుగా వాడుకున్నాడు. యంత్రంకంటే భిన్నమైనదిగా భావించ లేదు. తన స్వార్థానికి యింధనంగానే ఉపయోగించుకుంటూ వచ్చాడు. స్థూలంగా యిది హెడ్‌మిస్ట్రెస్ విమలా దేవి వాదం. అక్కడి కక్కడ ఆ వాదానికి తలవూపి, యింటికి రాగానే నాతో తలపడేది రాజేశ్వరి.

"ఏమండీ ! మగవాళ్ళందరూ అలాంటి దుర్మార్గులే నంటారా ?

"కొందరు మంచివాళ్ళు గూడా వుండవచ్చు..."

"మరైతే ఆడవాళ్ళలో మాత్రం చెడ్డవాళ్ళు లేరా ? ''

"చెప్పలేం ! వాళ్ళలో గూడా కొందరు చెడ్డవాళ్ళు వుండొచ్చు...''

"అలాగైతే మీ హెడ్‌మిస్ట్రెస్‌గారు మగవాళ్ళపైన అలా విరుచుక పడిపోతుందెందుకండీ ?''

"ఏమో; ఆవిడనే అడగరాదా ? ''

"అడిగేదాన్నే : మీరెక్కడ బాబూ ! మీరు నానోటికి బుట్టి పెట్టేసేరు...''

తాత్కాలికంగా మౌనం ; మళ్ళీ మొదలు.

"ఏమండీ ! పెళ్ళి అనేది తప్పా ? ''

"కాదే. ''

'' మరైతే ఆదేదో వట్టి పనికిమాలిన పనైనట్టు ఆవిడ ఆలా తీసిపారేసుందెందుకండీ?"

రాజేశ్వరీ! ఎవరిపిచ్చి వాళ్ళకానందం. నీకెందుకు? నువ్వూరుకో____"

"ఏంవూరుకోడమో బాబు! ఎందుకొచ్చిన పీడ! నేనక్కడికి వెళ్ళనే వెళ్ళను ... "

కానీ హెచ్. యం. విమలా దేవి ఈ విడ కంపెనీ కోసం తహతహలాడి పోతున్నట్టుగా ప్రతిరోజూ రమ్మని కబురు పెట్టేది. రాజేశ్వరికి వెళ్ళక తప్పేది గాదు.

ఇలా మరికొన్ని రోజులు గడిచాయి.

చివరకు నేనేదైతే జరుగుతుందని భయపడుతూ వచ్చానో అదికాస్తా జరగనే జరిగింది.

ఒకనాటి సాయంకాలం నేను షికారుకు వెళ్ళి తిరిగి వచ్చే సరికి రాజేశ్వరి ఎదురుగా వచ్చి "అయ్యా ! మీ హెడ్‌మిస్ట్రెస్ గారితో స్నేహానికి తెగతెంపులు '' అంటూ ప్రకటన జారీ చేసింది.

"ఎందుకు రాజేశ్వరీ ! ఏం జరిగంది ? " కంగారుగా ప్రశ్నించాను.

"ఆవిడ గొప్పల్ని ఎంతకాలమని సహించగలం ? నా చేత గాలేదు. మొదట నా కెన్ని చీరలున్నాయో అడిగి తెలుసుకుని, ఆ తరువాత లోపలికి తీసుకెళ్ళి బీరువా తెరిచింది. అందులో నాలుగైదు అరలనిండా చీరలే వున్నాయి లెండి. ఒక చిన్న షాపులాగా ! ఒక్కొక్క చీరనే పైకి తీయడం, అంచు, పైట చెరగు, నేత దేనికది విడివిడిగా చూపించడం, ఆ చీర ఎక్కడ కొనిందీ, ఎంతకు కొనిందీ వివరించడం—యిలా ఒక ప్రదర్శనమే మొదలైంది. ఈ సత్కాథా కాలక్షేపం ఒక గంటసేపు కొనసాగిన తర్వాత నేనుండబట్టలేక ఒక మాటనేశాను....''

"చెప్పు రాజేశ్వరీ ! ఏమన్నావు ? ''

"చీరలన్నీ చాలా బాగున్నాయండీ ! కానీ ఏం లాభం ? కట్టుకుంటే చూచి ఆనందించడానికి ఎవరూ లేరు గదా! అనేశాను...''

నేను హతాశుడినై కుర్చీలో కూలబడిపోయాను.

రాజేశ్వరికి మాత్రం చీమ కుట్టినట్టయినా లేదు? ఆమె తనంతట తాను చెప్పుకపోతుంది.—" అమ్మగారి ముఖం అప్పుడు చూడాలి ? కళ్ళల్లో కన్నీళ్ళు. చూపుల్లో కోపాలు. ఉడుకు మోతనంతో బుసలు కొట్టిందనుకోండి ? పైన బడి నాఒళ్ళంతా రిక్కేస్తుందేమోననుకున్నాను. అంత పని జరగక ముందే పరుగెత్తు కొచ్చేశాను....''

* * *

'యుద్ధానంతర ప్రశాంతి' అంటారు గదా ! మాకు హెడ్‌మిస్ట్రెస్ గారికి మధ్య అలాంటి ప్రశాంతి నెలకొన్నట్టయింది. బడిలోనైతే ఒకరి ముఖం ఒకరు చూచుకోడం తప్పడం లేదు. కానీ మాటలు బాగా తగ్గిపోయాయి. ఆఫీసు రూంలో సంచలనమే లేదు. హెడ్‌మిస్ట్రెస్‌గారి వైఖరి చూస్తుంటే ఆమె బడికి బయల్దేరి వస్తున్నట్టులేదు. ఏదో సంతాప సభకు వచ్చి వెళ్తున్నట్టు వుంది. ప్యూను నరసయ్య ద్వారా మరికొన్ని వర్తమానాలు గూడా తెలియసాగాయి. ఎన్నడూ లేనిది ఈ మధ్య అతడు "అమ్మగారూ ! మీకు క్లాసుంది '' అంటూ జ్ఞాపకం చేయవలసి వచ్చిందట ! ఒకసారి అలా చెప్పడానికి వెళ్ళగా ఆమె విస్తుపోతూ "ఎక్కడిది ? నా కిప్పుడు క్లాసు లేదే ! '' అంటూ టైమ్ టేబిల్ చూచిందట. "అమ్మగారూ ! ఇప్పుడు జరుగుతున్నది ఉదయం కాదండీ ! సాయంకాలం '' అంటూ నరసయ్య పొరబాటును గురుకు తెచ్చేసరికి ఆమె ముఖం వెలవెల పోయిందట! "ఇదేం యిడ్డూరమండీ బాబూగారూ ! బడి వదలి పెట్టినా ఈమెకు యింటికి వెళ్ళాలన్న ధ్యాస లేదే ; పొద్దుపోయి దీపాలు వెలిగిన కుర్చీలో బొమ్మలా కూకుండి పోతుంది. 'అమ్మగారూ ! ఇంటి

కెళ్ళరా ' అని అడిగితే ఇంటికా నరసయ్యా ! ఎళ్ళాలి. నడిచే ఓపిక లేదు. ఓ రిక్షా తెచ్చి పెట్టు బాబూ ' అంటుంది. బాబు గారూ ! ఈవిడేమైనా ముసలిదా, ముతకదా ? మ్రోడులా అలా వుండి పోయిందెందుకండీ ? అంటూ నరసయ్య వాపోయాడు.

జీవితం ఒక సువర్ణ కలశం. కాలపురుషుడు వంతు వారీగా అందులో అమృతం కురిపిస్తాడు. సకాలంలో నువ్వు వెళ్ళవు. ఏమౌతుంది ? నీ కలశం ఖాళీగా వుండిపోతుంది.

నీడలా వచ్చి, నిశ్శబ్దంగా మసలుకుంటూ, నీరసంగా యింటికి వెళ్ళి పోతూ వచ్చిన హెడ్‌మిస్ట్రెస్ విమలాదేవి ఒకనొక సోమ వారం నాటి వుదయం తనకు మారుగా బడికి సెలవు చీటి పంపింది.

" జ్వరమంటే జ్వరం కాదండీ బాబుగారూ ! నిన్నటిదిన మంతా మూసిన కన్ను తెరవలేదు '' అన్నాడు నరసయ్య.

ఆ రోజు సాయంకాలం వీలయినంత త్వొందరగా యింటికి వెళ్ళాను. త్వరగా తెమలమనేసరికి సినిమా ప్రోగ్రాం కాబోలు ననుకుని మా ఆవిడ పరవశించి పోయింది. హెడ్‌మిస్ట్రెస్ గారి యింటి కనేసరికి ఆవిడ ముఖం చింతాకంతై పోయింది.

'' నేనా్రను ! అంతగా అవసరమైతే మీరు వెళ్ళండి '' అంటూ మంకుపట్టు పట్టింది.

'' కాదులే రాజేశ్వరీ ! మనం మానవులం. రాతి బొమ్మ లం కాము. కష్ట సమయాల్లో తోటి మనుషలను ఆదుకోలేక పోతే యిక మానవుల మనిపించుకోడానికి ఎలా పనికొస్తాం....''

'' చెప్పండి బాబూచెప్పండి. పరోపకారమే పరమధర్మ మనండి. మానవ సేవే మాధవ సేవ అనండి. టీచర్లుగదా, మీకు తెలియని నీతులా ?''

కానీ ఏమాట కామాటే చెప్పుకోవాలి. మనసు నవనీతం, పలుకు వజ్రాయుధం అంటారే_ఆమాట కొంతవరకూ ఆడవాళ్ళ విషయంలో గూడా నిజమేనేమో అనిపిస్తుంది. తీరా హెడ్ మిస్ట్రెస్‌గారి యింటికి వెళ్ళి ఆమె పరిస్థితిని కళ్ళజూచిన తరువాత రాజేశ్వరి విలవిలలాడిపోయింది. పడక సర్దింది. దుప్పటి సరిగ్గా కప్పింది. పేషంటుతలను తన ఒడిలోకి తీసుకొని నెమ్మదిగా కాఫీ త్రాగించింది. "అది కాదండీ ! జ్వరం యింత ముమ్మరంగా కాస్తోందిగదా! మాకొకమాట చెప్పిపంపకూడదా? మీకంత కాని వాళ్ళమై పోయామా మేము '' అంటూ మనసుకెంతో నొచ్చుకుంది.

'' చెప్పి పంపక పోయినా మీరొస్తారని నాకు తెలుసు'' సజల నయనాలలోనుంచి రాజేశ్వరివైపు చూస్తూ అంది విమలాదేవి.

అప్పటికి నేనొకణ్ణి అక్కడే వున్నట్టు రాజేశ్వరికి గుర్తు కొచ్చింది_ "అద్దమిటండీ ! అలానిల్చుండిపోయారు.! వెళ్ళండి. పరుగెత్తండి. డాక్టరు సూర్యనారాయణ గారిని తీసుకురండి. ఇక్క డున్నట్టుగా రావాలిమరి,....''

అరగంట సేపట్లో నేను డాక్టరు సూర్యనారాయణగారిని రంగంపైన ప్రవేశపెట్టాను. రోగిని పరీక్షించి, రోగనిదానంచేసి ఆయన ఒక ఇంజక్షను వేశాడు. తన ఇంజక్షను ప్రభావంవల్ల పది గంటలకల్లా ఒళ్ళంతా చెమటలుబట్టి జ్వరం తగ్గిపోతుందన్నాడు.

తనమాటలోని నిజానిజాలను మాకళ్ళ ఎదుట నిరూపించదల చినట్టుగా ఆయన మాతో బాతాఖానీ వేస్తూ అక్కడే కూర్చుండి పోయాడు.

" చాలా తేంక్సండీ డాక్టరుగారూ! పిలవగానే వచ్చేసే డాక్టర్లయితే వుంటారుగానీ, పేషంటుకు నయమయ్యేదాకా అక్కడే వుండిపోగల డాక్టర్లు చాలా అరుదు " అన్నాను.

" మరేం పర్వాలేదులెండి మూర్తిగారూ! నాకేమైనా పెళ్ళామా, బిడ్డలా! మిలిటరీ సర్వీసులోవుండి పోవడం మూలాన నేను సంసారం వూబిలో పడిపోలేదు. అవసరమైతే పేషంటును ఎంతసేపైనా కనిపెట్టుకొని వుండి పోగలను " నింపాదిగా అన్నాడు డాక్టరుగారు సూర్యనారాయణ.

* * *

జ్వరం పూర్తిగా తగ్గిపోవడానికి వారంరోజులు పట్టింది. శరీరంలో మళ్ళీ మునుపటి ఉత్సాహం పుంజుకోడాని కింకొకవారంరోజులు కావలసి వచ్చింది. డ్యూటీలో జాయినైన రోజున విమలా దేవిలో నవచైతన్యం కానవచ్చింది.

"జ్వరం వచ్చినా వచ్చిందిగానీ, వచ్చిన జ్వరం మీకు మేలే చేసినట్టుంది" అన్నాను.

ఆమె నవ్వింది.

ఆ నవ్వుకు అర్థమేమిటో నాకప్పుడు బోధపడలేదు.

ఆనాటి సాయంకాలం చిన్న ఆంతరంగిక సమావేశం ఒకటి జరిగింది.

" మూర్తిగారూ! మనం పెద్దవాళ్ళమైపోయాం. కానీ చిన్న నాటిగుణాలు కొన్ని యింకా మనల్ని అంటిపెట్టుకునే వున్నాయి. నా చిన్నతనంలో నేను నాతోటి పిల్లల దగ్గర ఓ అందమైన వస్తువు కనిపిస్తే ఓర్చుకోలేకపోయేదాన్ని. మంచిగానో, చెడ్డగానో దాన్ని నాస్వంతం చేసుకోవాలనిపించేది. మనకు లేని అందమైన వస్తువు యింకొకరికుండగూడదు. మనకు దక్కని ఆనందం యింకొకరికి దక్కకూడదు. నాలోని ఈ అవగుణంవల్ల నేనెన్నోసార్లు మీ మనసుకు నొప్పి కలిగించివుంటాను. అందుకు మీరు నన్ను మన్నించాలి..."

"ఎంతమాట!మిమ్మల్ని నేనుమన్నించడమేమిటి? "అన్నాను.

" బహుశా మీకు జ్ఞాపకంవుండి వుంటుంది. పటం క్రిందపడి అద్దం పగిలిపోతే, నేను దాన్ని తీయించి లైబ్రరీలో బీరువాల వెనుక పెట్టించాను..."

" అవునవును. ఇప్పుడా ప్రసక్తి ఎందుకు?" అన్నాను.

" ఇప్పుడందుకు నేను డబ్బిస్తున్నాను. దయచేసి మీరు దానికి అద్దం వేయించి యథాస్థానంలో పెట్టించాలి..."

"అలాగే మేడమ్, అలాగే!"

* * *

ఆ తరువాత నెలరోజులకు కన్యాకాపరమేశ్వరి ఆలయంలో విమలాదేవి పెళ్ళి వైభవంగాజరిగింది. తన జీవితకాలాన్ని పూర్తిగా ఒక పేషంటుపైన డివోట్ చేయడానికి డాక్టరు సూర్యనారాణ అంగీకరించాడు. నూతన దంపతుల్ని గౌరవించడంకోసం మేము ప్రేయర్‌హాల్లో విందు ఏర్పాటు చేసినప్పుడు పతిదేవుడి సరసన కొలువు దీర్చిన అలివేలుమంగమ్మ ముసిముసి నవ్వులువెద జల్లింది.

బంగ్లాదేశ్‌కు

భారత ప్రజల మద్దతు

ప్రజాస్వామ్య జీవనానికై తమ ప్రాణాలను కూడా లెక్క చేయకుండా వీరోచితంగా పోరాటం జరుపుతున్న తూర్పు బెంగాల్ ప్రజలపట్ల ప్రగాఢ సానుభూతిని, సంఘీభావాన్ని వ్యక్తంచేస్తూ, బలప్రయోగానికి వెంటనే స్వస్తి చెప్పాలని, నిరాయుధులైన ప్రజలను పైశాచికంగా వధించే విధానాన్ని విడనాడాలని భారత పార్లమెంటు మార్చి 31వ తేదీన చేసిన తీర్మానంలో కోరింది.

తీర్మానం పూర్తి పాఠం

"1. తూర్పు బెంగాల్‌లో ఇటీవల పరిణామాలపట్ల ఈ సభ తీవ్రంగా ఆందోళనను, ఆవేదనను వక్తం చేస్తున్నది. తూర్పు బెంగాల్ ప్రజల మనోభిప్రాయాలను మనోవాంఛలను అణచివేసే దృష్టితో, పశ్చిమ పాకిస్తాన్‌నుంచి తరలింపబడిన సాయుధ దళాలు మొత్తం తూర్పు బెంగాల్‌పై సామూహిక దాడిని జరుపుతున్నవి.

2. 1970 డిసెంబరులో పాకిస్తానులో జరిగిన ఎన్నికల ద్వారా ప్రజలు తమ మనోవాంఛను వ్యక్తం చేసినప్పటికీ, వారి అభీష్టాన్ని గౌరవించడానికి బదులు ప్రజలను అణచివేయడానికే పాకిస్తాన్ ప్రభుత్వం నిర్ణయించింది.

3. చట్టబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అధికారాన్ని బదిలీ చేయడానికి పాకిస్తాన్ ప్రభుత్వం నిరాకరించడంతో పాటు జాతీయ అసెంబ్లీని తన అధికారాలకు, సార్వభౌమాధికార పాత్రను వహించడానికి వీలులేకుండా ప్రభుత్వం నిరోధించింది. మరతుపాకులు, టాంకులు, యుద్ధ విమానాల ద్వారా తూర్పు బెంగాల్ ప్రజలను పైశాచికంగా అణచి వేయడానికి పాకిస్తాన్ ప్రభుత్వం నిర్ణయించింది.

4. పాకిస్తాన్‌తో స్నేహ సంబంధాలకు శాంతియుత సంబంధాలను నెలకొల్పుకోనాలని భారత ప్రజలు భారత ప్రభుత్వం కూడా ఎల్లప్పుడు అభిలషిస్తున్నారు. ఇండియా మాదిరిగానే తూర్పు బెంగాల్ కూడా ఈ ఉపఖండంలో ఉన్నది. ప్రజలకు ఎన్నో శతాబ్దులుగా సాంస్కృతిక సంబంధాలు వున్నవి. మా సరిహద్దుకు అతిసమీపంలోనే వున్న తూర్పు బెంగాల్ ప్రజలపై ఘాతుకచర్య జరుగుతుండగా ఈ సభ మౌనంగా ఉండజాలదు. నిరాయుధులైన, అమాయకులైన ప్రజలపై అసాధారణమైన రీతిలో సైన్యాలు సాగిస్తున్న పాశవిక చర్యను భారతదేశంలోని ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించారు.

5. ప్రజాస్వామ్య జీవనానికై సాగిస్తున్న పోరాటంలో తూర్పు బెంగాల్ ప్రజలకు ఈ సభ తన ప్రగాఢ సానుభూతిని సంఘీభావాన్నీ వ్యక్తీకరిస్తున్నది.

6 శాంతిపట్ల ఇండియాకు ప్రగాఢ విశ్వాసం వున్న దృష్ట్యా, మానవస్వత్వాల పరిరక్షణకు ఇండియా కృత నిశ్చయంతో వున్నదృష్ట్యా, తూర్పుబెంగాల్‌లో నిస్సహాయులైన ప్రజలపై సైన్యాల పైశాచిక చర్యలను, దారుణ మారణ హోమాన్ని వెంటనే నివారించాలని, బలప్రయోగానికి స్వస్తి చెప్పాలని ఈ సభ గట్టిగా కోరుతున్నది. తూర్పు బెంగాల్ ప్రజలను నిర్ణీత పద్ధతి ప్రకారం మునుముందుగా సైన్యాలు వధించడాన్ని వెంటనే నిలిపివేయ వలసిందిగా పాకిస్తాన్ ప్రభుత్వానికి నచ్చచెప్పాలని, అందుకు తక్షణమే నిర్మాణాత్మకమైన చర్యలు గైకొనాలని ప్రపంచంలోని అన్ని దేశాలకు ప్రభుత్వాలకు ఈ సభ విజ్ఞప్తి చేస్తున్నది.

7. ఏడున్నరకోట్ల తూర్పుబెంగాల్ ప్రజల చరిత్రాత్మక ఉద్యమం విజయవంతం కాగలదని ఈ సభ ప్రగాఢంగా విశ్వసిస్తున్నది. తమ పోరాటంలో త్యాగాలలో తూర్పు బెంగాల్ ప్రజలకు భారత ప్రజల హృదయపూర్వక సానుభూతి, మద్దతు ఉండగలదని ఈ సభ తూర్పుబెంగాల్ ప్రజలకు హామీ యిస్తున్నది.

రాష్ట్రంలో 50 వేలమంది బంగ్లా శరణార్థులకు పునరావాసం

బంగ్లా శరణార్థులకు పునరావాసం కల్పించే కార్య క్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 50 వేలమంది శరణార్థులను స్వీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించినట్లు రాష్ట్ర కార్మిక, పునరావాస శాఖ మంత్రి శ్రీ జి. సంజీవరెడ్డి జూన్ 8వ తేదీన ప్రకటించారు.

ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డితో చర్చించిన తరువాత పత్రికలవారితో మాట్లాడుతూ శ్రీ సంజీవరెడ్డిపై విషయం తెలిపారు.

ఈ శిబిరాలకు అయ్యే ఖర్చునంతా కేంద్రమే భరించనున్నదని, శరణార్థులు ఈ వారంలోనే రాష్ట్రానికి రానున్నారని ఆయన తెలిపారు.




ప్రజాస్వామ్య పథంలో ప్రయాణం

1971 మార్చిలో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికలు దేశంలోనూ, విదేశాల్లోనూ ఎంతో ఆసక్తిని రేకెత్తించాయి.


దేశంలోని మిగతాచోట్ల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లోకూడా ఆడామగా, ముసలీముతకా అందరూ తమ ఓటుహక్కును క్రమశిక్షణాయుతంగా వినియోగించుకున్నారు. ఆ దృశ్యాలను కొన్నిటిని ఇక్కడ పొందుపరుస్తున్నాం.















బాలల విజ్ఞాన వికాసానికి కొత్తదారులు

బాలల్లో నిబిడీకృతమైవున్న సృజనాత్మక శక్తులను వెలికి తీసి వారి విజ్ఞానాన్ని విస్తృత పరచడమే హైదరాబాదులోని జవహర్ బాలభవన్ ప్రాథమిక, ప్రాతిపదిక ఆశయం.


ఎడమవైపు పైన సుందర చిత్రకళా ప్రాంగణంలో బాలలు


ఎడమవైపు క్రింద : మణిపురి నృత్యాన్ని ప్రదర్శిస్తోన్న బాలికలు

పైన : పడవనడుపుతోన్న బాలురు

క్రింద : రామాయణ నృత్యనాటకాన్ని ప్రదర్శిస్తోన్న బాలికలు







జవహర్ బాలభవన్

అవకాశాలు లేక అణగారి పోతున్న అనేకమంది బాల బాలికలలోని సృజనాత్మక శక్తిని వెలుగులోకి తేవాల్సిన అవసరాన్ని, ప్రాముఖ్యతనూ గుర్తించిన ఆధునిక విద్యావేత్తలు, బాలల విద్యావిధానాలలో నూతన పద్ధతులను ప్రవేశపెడ్తూ విద్యా సంస్థలను నెలకొల్పారు.

బాలల భౌతిక, మానసిక, భావనా పటిమల పెంపుదలతో అవినాభావ సంబంధం కలిగి, నేటి విద్యా విధానంలో లోపించిన పైన పేర్కొన్న లక్ష్యాన్ని సాధించడానికి దేశంలోని అనేక ప్రాంతాలలో జవహర్ బాలభవనాలను నెలకొల్పారు.

నెహ్రూ స్మారక నిధి సహాయంతో హైదరాబాదులోని పబ్లిక్ గార్డన్‌లో శ్రీ జవహర్ లాల్ నెహ్రూ పేరుతో ఒక బాలభవన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థాపించింది. 1966 జూన్ 23వ తేదీన శ్రీమతి ఇందిరాగాంధీ యీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు.

సంప్రదాయికమైన విద్యాబోధనతోని అపూర్వమైన సంస్థ జవహర్ బాలభవన్. బాలల అభిరుచిని అనుసరించి వారికి పరీక్షలను నిర్వహించడం జరుగుతుంది. బాలలకు తమ అభిప్రాయాలకూ, ఆలోచనలకూ రూపకల్పన చేసే స్వేచ్ఛ యివ్వబడుతుంది. ఆట పాటలతో ఆనందంగా గడిపే అవకాశం కల్పించబడుతుంది

సృజనాత్మక కళల పెంపుదల కార్యక్రమం

ఈ విభాగం క్రింద బాలల భావనాపరిధిని విస్తృతపరచే విధంగా కార్యక్రమాలను రూపొందిస్తారు. భావప్రకటననూ, సౌందర్యపిపాసను పెంపొందించడంలో కళలు దోహదం చేస్తాయి.

విద్యా పథకాలలోను, బాలల పెంపకంలోనూ సృజనాత్మక కళలు గర్వకారణమైన పాత్ర వహిస్తాయి. చిత్రకళలు, అన్ని రకాల వస్తువులతో నిర్మాణం పనులు, బంకమన్ను పనులు మృణ్మయ పాత్రల తయారీ పనులు. ప్రదంగం పథకాలు బాలభవన్‌లో నిర్వహిస్తున్నారు.

సంగీత. నృత్య. నాటక కార్యక్రమాలు

వస్తువుల నిర్మాణంలోను కదలికలలోను అంతర్గతంగా యిమిడిఉన్న లయ విన్యాసాలతో బాలబాలికలకు లలిత కళల ద్వారా పరిచయం ఏర్పడుతుంది.

గాత్ర సంగీతం, వాద్యసంగీతం, బృందగానం, జానపద సంగీతం, జాతీయగీతాలు, నృత్యం, జానపద నృత్యం, శాస్త్రీయ నృత్యాలను యిక్కడ నేర్పుతారు. తోలు బొమ్మలాటకూడ నేర్పాలని ఉద్దేశించారు.

శాస్త్రవిజ్ఞానం

ఆధునిక సాంకేతిక యుగంలో శాస్త్ర విజ్ఞానానికి గల ప్రాముఖ్యతనుగూర్చి బాలలకు తెలియ జేయడం చాలా అవసరం. శాస్త్రవిజ్ఞానంలో ప్రత్యక్ష ప్రబోధానికి మోడల్స్‌తోపాటు వాతావరణ పరిశోధన కేంద్రం, ఉపరితల అబ్జర్వేటరీ, ఖగోళ పరిశోధన కేంద్రం, రేడియోక్లబ్, ఎలక్ట్రికల్ క్లబ్, సైన్స్‌లెబరెటరీ, సైన్స్ మ్యూజియం మొదలైన వాటిని యిక్కడ నెలకొల్పారు.

సాహిత్య కార్యక్రమాలు

పాఠశాలలు చాలావరకు నిర్ణీత పాఠ్యపుస్తకాల బోధనకే పరిమితమై ఉన్నాయి. సాహిత్య కార్యక్రమాలద్వారా యీ పరిమితిని అధిగమించవచ్చు. వినోద విజ్ఞానానికి పఠనం, సృజనాత్మక రచన, వక్తృత్వం, సమావేశాల నిర్వహణలో అనుభవం, లాంఛనప్రాయమైన చర్చలు నిర్వహించడంవంటి కార్యక్రమాలు యీ విభాగంలో జరుగుతాయి.


వ్యాయామ కార్యక్రమాలు

బాలల శరీర సౌష్టవాన్ని పెంపొందించి, ఆరోగ్యవంతులుగా చేయడానికి అనేక క్రీడలను నిర్వహిస్తున్నారు, ఈత కొలను వగైరాలను ఏర్పాటుచేశారు.

పాఠశాల సర్వీసులు


బాలభవన్‌ను పిల్లలు తరచుగా సందర్శించడానికి స్థానిక పాఠశాలలు యీ సంస్థతో ఏర్పాట్లు చేసుకోవచ్చు.

ఇతర కార్యక్రమాల అమలుకు తగిన సౌకర్యాలు, వసరులు లేని పాఠశాలలు బాలభవన్ కార్యక్రమాలలో సభ్యులుగా చేరవచ్చు. తమ పాఠశాలలలో యిటువంటి కార్యక్రమాలను అమలు జరపడంలో అనుభవం గడించడానికి వీలుగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు యిక్కడ శిక్షణ పొందవచ్చు. విద్యావిషయకమైన చలన చిత్రాలను సభ్యత్వం గల పాఠశాలలు యిక్కడినుండి పొందవచ్చు. 5–15 సంవత్సరాల మధ్య వయస్సుగల బాలబాలికలందరూ వ్యక్తిగతంగా బాలభవన్ సభ్యత్వాన్ని పొందవచ్చు.



1971 జనవరి 26న ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ దినోత్సవ విన్యాస ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికిచెందిన అలంకృత శకటం

నిత్య జీవితంలో సౌందర్యారాధన



ఆచంట జానకిరామ్

"మీరు వెళ్ళిపోయారు; కాని మీ దోసిలిలోని పువ్వుల పరిమళము మా నట్టింట ఇంకా వీస్తూనే ఉంది !''— మన ఆప్తులు మనల గురించి అనేక విధాల జ్ఞాపకము చేసుకుంటూ ఉంటారు. నన్ను గురించిన జ్ఞాపకం పారిజాతపు సువాసనలతో మిళితమై ఉండడము నా భాగ్యమే ! ఎప్పటికీ ఇల్లాగే ఉండాలని ఉంది. పూవుల సువాసనతో కొందరికీ, పున్నమ చంద్రుని పండువెన్నెలతో కొందరికీ, తెలిమంచు వదనాన్ని విదళించుకొని కన్నులు మిరుమిట్లు గొలిపే సూర్యకిరణాలతో కొందరికీ నేను జ్ఞాపకం వస్తూ ఉండడము కంటె కావలసిన దేమిటి ?

కిటికీలోంచి చూస్తూ ఉంటే ఎంతో ఆనందంగా ఉంది. రకరకాల మందారాలు, వానివెనుక చిరుగాలికి ఇటూ అటూ కదలుతూ, అచ్చంగా ముసిముసి నవ్వులు నవ్వుతూ ఉన్న మాలతీ తీగ, ఆపైన పచ్చిక బయలు, ఇంకా అవతల గుబురుగా పెరిగిన నిద్రగన్నేరు గుంపులోంచి కావేరి పాయనీరు ఎక్కడ ఆఖరో, ఆకాశం ఎక్కడ ప్రారంభమో తెలియడం లేదు; ఎంత నిర్మలమైన ఆకాశమో ! ఇంత నీలి ఆకాశమూ సాయంత్రమయ్యేసరికి రంగు రంగుల మబ్బులతో నిండిపోతుంది. ఎక్కడనుంచి వస్తాయో ఆ మబ్బులు ! ఎవరు కలిపారో ఆ రంగులు !

ఆ మధ్య ఒక మహాసభలో నేను ప్రసంగించే అవకాశం కలిగింది. సభ ఒక బ్యాంక్ భవనపు పై డాబామీద ఏర్పాటు చేశారు. ప్రొద్దుగూకే వేళ. నా ప్రసంగము ప్రారంభించే సరికి పడమట అద్భుతమైన సూర్యాస్తమయం అవుతోంది. నేను సభ వారి నుద్దేశించి అన్నాను. "ఈ నిమిషము పడమట అద్భుతమైన సూర్యాస్తమయము అవుతోంది. మీలో ఎందరు కన్నులు మిరుమిట్లు గొలిపే ఈ సుందర దృశ్యాన్ని చూస్తున్నారు ?" అని ప్రశ్నించాను. రెండువందల మంది సభికులలో ఒక్కరు మాత్రం చేయి పైకెత్తి ''నేను చూస్తున్నాను !'' అన్నారు. తతిమా వారు అందరూ మనస్సులో జరుగనున్న సభను గురించీ అందు తాము వహించవలసిన పాత్రగురించీ వ్యాకుల పడుతున్నారు.

నేటి మన జీవితమంతా ఈ విధంగానే గడిపేస్తున్నాము. మన పరిసర ప్రపంచంలో ఎంతో అందమున్నది. కాని దీనిని గుర్తించే అలవాటు పోగొట్టుకున్నాము. కొందరు ఇటువంటి సుందర దృశ్యాలను చూచి చకితులు కావడానికి తమకు తీరిక లేదంటారు. కాని నా ఉద్దేశంలో వేయి రూపాయలు ఆర్జించడం కంటె ఒక దృశ్యాన్ని చూడడం వల్లనో, ఒక అందమైన చిత్రమును చిత్రించడం వల్లనో కలిగే మానసికమైన ఆనందము గొప్పది.

అందమైన వస్తువులను లేక దృశ్యములను చూచి ఆనందించగల్గడము ఒక భాగ్యమే ! ఇది అందరూ అనుభవింపలేదు. కాని ఈ రసదృష్టి పుట్టకతో లేకపోయినా సరియైన సహవాసమువల్లా, కొంత చదువువల్లా మనం అలవరచుకోవచ్చు. మనం మన పిల్లలకు అలవరచవచ్చు. కాని, ఎందరు తల్లులకు అంత ఓపిక ఉంటుంది ! "ఇది తప్పు" —"ఇది చేయకూడని పని ! చేస్తే నాన్న కొడతాడు ;" అంటూ పిల్లల్ని పెంచుతారే గాని "ఇది ఎంత అందంగా ఉందో ! ఈ పువ్వు ఎంత సొగసుగా ఉందో ! ఆ పక్షి రెక్కలు చూడు ఎంత అందంగా ఉన్నాయో !" అంటూ పిల్లలకు సౌందర్యంతో పరిచయం కలిగించే తల్లులు ఎంత మంది ఉన్నారు !

మనం పరికించి చూడము కాని మనచుట్టూ ఎంత అందమున్నదో ! ఒక్కొక్కప్పుడనిపిస్తుంది. ఇంతటి అందమూ మన కోసమేనా అని—అవును! మనకోసమే !! అయితే, నైసర్గికంగా ఉద్భవించి అతిశయిస్తోన్న అందాన్ని సంస్కారములేని మానవుడు



" పద్మపాణి బోధిసత్వ "—అజంతాకుడ్య చిత్రం


హర్షింపలేక పోవడము అలావుండగా ఆ అందాన్ని పాడుచెయ్య గలడు కూడాను! మన తీర్థయాత్రాస్థలాలలో ఇది మరీ మరీకనబడు తూంటుంది. మన తీర్థయాత్రస్థలాలు. ఇంచుమించు అన్ని సౌందర్యవంతమైనవి. కాని, కొన్ని పాతుకుపోయిన మూఢ విశ్వాసాల వల్ల యాత్రీకులలో ఎవరో కొందరు గాని, ఈ అందాన్ని గుర్తించరు. మన పురాతన దేవాలయాలు అద్భుతమైన నగిషీపనికి ఆలవాలు. కాని, తండోపతండములుగ వచ్చే యాత్రికులు ఈ కళాఖండాలను గుర్తింపరు. నావంటివారెవరైనా పనిగట్టుకు వారికి ఈ శిల్ప సౌందర్యమును విశదపరచడానికి ప్రయత్నించినా ఈ అందాన్ని చూచి ఆనందించడానికి వారికి తీరికా ఉండదు, ఓపికా ఉండదు.

ఎటువంటి పరిస్థితులలోనూ అందాన్ని పూర్తిగా ఆస్వాదించ గల శక్తి కవికీ, చిత్రకారునికీ, యోగికీ మాత్రమే ఉన్నాయి. ఎటొచ్చీ యోగికి బాహ్య సౌందర్యంతో నిమిత్తంలేదు — అతడు చక్షువులద్వారా సౌందర్యమును గుర్తించే దృష్టికి అతీతమైన దృష్టి అలవరచుకున్నాడు కాబట్టి. కాని, కవికీ చిత్రకారునికీ అందమే జీవము. అందుచేతనే వారు ఏ మాత్రపు అందవికారాన్నీ సహింపలేరు. తోటివారు సుందరమైన వస్తువులను, సుందరమైన అభిప్రాయాలను ఏ మాత్రము నిరసించినా కవీ చిత్రకారుడూ అపరిమితంగా బాధపడతారు. ప్రతి చిన్న వస్తువులోనూ సౌందర్యము మూర్తీభవించి ఉన్నదనీ, అందమైన వస్తువుల దెస చేసిన అపచారము సృష్టికర్త దెస చేసిన అపచారమే అని మనం ఎందరం విశ్వసిస్తున్నాము! క్షమింపరాని ఉదాసీనత వల్లనో అమానుషమైన కాఠిన్యము వల్లనో ప్రతి నిమిషమూ సౌందర్యాన్ని నిరసిస్తూ ఉన్నారు, మనలో ఎందరో!

నిజానికి సౌందర్యాన్ని పూర్తిగా అనుభవించే శక్తి అంత కష్టంకాదు. జన్మతః మనకందరికీకూడా అందమంటే అభిమానమే! తొట్టిలో ఏడుస్తూ ఉన్నపాప. పైన పాలవెల్లి నుండి వ్రేళ్ళాడే రంగురంగుల పాదరసపు బుడ్లను చూచి, మనము చేతికందించె లక్కపిడతలను చూచి ఏడుపు మానుతుంది. కాని, ఆ శిశువే ఎదిగిన కొలదీ అందాన్ని పాటించవచ్చు పాటించక పోవచ్చు. ఇది ఆ పాపను పెంచేవారి సంస్కారమును బట్టి ఉంటుంది.

జన్మతః మనకందరికీ కూడా అందమంటే అభిమానమే! కాని కాలక్రమేణా కొందరు జీవితపు యంత్రములో నలిగిపోతూ అందాన్ని గుర్తించి అనుభవించే శక్తిని పోగొట్టుకుంటారు. ఏ కొందరో జీవితమంతా ఒక ఎడతెగని కళారాధనగా గడిపివేస్తారు.

ఈ కళారాధకుని కళోపాసన రెండువిధాల సాగుతుంది. ఒకటి ప్రపంచమంతటా గొప్ప చిత్రకారులు యుగయుగాలనుండి చిత్రించిన శిల్పములను. చిత్తరువులను చూచి ఆనందించడము. రెండవది తానే చిత్రకళ నభ్యసించి అందమైన శిల్పములను, చిత్తరువులను సృష్టించడము. ఈ వ్యాపకము మనకు వర్ణింపనలవికాని ఆనందాన్నిస్తుంది. ఒకప్పుడు మనము సృష్టించిన కళాఖండములను చూచి మనమే ఆశ్చర్యపోతాము. నా విషయంలో నా చిన్నతనంలో మా నాన్నగారు నాకు చిత్రకళ నేర్పించడానికి యత్నించారు. కాని, అప్పట్లో నాకు రాలేదు. ఒకముప్పై ఏళ్ల తరువాత ఒకరి ప్రోద్బలంవల్ల ఒక చిత్రకళా సంఘానికి కార్యదర్శినై పలువురు చిత్రకారుల చిత్తరువులను ప్రదర్శించి వారికి అనేక విధములుగ ప్రోత్సాహము కలిగింపజేశాను. ఈ వ్యాపక



హంపి రథం (విజయనగర శిల్పం); క్రీ. శ. 16వ శతాబ్దం

ములో నిమగ్నుడనై ఉన్న నన్నుచూచి ఒక ప్రఖ్యాత చిత్రకారుడు "జానకిరామ్ బొమ్మలు చిత్రించలేడు గదా! అతను ఈ చిత్రకారుల సంఘానికి కార్యదర్శిగా ఉండడమేమిటి?" అని ఈసడించాడు. వెంటనే నేను బజారుకువెళ్ళి ఒక ముప్పావులాకు రంగులపెట్టె, రెండు కుంచెలు కొని సాధారణ కాగితముపై నా మనస్సులో నిలిచిన ఒక సుందర దృశ్యాన్ని చిత్రించాను. కొండలు, కొండల వెనక ఆకాశము, కొండల ముందు ప్రవహిస్తున్న నది, నది ఒడ్డున గుబురుగా ఎదిగినచెట్లు— బొమ్మ బాగానే కుదిరింది. తరువాత చాలా శ్రేష్టమైన రంగులపెట్టె కొని, మంచి కాగితంపైన మంచి కుంచెలతో కొన్ని బొమ్మలు వేశాను. ఆ రోజులలో ప్రఖ్యాత చిత్రకారుడు దేవీ ప్రసాద రాయ్‌చౌధురితో నాకు పరిచయమై ఆ పరిచయము స్నేహంగా వర్ధిల్లినది. వారికి నా బొమ్మలు చూపగా వారన్నారు. "నీవు ప్రప్రథమముగా కవివి, కాబట్టి నీ బొమ్మలలో కళకంటే కవిత్వం ఎక్కువగా ఉంటుంది. మంచి బొమ్మలు ఎలా వెయ్యాలో నేను నేర్పుతాను. అన్నారు. వారివద్ద చేసిన శుశ్రూష ఫలితంగా నేను పదిహేను బొమ్మలు చిత్రించాను పదిహేనవ బొమ్మ "కుపిత" — అనే బొమ్మను వారి వద్దకు తీసుకొని వెళ్ళగా ఆ బొమ్మను అల్లంత దూరాన చూచి సంభ్రమముతో "భేష్! బొమ్మ చాలా బాగా కుదిరింది ఇంక నీవు నా దగ్గర నేర్చుకోవలసినది ఏమీలేదు. స్వయం కృషి వల్లనే ముందుకు రాగలవు" అన్నారు. తరువాత నేను చాలా బొమ్మలు వేశాను. ఆ రోజులలో సినిమా నటయిత్రి నర్గీస్ నటన అంటే నాకు చాలా ఇష్టం. ఆమె బొమ్మ పూర్తిచేశాను గాని కంటిపాపలు చిత్రించడానికి భయపడ్డాను. అప్పుడు కళ్ళు రెండూ గట్టిగా మూసుకుని రెండు నిమిషాలు ఒక విధమైన



దాక్షిణాత్య దేవాలయానికి చెందిన రథముపైని దారు శిల్పం



సింహతలాటపు నమూనా—ఒక భాగం (అడివి బాపిరాజు)

తపస్సు చేసి ఆ నేత్రములను నా మనోవీధిని స్థిరపరచుకుని కొండంత ధైర్యముతో ఆ బొమ్మకు కనుపాపలమర్చాను. వెంటనే నా ఎదుట నున్న చిత్తరువునకు ఎక్కడలేని జీవకళ ఉట్టిపడింది. బొమ్మయేకాక గది అంతాకూడా ఒక నవ చైతన్యముతో నిండిపోయింది. సిద్ధహస్తుడైన చిత్రాకారుడు సృష్టికి ప్రతిసృష్టి కల్పింపగలరు. కాని, ఇందుకు ఎంతో సాధన కావాలి

సౌందర్యోపాసకుని ఉపాసన నాలుగు మెట్లుగా పరిణతికి వస్తుంది. మొదటిది ఆసక్తి—అంటే అందమైన శిల్పములను, చిత్తరువులను, దృశ్యములను చూచి నేత్రానందము పొందగలెననే ఆసక్తి. తరువాత పరిచయము–అంటే యుగయుగాలనుండి చిత్రకారులు, శిల్పులు చిత్రించిన చిత్తరువులతోను, చెక్కిన శిల్పములతోను పరిచయము. ఈ పరిచయముద్వారా కొంతకాలానికి విచక్షణ ఏర్పడుతుంది. అంటే, చూచీ చూడడముతోనే "ఈ కళాఖండము మొదటి శ్రేణికి చెందినది, ఇది రెండవ శ్రేణికి చెందినది, ఇది మూడవ శ్రేణికి చెందినది" అని విడదీయగల నేర్పు. ప్రస్తుతము నేను ఉంటూ ఉన్న పరిస్థితులను బట్టి తరచు చిత్రకళా ప్రదర్శనములలో ఒక 'జడ్జి' గా ఉండవలసి వస్తూఉంటుంది. అప్పుడు నా ఎదుట ఉన్న నూరు బొమ్మలలో మూడేమూడు నిమిషాలలో "ఈ బొమ్మకు మొదటి బహుమతి, ఈ బొమ్మకు రెండవ బహుమతి, ఈ బొమ్మకు మూడవ బహుమతి" అని విడదీసి చెప్పగలను. ఇతిమ్మా 'జడ్జీ'లున్నా, సర్వసాధారణముగా



శిల్పసుందరి (హాలిబేడ్-బేలూరులోని శిల్పం) (హోయసల శిల్పం)

నా అభిప్రాయంతో ఏకీభవిస్తుంటారు. కళోపాసనలో నాల్గవ మెట్టు సౌందర్యానుభూతి. అనేక సుందర దృశ్యాలను, అనేక సుందరమైన శిల్పాలను, అందమైన చిత్తరువులను ఆసక్తితోను, విచక్షణతోను చూచిన అనుభవాల పరిపక్వమే సౌందర్యానుభూతి. ఈ అనుభూతి కలగడము గొప్ప అదృష్టమే అనవచ్చును. ఇచ్చట మనము గమనింపవలసిన ఒక విషయము : మనము చూచి ఆనందించే ఒకానొక సూర్యాస్తమయమువల్ల కలిగే మానసికమైన సౌందర్యానుభూతి ఒకే ఒక సూర్యాస్తమయము చూడడమువల్ల మనలో కలిగిన అనుభూతి కాదు; యుగయుగాలుగా—ఆదిమ మానవుని నుండి నేటి వరకు— నవ జాతి చూచి ఆనందించిన సహస్రానేక సూర్యాస్తమయ దృశ్యములలోని సౌందర్యము మనలో ఇమిడి ఉన్నది. ఈ కళాదృష్టిని పెంపొందింప చేసికొనుట ద్వారా మన జీవితము ధన్యతను గాంచుచున్నది.


సుందరమైన దృశ్యములను, చిత్తరువులను, శిల్పములను చూచి ఆనందించడము చిత్రకారుని ప్రత్యేకమయిన హక్కు కాదు. సాధరణ జనులున్నూ వారివారి అంతరమును బట్టి ఈ కళాఖండములను చూచుట ద్వారా కొద్దిగానో గొప్పగానో ఆనందమును పొందవచ్చును. మన ఆంధ్రప్రదేశ్‌లో ఒక చిత్రకళా సంస్థ యాజమాన్యమున దేశమంతటా చిత్రకళా ప్రదర్శనములు జరుగుతూ ఉంటాయి. ఈ ప్రదర్శనములలో సమకాలిక చిత్రకారుల యత్నములు లోకానికంతా విశదమౌతుంటాయి. ప్రతి చిత్తరువు లోని అందమును సాధారణులకు సైతము విశదపరచడానికి సిద్ధహస్తులైన చిత్రకారులు ఈ ప్రదర్శనలతో పర్యటిస్తూ ఉంటారు.

భారతదేశము అద్భుతమైన శిల్పాలకు పుట్టినిల్లు. పూర్వము మన శిల్పులు తమ శిల్పకళను ఒక యోగముగా అనుష్ఠిస్తూ వచ్చేవారు. ఉత్తమ శిల్పి భగవద్గీతలో చెప్పినట్లు బహుజన రంజకుడు. ఇష్టాఇష్టములు లేనివాడు. శీతోష్ణములను, మంచి చెడుగులను, చీకటి వెలుగులను ఏకదృష్టితో చూడగలిగేవాడు. అతడు పార్వతి వంటి ఒక శిల్పాన్ని తయారు చేసే ముందు మూడు పూటలు పస్తుండి ఒక రాత్రి జాగరణచేసి వేకువనే స్నానముచేసి, నిష్ఠాపరుడై మంత్రోచ్ఛారణతో శిల్పమును చెక్కడం ప్రారంభించేవాడు. తన పనికి ఉపక్రమించేముందు కనులు రెండు గట్టిగా మూసుకుని విశ్వకర్మనుద్దేశించి చేతులు జోడించి " స్వామీ ! నేను సృష్టింపదలచిన శిల్పాకారమును ప్రస్ఫుటముగ నా అంతరంగమున నిలువనిమ్ము " అని ప్రార్థించేవాడు. ఇంతటి యోగబలముతో నిర్మితమైన దేవతాకృతి ప్రపంచములోని కళాప్రియులందరకు మహోత్కృష్టమైన ఆనందాన్ని కలిగించడంలో ఆశ్చర్యం లేదు.

ఇటువంటి గొప్ప కృషికి నిదర్శనములుగా కొన్ని శిల్పముల ప్రతి రూపములను ఇచ్చట పొందుపరచి యున్నాను. మొదటిది ఔరంగాబాదుకు సమీపాన ఉన్న అజంతా గుహలలోని 'పద్మపాణి బోధిసత్వ' అనే కుడ్యచిత్రము. ఇది ఇంచుమించు మూడువేల ఏండ్ల క్రితము ఆంధ్ర బౌద్ధ సన్యాసులు చిత్రించినది అని తెలుసుకోవడము మనకు గర్వకారణము.

రెండవది మైసూరులోని హాసన్ పట్టణానికి సమీపాన ఉన్న హాలిబేడ్_బేలూర్ లోని 'శిల్పసుందరి'. జీవకళ ఉట్టిపడుతూన్న ఈ శిల్పమును సుమారు క్రీ. శ. 1,117 ప్రాంతములలో శిల్పులు చెక్కారు. తరతరాల యాత్రికులకు అసాధారణ సౌందర్యానుభూతిని కలిగించినది.

మరొక బొమ్మ విజయనగర సామ్రాజ్య ముఖ్యపట్టణమై వెలసిన హంపీలోని శిలారథము (క్రీ. శ. 16వ శతాబ్దము). చాలాకాలము శిల్పకళా విమర్శకులు ఈ రథము మహాబలిపురములో ఉన్న సప్త రథములవంటి ఏకశిలారథము—అంటే ఒకే ఒక పెద్దరాతినుండి చెక్కినది, అనుకొనేవారు. కాని, తరువాత తరువాత మరికొంత నిశితమైన పరిశీలనతో ఈ రథము శిల్పులు అతనిపుణతలో చెక్కిన ఒక రాతిపై మోపిన ఇంకొక రాయిద్వారా నిర్మితమైన రథమని తెలుసుకొన్నారు. హంపీశిల్పములలో మనము చూడవలసిన శిల్పములు ఎన్నో ఉన్నాయి.



దంతపు నగిషీ ఫోటో ఫ్రేమ్
(విశాఖ, తిరువనంతపురాలలో దొరుకుతుంది)

దక్షిణ ప్రాంతములో దేవాలయ రథములలో కర్రలో అద్భుతమైన శిల్పములను చూడవచ్చును. అందు ఒక శిల్పపు ప్రతిమను ఇక్కడ చూడనగును. వీణాపాణియైన దేవత, అతని కిరుప్రక్కల గొప్ప శిల్పసౌందర్యమును చాటు చిలుకల యాకృతి, అతని పాదములచెంత హంస చుట్టూ అద్భుతమైన నగిషీపని ఏంతో నేత్రానంద కరముగ నున్నది.

మన దేశములో ఉత్తరమున విశాఖపట్టణములోను, దక్షిణమున తిరువనంతపురములోను తరతరాలుగా అద్భుతమైన దంతపు నగిషీపని సాగుతున్నది. అచట తయారైన ఒక ఫోటో ఫ్రేము ఇచట చూడవచ్చును.

అడివిబాపిరాజు సిద్ధహస్తుడైన చిత్రకారుడు. ఏదో ఒక సందర్భములో బంగారపు సింహతలాటమును నిర్మించటానికి నమూనాను చిత్రించమని నేను కోరాను. ఆ రోజులలో అతనికున్న అవకాశమునుబట్టి సింహతలాటములో ఒక భాగమును మాత్రము చిత్రింప గలిగాడు. కుప్పించి ఎగయుచున్న సింహాకారము, ఆ వెనుక అద్భుతమైన లయను పాటిస్తున్న తామరపూవుల సమూహము, ఆ వెనుక ఏంతో అందమైన నటరాజ విగ్రహము చూడవచ్చును.

ఈ విధముగా మనము కొంచము వీలు చేసుకొని ప్రతియేటా ఒక నెలరోజులు పర్యటింప గలిగామంటే మన శ్రమ వ్యర్థము కాకపోవడము కాక నేత్రానందకరములైన దృష్యములను శిల్పములను, చిత్తరువులను చూడవచ్చును. ఆయా ప్రాంతీయ ప్రభుత్వములవారు ఇటువంటి యాత్రికుల సహాయార్థమై చాలా మంచి ఏర్పాట్లు చేసియున్నారు. ఈ సదవకాశములను మనము పూర్తిగా వినియోగించుకోవలెను.

ఇవన్నీ ఇలా ఉండగా మనము దరిమూ మన ఇండ్లను, మనము కూర్చొనే కుర్చీలను మనము వాడే వస్తువులను సౌందర్యవంతములైనవిగా చూచుకొనవచ్చును. ద్వారబంధములకు, కిటకీలకు అమర్చిన తెరలలోను భారతీయ చిత్రకళాభిష్టతను వేయి నోళ్ళ చాటు రకరకాల తెరలు లభ్యమౌతున్నవి వీనికితోడు గద్వాల్‌లోను, సిద్దిపేటలోను, దక్షిణాన కాంచీపురములోను, మధురలోను, తిరువనంతపురములోను చాలా మంచి చీరలు తయారవుతున్నవి అందములో ఎంత ఖరీదయిన నైలాన్ చీర అయినా వీనికి సాటికావు. ఇంక నగల విషయంలో మన పూర్వీకులు ధరిస్తూ వచ్చిన చంద్రవంక, దండకడియములు, గజ్జల వడ్డాణము క్రమక్రమముగ తెరమరుగవుచున్నవి. వీనిని మళ్ళా ఉపయోగములోకి తెచ్చి మన నిత్యజీవితము సౌందర్యవంతముగా చేయవలసిన కృషి ఎంతో ఉంది.

కాని, ఈ 'ప్లాస్టిక్ యుగము'లో మన కళాదృష్టి ఎంత వరకూ దిగజారిపోయింది అంటే నేనెవరికైనా చాలా అందమైన ఎర్రగులాబీ పువ్వును బహుమానముగా ఇస్తే వారు ఆ అందాన్ని మెచ్చుకుంటూ అంటారు. "ఎంత బాగుందీ! అచ్చంగా కాగితం పువ్వులా లేదూ!!" అని ఆ మాట వినేసరికి నా మనస్సు చివుక్కుమంటుంది. ఎప్పటికైనా మనవారికి నిజమైన సౌందర్య దృష్టి అలవడుతుందా అని.

సౌందర్యమును గురించి ప్రసంగిస్తూ ఉంటే విశ్వకవి రవీంద్రుడు చెప్పిన కొన్ని మాటలు జ్ఞాపకం వస్తాయి.

"స్వర్గలోకంలో దేవతలు ఆస్వాదించే
అమృతానికి రూపంలేదు : పరిమితిలేదు.
ఆ అమృతం ఎక్కడున్నదో తెలుసా ?
జలజల ప్రవహించే సెలయేటిలో
కన్నుల పండువగా పుష్పించే చెట్లగుంపులో
మీన నేత్రల కాటుక కనుకొనుకులలో నాట్యమాడే
మందహాసంలో.


ఆ అమృతాన్నే స్వేచ్ఛగా ఆస్వాదించు !" అని,
రవీంద్రుడే మరియొకచోట అంటారు ఇలా :

"లోకము భయంకరమై సంక్షోభములను కలిగించే పెను తుఫానులకు పుట్టనిల్లు. కాని, తుఫానుల తీవ్రతను నాశనముచేసి పరమశాంతిని నెలకొల్పుతుంది సౌందర్యము. అదే విశ్వగానము !"

రవీంద్ర సాహిత్యమంతా తరచిచూస్తే మనకు ఒక ముఖ్య విషయం బోధపడుతుంది. మానవ జీవితానికి గొప్ప తేజస్సు, అపరిమితమైన ఆనందము కలుగజేయగలిగింది రమ్య ఆలోచనము, రమ్య జీవనము. మన ఆలోచనలు రమ్యంగా ఉండాలి, మన జీవితం రమ్యంగా ఉండాలి. అప్పుడే మన జన్మ సార్థకమౌతుంది.

★

కరీంనగర్ జిల్లాలో కొత్త పరిశ్రమలకు అవకాశాలు



ఎముకల పొడి పరిశ్రమ

వధించబడిన జంతువుల ఎముకలతోనూ విడిగా లభించే ఎండిన ఎముకలతోనూ పొడిని తయారు చేస్తారు. ఈ పొడితో మొక్కల ఎరువులను, మిశ్రమ ఎరువులుగా తయారు చేయవచ్చు. వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యం యిస్తున్న దృష్ట్యా ఎరువుల గిరాకీ ఎక్కువ అయ్యే అవకాశాలు అపారంగా ఉన్నాయి. దానికి తోడు ఎముకల పొడిని బ్రిటన్, అమెరికా, బెలిజియం, నెదర్లాండు మొదలైన దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అందువల్ల ఎముకల పొడికీ, ఎముకల ఎరువుల పరిశ్రమలకూ మంచి భవిష్యత్తు ఉంది. ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో ఎముకల పొడి తయారు చేసే యూనిట్లు లేవు. స్థానికంగా ఎముకలు బాగా లభిస్తున్న దృష్ట్యానూ యీ ఉత్పత్తులకు గిరాకీ బాగా ఉన్న దృష్ట్యానూ యీ జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పడానికి మంచి అవకాశాలు ఉన్నాయి.

పెయింట్లు, వార్నిష్ పరిశ్రమ

అలంకరణకూ, భద్రతకూ, పేయింట్లు, వార్నిష్‌లు ఉపయోగిస్తారు. ప్రస్తుతం బొంబాయి, హైదరాబాదు, మద్రాసుల నుండి యివి సరఫరా అవుతున్నాయి. మార్కెటులో వాటికి మంచి గిరాకీ ఉంది. జిల్లాలో రు. 2 లక్షలు విలువ చేసే పెయింట్లు వార్నిష్‌లు వినియోగిస్తున్నారు. పెయింట్లు, వార్నిష్‌లు తయారు చేసే ఒక యూనిటును కరీంనగర్‌లో నెలకొల్ప వచ్చును. సింగరేణి బొగ్గుగనులు, యితర మార్కెటింగ్ కేంద్రాలకు యిదికూడలి స్థలం.

మొక్కజొన్న గంజి

వస్త్రాల పరిమాణాల సవరింపుకు వస్త్రి పరిశ్రమలో మొక్కజొన్న గంజిని ఉపయోగిస్తారు. ఈ గంజిని గ్లుకోజ్‌గా మార్చి ఆహార పదార్థంగా కూడ వినియోగిస్తారు. జిగురు తయారీ, ఔషధ బిళ్ళల తయారీలో కూడ యీ గంజని ఉపయోగిస్తారు. ప్రస్తుతం అహ్మదాబాదు నుండి దీని సరఫరా జరుగుతున్నది. జిల్లాలో మొక్కజొన్న గంజికి గిరాకీ ఏమీ లేదు. అయితే దేశంలో దీనికి మంచి మార్కెటు ఉంది. మొక్కజొన్న గంజి తయారీకి జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

క్రిమి సంహారక మందులు

సస్య రక్షణకు క్రిమి సంహారక మందులు ఉపయోగిస్తారు. జిల్లా ఆవలి ప్రాంతాల నుండి క్రిమిసంహారక మందుల సరఫరా జరుగుతున్నది. కరీంనగర్ జిల్లాలో రు.7.21 లక్షల విలువ గల క్రిమి సంహారక మందులు వినియోగిస్తున్నారు. నాల్గవ పంచవర్ష ప్రణాళిక ఆఖరు నాటికి యీ మందుల గిరాకీ రెండింతలు కావచ్చునని అంచనా.

ఖండసారి చక్కెర

సాధారణ చెక్కెరకు మారుగా ఖండసారి చక్కెరను ఉపయోగిస్తారు. దీని తయారీ సమయంలో బెల్లం, చెరకు

పిప్పి ఉపఉత్పత్తులుగా తయారుచేయవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో ఖండసారి చక్కెరకు ఎక్కువ గిరాకీలేదు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాలు, మైసూరు, మద్రాసు, కేరళలలో దీనికి మంచి గిరాకీ ఉంది. సిరిసిల్లతాలూకాలో చెరకు ఉత్పత్తి విషయంలో బాగాకృషి జరుగుతున్నది. అందువల్ల అక్కడ ఖండసారి చక్కెర ఉత్పత్తి యూనిటును నెలకొల్పవచ్చు.

బోల్టులు, నట్టులు

కరీంనగర్ జిలాలోని బొగ్గగనులలో వార్షికంగా దాదాపు 100నుండి 12 టన్నుల బోల్టులు, నట్టులు ఉపయోగిస్తారని అంచనా. వార్షికంగా 25 శాతంచొప్పున గిరాకీ పెరుగుతుందని ఆశించబడుతున్నది. బొగ్గగనులకు సమీపంలోని పెద్దపల్లిలో ఒక యూనిటు నెలకొల్పడానికి మంచి అవకాశాలు ఉన్నాయి.

పొడుగు మేకులు

సింగరేణి బొగ్గగనులలో వార్షికంగా దాదాపు 10 టన్నుల పొడుగు మేకులు అవసరమవుతాయని అంచనా. సమీప భవిష్యత్తులో దీని డిమాండు రెండింతలుకావచ్చు. ప్రస్తుతం జిల్లా బయటి ప్రాంతాలనుండి వీటి సరఫరా జరుగుతున్నది. యంత్ర యుతమైన యూనిటు నెలకొల్పేటంత గిరాకీలేనందున చేతితో తయారు చేసే యూనిటును యిక్కడ నెలకొల్పవచ్చు. పెద్ద పల్లిలోగానీ, రామగుండంలో గానీ యీ యూనిటును నెలకొల్పినచో యితర ప్రాంతాల పోటీని సులభంగా తట్టుకోవచ్చు.

చిన్న పిల్లల పాదరక్షలు

బొగ్గగనులలో పనిచేసే పిల్లల పాదాలకు తగిన భద్రత కల్పించడం చాలా అవసరం. ఆగ్రానుండి యిటువంటి పాదరక్షలను ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఎక్కడా వీటిని తయారుచేయడంలేదు. కరీంనగర్ జిల్లాలోని బొగ్గగనులలో వార్షికంగా దాదాపు ఒకవేయిజతల పాదరక్షలు అవసరమవుతాయి. వార్షికంగా 25 శాతం చొప్పున వీటిగిరాకీ పెరుగుతుందని అంచనా. పెద్దపల్లిలో వీటి తయారీకి ఒకయూనిటు నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయి.

చెక్కసున్నంతయారీ

కొత్తగా నిర్మించబడిన భవనాల్నినునుపు చేయడంలో చెక్కసున్నం ఉపయోగించ బడుతుంది. పోర్ట్‌లాండ్ సిమెంటుకు బదులుగా కూడ దీనిని ఉపయోగిస్తారు. ఈ రోజుల్లో అన్ని ప్రాంతాలలో నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్న దృష్ట్యా యీ ఉత్పత్తికి మంచి డిమాండు గిరాకీ ఉంటుందని ఆశిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలోసున్నంరాయి, బంకమన్ను విరివిగా లభిస్తున్న దృష్ట్యా ఈ జిల్లాలో చెక్కసున్నం తయారీకి 2 యూనిటు నెలకొల్పవచ్చు.

సున్నంతయారీ

లోహపువస్తువుల తయారీలోను, కాగితం గుజ్జు తయారీలోను సున్నంరాయిని ఉపయోగిస్తారు. అనేక వాణిజ్య వస్తువులు, పోర్ట్‌లాండ్ సిమెంటు తయారీలో కూడా దీనిని వినియోగిస్తారు. లోహ పరిశ్రమలలో సున్నం విరివిగా వాడబడుతుంది కరీంనగర్ జిల్లాలో సున్నంరాయికి అంతగా గిరాకీలేదు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని యితర ప్రాంతాల్లో కాగితం పరిశ్రమ, చక్కెర పరిశ్రమ, యితర రసాయన పరిశ్రమలలో దీనివాడకం ఎక్కువగా ఉన్నందువల్లగిరాకీ బాగాఉంటుంది. జిల్లాలో ఆధునిక పద్ధతులలో ఒక సున్నం తయారీ యూనిటును నెలకొల్పవచ్చు.

వెనుకబడిన తరగతులవారికి విద్యార్థి ఉపకార వేతనాలు

వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చబడిన విద్యార్థులకు 1970-71 సం॥నికి స్కాలర్‌షిప్పులు మంజూరు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. సాలీనా రూ 1500 లకు మించని ఆదాయంగల కుటుంబీకుల విద్యార్థులకు ఈ సదుపాయం కల్పించబడుతుంది. ఈ జాబితాలో చేర్చుకోబడిన తరగతుల విద్యార్థుల స్కాలర్‌షిప్పులు, బోర్డింగు గ్రాంటులకొరకు ప్రభుత్వం కేటాయించిన రూ. 66 లక్షలలో రూ. 18 లక్షలు ప్రత్యేకించబడినాయి. మిగతా రూ. 48 లక్షలు ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకొరకు వినియోగించబడుతుంది. 1970-71 బడ్జెటు అంచనాలలో వెనుకబడిన తరగతుల (జాబితా ప్రకారం) కొరకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం జరగలేదు. అయితే ఆర్థికంగా వెనుకబడిన తరగతులవారికి విద్యా సౌకర్యాలు కల్పించేందుకు రూ. 60 లక్షలు కేటాయించబడినాయి తక్కువ ఆదాయం కలవారికొరకై 1970-71 సం॥నికి భారత ప్రభుత్వం కేటాయించిన రూ. 6 లక్షలను. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన వారికి విద్యా సౌకర్యాలు కల్పించేందుకు ఉపయోగించడం జరుగుతున్నది.

మానవతామూర్తి వీరేశలింగం

— దేవులపల్లి కృష్ణశాస్త్రి

నేడు ఈ దివ్య సమయాన, ఈ పుణ్యస్థలాన నా ప్రసంగానికి ఈ అవకాశం ఇచ్చేరు పెద్దలు.

వారికి ఎలాగ, ఎంతని నా కృతజ్ఞత తెలుపుకోగలను.

వీరేశలింగమూ, నా గురుదేవుడు వేంకటరత్నమూ నా మనస్సులో నిలిచినప్పుడు, ఎంతో చెప్పాలని ఉంది. ఎంతెంతో.

బ్రతికున్నప్పుడు మహాపురుషులను గొప్పవారు అని స్వీకరించడానికి మనస్సు ససేమిరా ఒప్పుకోదు—వారిలో కూడా మనలోలాగే సమానంగా ప్రతి దినమూ ప్రతి నిమిషమూ రోగాలు రొష్టులు, రాగాలు, ద్వేషాలూ అన్నీ కనబడి, మనకన్న వారు అధికులని అనాలని అనిపించదు.

ఇక గతించిన మహాపురుషులను కూడా ఖచ్చితంగా సరిగ్గా విలువ కట్టలేము.

వారిని దేవ పదవికయినా ఎత్తుతాము. లేదా, ఔను, కాదు అన్నట్లు వారికి ఒక చిన్న సర్టిఫికెట్టు అయినాయిచ్చి తోసేస్తాము— "గొప్ప సంఘ సంస్కర్త" అనో, మరేదో అనో!

రామమోహనరాయలు అంటే "విలియం బెంటింక్ సాయంతో సహగమనమును మాన్పించెను" అంటాం. దిక్కుమాలిన text book లో అంతే ఉంది. అది అప్పగించేస్తాం. ఆయన సమగ్ర భారతాభ్యున్నతికి ఏవిధంగా మూలపురుషుడో, ఆయన ఏలాగున నవయుగానికి ప్రవక్తో, తొలి విశ్వమానవుడో, (Universal man) ఆయన చూపించిన గమ్యస్థానాన్ని ఇంకా స్పష్టంగా దర్శించలేక లోకం యావత్తూ అటు కదలి నడవడానికి గిలగిల లాడుతూ కిందా మీదా పడుతూ ఎలాగ ప్రయత్నంచేస్తుందో తెలుసుకోలేము.

అలాగే, వీరేశలింగం అనగానే, "ఆయన విధవా వివాహములు చేయించెను. అనేక గ్రంథములు వ్రాసెను తెలుగులో మొదటి నవల రచించెను. ఆంధ్ర కవుల చరిత్ర వ్రాసెను. ఆయన ధైర్యశాలి. సంఘాన్ని ఎదిరించెను" అంటూ ఒకటే పాటపాడి ఊరుకుంటాం.

అంతేగాని,

అభినవాంధ్ర శుభోదయ ప్రాప్తికెల్ల
మూల పురుషుండొకండె, విశాల దృష్టి
ఆమహర్షి నాటిన మహోద్యమ లతికలె
సూన పల్లవతతి మోసె ....

అని గ్రహించము.

సాహిత్య క్షేత్రంలో, సంస్కరణ మార్గంలో, సేవా వీధిలో, రాజకీయ రంగంలో, కృష్ణా గౌతమీ తుంగభద్రా ఘట్టాల్లో, సాగర తీరాల్లో, పనుల్లో, గనుల్లో, కేదారాలలో, కార్ఖానాలలో, ప్రబుద్ధమైన చైతన్యంతో దాదాపు నాలుగు కోట్ల ఆంధ్ర ప్రజ నేడు అవిశ్రాంత కార్యోత్సవంలో మునిగి ఉన్నదంటే ఆ దుర్వార కర్మధారకు జన్మస్థానం యుగకర్త ప్రవక్త వీరేశలింగం.

వీరేశలింగం నాటకాత్ర్యంబకం. నవ్యాంధ్ర జీవితం. అఖండగౌతమి. నూరేళ్ల ఈ మధ్య ఉన్న తెలుగు వారందరూ, వారికి తెలియకుండానో. తెలిసో వీరేశలింగంలో ఉన్నారు – అందరూ, అందరూను.

వీరేశలింగం విధవా వివాహోద్యమం, మరో ఉద్యమం లేవదీసి నడిపించాడంటే, దాని అర్థం అంతేనా ?

అంతే అయితే అందరూ ఆ ఉద్యమాన్ని హర్షించే ఈరోజులలో ఇంకా ఎందుకు ఆముదం లాగున ఆ మాటే అనడం:

అయన పని ఏనాడో అయిపోయిందన్న మాట:

ఊఁహూ; అదికాదండీ? ఆ ఉద్యమం నడిపిస్తూ ఆయన ఆంధ్రజనాన్ని ఈ విధంగా హెచ్చరించారన్నమాట;

"ఇదిగో: ఇది మన జాతి ఇది ప్రస్తుతం తెగకుళ్ళి ఉంది. దీనిలో మౌఢ్యం, అంధకారం, కల్మషం, కౌటిల్యం, దాస్యం, చిక్కగా మూగిపోయి ఉన్నాయి ఉదాహరణకు చూడండి—ఈ బాల విధవల దుస్థితి, ఈ హరిజనుల దుర్దశ. ఈ కళావంతుల హేయపద్ధతి: వీటి నన్నిటినీ, ఇంకా ఇట్టివాటిని ఎన్నిటినో. మనం తొలగించి పారెయ్యక పోతే ఎలాగ ? దాస్యాలన్నిటిలోనూ మనోదాస్యం మరీ చెడ్డది. అది వదలించుకోకపోతే ఎలాగా ? ముందు నీ మనస్సును కట్టి పెట్టిన సంకెల తెంచేస్తాను కొన్ని సంస్థలూ ఆచారాలూ మనకు ప్రియతమమై పోయాయి. అవిమనకు సంకెళ్ళని అసలే తెలియదు. నీకు భయం లేదు. వానిని బద్దలు కొట్టెయ్. భయమెందుకు ? సత్యానికి భయమేమిటి: ధర్మం, న్యాయం కరుణ—వీటికి బెదురేమిటి! ఇదుగో నా వైపు చూడండి!

ఇలాగ ! ఇదుగో, ముందు ఈ సంకెల బద్దలు కొట్టి చూపిస్తున్నా నిర్భయంగా! చూసేరా, ఇలాగేముందు ముందు సంకెళ్ళ నన్నింటినీ మీరు తెంచిపారెయ్యాలి!

బూజు దుమ్ముధూళి,
మూసెను తిమిరాళి !
మాసె నీ హవేలీ
పురాణమీ దివాణం, చెడి
బూజు పట్టకుండా—
తెరవండి తలుపులు—"

అంటూ కర్కశమైన కరుణార్ద్రమైన హస్తంతో కోట్ల జనాన్ని ఫెళ్ళుమని కొట్టి లేపి నిలబెట్టాడన్నమాట !

కనుక వీరేశలింగం విద్యాసాగర్‌లాగ వట్టి సంస్కర్త మాత్రమే కాడు.

రామమోహన రాయలులాగ ప్రవక్త-యుగకర్త.

ఒక గొప్ప విద్వాంసుడూ విజ్ఞుడూ ఆయన్ని బసవేశ్వరుని తోనే పోలుస్తాడు.

వీరేశలింగాన్ని కీర్తిస్తూ, ఆయన "ఒక మహావ్యక్తి మాత్రమేకాదు—ఆయన ఒక గొప్ప సంస్థ" అనీ ఒక "మహోద్యమం" అనీ కొందరు అంటూంటారు. అబ్బే! సంస్థలన్నీ ఆయనే! ఉద్యమాలన్నీ ఆయనే! జనం అంతా కలసిన జనశక్తి ఆయనే కనుక.

వీరేశలింగం ప్రజ

వీరేశలింగం మంది, కోట్ల మంది

వ్యక్తికి కులం ఉంది—ప్రజకులేదు. వ్యక్తికి ఒక మతం ఉంది. జనానికి లేదు. వ్యక్తికి వయస్సు ఉంది. మందికి లేదు. మందికి జనన మరణాలులేవు. ఉద్యమాలన్నీ కలిసి ప్రజవి.

అది జీవద్వాహిని. అది భాద్రపదంలో గోదావరి నిత్యమూ జీవనము నింపుకుంటూ సాగిపోవడమే.

వీరేశలింగం కేవలమూ ప్రజ కూడా కాడు.

వీరేశలింగం మానవత,

అప్రతిహతమైన ఆయన బలమంతా ఆ మానవతలోనే ఉంది. ప్రబుద్ధమైన నవయుగ ప్రజాశక్తి అణువువంటి ఆ అర్భక మూర్తిలో ఇమిడిఉండి, క్షుద్రగౌతమిలాగ, రుద్ర ప్రభంజనం లాగ ఆటంకాలన్నిటినీ తుడిచిపెట్టి సాగిపోయింది.

ఎందరో తెలియక అంటారు —"వీరేశలింగం ఒక్కడూ నూరేళ్ళక్రితం సంఘ తిరస్కృతికీ మృతికీకూడా భయపడకుండా, ఒక్కడూ, ఒక్కడే, ఎలాగ నిలిచి జయించాడండీ ! అసలు సంఘానికంతకీ అడుగున ఉన్నవాడు స్కూలు మేష్టరు—వాళ్ళలో అట్టడుగున ఉన్నవాడు తెలుగు పండితుడు—వీరేశలింగం అట్టి తెలుగు పండితుడు. అంత కలవాడుకాడు వట్టి అర్భకుడు. ధనికుల్నీ, అధికారుల్నీ, బలశాలుల్నీ, పండితుల్నీ అందరినీ, సంఘాన్నంతనీ, ఒక్కడూఎదిరించి ఎలాగ జయించాడండీ" అని.

ఒక విధంగా చూస్తే, అది నిజం కాదు.

ఆయన్ని ముట్టుముట్టి పీడించిన వాళ్ళకే బలము తక్కువ. సంఖ్యాబలమూ తక్కువ అంటాను.

కిమ్మూ నోరూలేని ప్రజ, తెలిసో తెలియకో వీరేశలింగం పక్షమే. ప్రజది ఎప్పుడూ భవిష్యత్కాలం వీరేశలింగంది రాబోయేకాలం ; ఆయన ప్రతికక్షులది, పాపం, పోయేకాలం. వాళ్ళది శైథిల్యం, ఆయనది చైతన్యం.

చిదికి చీటలుకారి. కూలిపోతున్న మందిరాన్ని వాళ్ళు "వదలము" అన్నారు. ఆయన వాళ్ళనుకూడా పట్టుకుని కొత్త మందిరం లోనికి తీసుకుపోయి తీరతా నన్నారు. కనుక వాళ్ళపక్షమే బలహీన మైనది.

ఇక్కడ ఒక్కమాట.

ఆయనకు అలవికాని కోపం ఉండేదనిపించేది అందరికీ రాజు అవనీ, రెడ్డి అవనీ, ఎంత మేటి అయినా, ఆయన ఎదుట కుంచుకుపోయి, వెనక్కి తగ్గి నిలబడేవాడు—సత్యం సమక్షాన అసత్యపు నీడలాగ—చీకటి మసకలాగ—ఎక్కడో ఏ కొంచెమో మాలిన్యం ఉన్న వ్యక్తిలాగ !

అయితే అది కోపం కాదంటానునేను. ఆయనచేత అంత పని చేయించిందే కరుణ ఆయెను.

అది తొందర—Impatience

ఎంతో పనిచేయవలసి ఉంది! ఏమో ఎన్నేళ్ళు జీవిస్తాడో! ఎటుచూసినా సమాజం కుళ్ళిఉంది. Aegean stables లాగ. అంతులేని మాలిన్యం—త్వరగా త్వరగా, త్వరత్వరగా తాను ఎంతో పనిచేసి మరీ వెళ్ళిపోవాలి. ప్రతీ విషయమూ ప్రతీ ఒక్కనికీ వాద ప్రతివాదాలు చేస్తూ నచ్చచెప్పుతూ పోతానంటే, ఎప్పటికి తేలడం! ఏం చేయడం! "చెయ్!" అంతే! "ఊ! నడు!" అంతే. తొందర! తొందర! తొందర.

భయంకరమైన, తీవ్రాతితీవ్రమైన ఆ కార్యోత్సవంలో ఆయనకు మరణించడానికి తీరిక లేకపోయింది.

లేకపోతే ఆ దుర్బల శరీరం చిన్నతనంలోనే రాలిపోయి ఉండేది.

ఆయన జీవితానికి స్తిమితంలేదు. ఎప్పుడూ నడకే. వట్టి కదలిక కాదు—అడిమనది.

వట్టినడకకు గమ్యస్థానమూ ఉండదు; తీర్చిదిద్దిన మార్గమూ దు.

మనమందరమూ సాధారణంగా చూపు ఒకవైపూ, నడక మరియొక వైపూ ఉన్నట్టు ఉంటాం. కొందరం శరీరం గదిలోనూ తల కిటికీలోనుంచి ముందుకు చాపినట్టూ ఉంటాం.

ఆ ద్రష్టకు, ఆ మహర్షికి లక్ష్యం, గమ్యస్థానం సుస్పష్టం కనుక ఏదేయో, కాలో, ముక్కో ముందుకు చాపి ఆ కాస్త ప్రగతి అనుకోక, మనిషి మనిషే పూర్తిగా ముందుకు నడవాలన్నాడు; సమాజం కూడా అలాగ నడవాలన్నాడు.

ఒక్కొక్కప్పుడు మాకు అనిపించేది, ఆ ప్రచండునిలో ఎక్కడయినా, చల్లదనమూ తీయదనమూ ఉన్నాయా అని–

అలాగ అనుకోవడం మా దృష్టిలోపం.

ఆయనలో తండ్రితనమూ, తల్లి తనమూ కూడా రెండూ ఉండేవి.

అనాథనూ, అభాగినినీ రక్షించింది ఆ రెండో గుణమే.

ఆ రెండోగుణం రాజ్యలక్ష్మమ్మ–ఆయన భార్య. ఆమెకు ఆయనమీద అమోఘమైన ప్రభావ ముండేది. ఆమె కరస్పర్శ, మృదుభాషణ ఆయనను ఎంతగా స్వాంతన పరచేవో ఆయన చరిత్ర ఎరుగున్న వాళ్ళకు తెలుస్తుంది!

ఆమె చనిపోయాక మరీని! ఆయన అంతరంలోనే ఆమె నివాస మేర్పరచుకుంది–అప్పుడు స్త్రీ పురుష ప్రకృతులు రెండూ ఆయనలో కలిసిపోయి నిండిపోయాయి. భార్యపోయిన తర్వాత రవీంద్రుడు ఒక గేయంలో అదే అంటాడు.

తుది దినాల్లో, ద్విజేంద్రలాల్ రాయి వ్రాసిన చంద్రగుప్త నాటకంలోని చాణక్యునివలె, వీరేశలింగం కనిపిసాడు, ఎన్నడో పరమపదించిన భార్యను పదే పదే ఆహ్వానిస్తూ "నీవే మంటావు? ఈ పని చెయ్యనా!" అని అడుగుతూ అడుగడుగూ వేస్తూన్నట్లు.

ఇక్కడ ఒక్కమాట,

వీరేశలింగంగార్ని గురించి స్మరించినప్పుడల్లా మా గురుదేవులు శ్రీ వేంకటరత్నం నాయుడుగార్ని గురించి కూడా చెప్పుకోకుండా ఉండలేను.

దాదాపు అరవై అయిదు సంవత్సరాల క్రితం ఒక ప్రముఖ ఉత్తర భారత పత్రిక వీరిద్దరినీ కీర్తిస్తూ దక్షిణ "భారతాకాశాన్ని నేడు రెండు జ్యోతిర్మండలాలు ప్రకాశింపజేస్తూ ఏలుతున్నాయి. వీరుడైన వీరేశలింగం పంతులు–ఋషి అయిన వేంకట రత్నం నాయుడు" అని వ్రాసింది.

వీరేశలింగం వేంకటరత్నం కంటే ఎక్కువ నవ్యుడని అనిపిస్తుంది. వీరేశలింగమే ప్రబుద్ధ ప్రజ.

భవిష్యత్తు ఆయన!

వీరేశలింగం యుగం ఆయన చనిపోయాక ఇప్పుడిప్పుడే ప్రారంభమయినట్టు తోస్తుంది.

వేంకటరత్నం దూరభవిష్యత్తులోనికి దృష్టి సారించినా, తన శిష్యులకు అంతవరకూ మార్గాన్ని పరచి చూపించినా, తాను మాత్రం యుగ ప్రాంగణాన నిలబడ్డ ఉపదేశకుడిలాగ దర్శనమిస్తాడు.

వీరేశలింగం పంచభూతాలకూ ప్రజలాగే సన్నిహితుడు. కోపాలూ, తాపాలూ, తిక్కలూ, అనురాగాలూ, ద్వేషాలూ వీటితో జనంలాగే నేలపైనా ధూళిలోనూ నిలిచి ఒక్క నిమిషం విశ్రాంతిలేక, ఒక్క కనురెప్పపాటు విశ్రాంతి నియ్యక, పది మందిని తిడుతూ కొడుతూ తాను పది పడుతూ, ఆందోళన పరుస్తూ, యుద్ధంచేస్తూ పోతూన్నట్టుంటాడు.

వేంకటరత్నం ఉదాత్తుడులాగ, అంటే Aristocrat లాగ దర్శనమిసాడు. ఎప్పుడూ సినాయ్ పర్వత శిఖరం నుండి ఒక విశిష్ట సంస్కార ఆధిక్యత మీదనుంచి దిగినట్టుంటాడు.

వీరేశలింగం పీడిత మానవజగతులో నిలబడి, దానికి జరిగే అన్యాయాన్ని కోసిపారేసి, ఎదిరించిన వారిని తుడిచి పారేస్తానంటాడు.

వేంకటరత్నం అనాథలకోసం, అభాగినులకోసం తల్లిలాగ తండ్రిలాగ ఆప్యాయంగా చేతులు చాపుతూ, ఓదారుస్తూ వంగుతున్నట్టుంటాడు.

వీరేశలింగం "ఛీ! ఇది అన్యాయం! జరగడానికి వీల్లేదు చూస్తానెవరువస్తారో!– దీన్ని ఖండించి పారేస్తాను!" అంటాడు

వేంకటరత్నం, "అబ్బా! పాపం ఈ దిక్కుమాలిన వాళ్లు ఎలా వున్నారో!"– అనే ప్రేమమూర్తిలాగు ఉంటాడు

వీరేశలింగం నడిపిన ఉద్యమాలలో ప్రధానమైనది విధవా పునర్వివాహం లోకంలో తీవ్రమైన యుద్ధాలకు కారణం అయిందది.

వేంకటరత్నం తలపెట్టిన, ఉద్యమాలలో, సంస్థలలో ముఖ్యమైనవి కళావంతుల సముద్ధరణం, అనాథ శరణాలయమూను.

ఇది వద్దని ఎవరు పోరాడగలరు?

ఒక్కొక్కప్పుడు వీరేశలింగం యొక్క దైవం, దండధారీ సమవర్తి అయిన లోక శాసకుడనిపిస్తుంది.

వేంకటరత్నం యొక్క దైవం తరిమిలరిమి రక్షించే వాత్సల్యమూర్తీ, పతితపావనుడూ అనిపిస్తాడు.

అయితే వీరేశలింగంలో ప్రేమభక్తులు లేవనికాదు. వేంకటరత్నంలో కార్యతత్పరత లేదనీకాదు.

కాని వీరేశలింగం జీవితచరిత్ర కార్యోత్సవం లాగ ఉంటుంది– భారతంలో ఒక వీర మానవుని కథలాగ. సామాన్య హృదయాలను ఆవేశపరచే తీవ్రసంఘటనలలో నిండి!

వేంకటరత్నం జీవితచరిత్ర భాగవతంలోని భక్తుని గాధలా ఉంటుంది–స్థూలంగా కనబడని, పట్టుకు దొరకని లక్ష్యాలూ, అనేక ఆవేశాలూ, వేదనలూ అలాటి వాటితోనిండి!

వీరేశలింగం కథ నాటక రచనకూ, చలనచిత్ర నిర్మాణానికి ఇచే లొంగుతుంది.

వేంకటరత్నంకథ అలాలొంగదు; అది భావకావ్యం, కీర్తన. మొదటిది ఎక్కువ జనరంజకం. ముఖ్యంగా ఈ నేటి కాలంలో.

వీరేశలింగం నవ మానవుడు. రాగల కాలంలో మానవుడు బుద్ధి, హృదయమూ రెంటినీ బాగా ఉపయోగించు కోవాలి-ఇది విజ్ఞానయుగం. మానవుడు పశువుకాడు. ఏవిషయాన్నైనా స్వంతంగా తన మెదటిది ఉపయోగించి. పరిశీలించి, తూచి సత్యం తేల్చుకోవాలి. మరి కవి అన్నట్లు-ప్రాక్పశ్చిమాలు రెండూ ఒకే ఒక హృదయం యొక్క రెండు స్పందా లయిపోయినపుడు మానవు లందరూ ఒకేఒక ప్రేమ పాశంతో కట్టబడి, ఒకే ఒక విశ్వ విశాల సంసారంలో ఇమిడి శాంతంగా సుఖంగా బ్రతకాలి. భగవంతుడికి రెండుకళ్లున్నాయి అంటాయి పురాణాలు-సూర్యుడూ, చంద్రుడూ, మానవునకూ, ఉన్నవాడికి-రెండు కళ్లే. బుద్ధీ హృదయం Reason, Love ఈ రెంటిలో దేనికి లోపంవచ్చినా నవ మానవుడు ఈజగత్తులో మనలేడన్నది వీరేశలింగం సందేశం. ఆయనది మానవతా ధర్మం.

మెథాడిస్టు (Methodist) మత ప్రచారకుడైన John Wesley నిగూర్చి ఒక కథవుంది. ఆయనకు ఒక సారి ఒక Vison— ఒక సాక్షాత్కారం కలిగింది. Wesley స్వర్గద్వారం దగ్గర ప్రవేశం కోసం నిలబడ్డాడు "నివెవరవు" అని ద్వార పాలకుడు ప్రశ్నించాడు. I am a Wesleyan , నేను వెస్లీ ధర్మ సంప్రదాయానికి చెందినవాణ్ణి" అని జవాబిచ్చాడు. "మేము వాళ్లవరో వినలేదు" అన్నాడు ద్వారపాలకుడు. పోనీ ఇక్కడ ప్రొటెస్టెంటు మతం వాళ్లు ఉన్నారా?" అని ప్రశ్నించాడు వెస్లీ, మళ్ళీ "ఊహు అన్నాడు ద్వారపాలకుడు" "క్రైస్తవులు?" ఒక్కరూలేరు! "మారెవ్వరున్నారు?" "విశ్వాసులు— Believers" అన్నాడు ద్వారపాలకుడు.

స్వర్గద్వారం అంటూవుంటే అక్కడ ఓద్వారపాలకుడంటూ వుంటే మొదటనే "మానవుణ్ణి" అని చెప్పి వేరేశలింగం నమ్మకంగా లోపలికి వెళ్లిపోయి ఉంటాడు.

"భారతేర్ మహామానవేర్ సాగరతీరే" అంటాడు, కవి రాజ రాజు·మానవ మహాసాగరం అంటాడు! ఎంతనిజం ఈ మాట! మీరు సముద్రాన్ని ఏయేవేళలలో ఎలాగెలాగ చూసేరో! ఎలాగెలాగ మానవ సాగరాన్ని సందర్శించారో గాని:

నిశాదివసాలలో వెలుగు నీడలలో ఎప్పటికప్పుడు మారిపోయే సముద్రమూ, ఆమార్పులతో మన చిత్తవృత్తులు కూడా మారడం, మనకీ కడలికీ ఉన్నబాంధవ్యమూ, కడలిని చూసి మన మనస్సూ, మనస్సు కనుకూలంగా కడలీ దర్శనమిస్తూ ఉండడం, ఉషః కాలంలోనూ ప్రభాత వేళలోనూ సముద్రం, పండువున్నమినాటి పయోధి, సందెవేళల సాగరం, మునిమాపు మునిరేటప్పుడూ రాతిరి నిద్రపోయేటప్పుడూ, మున్నీరూ మనమూ ఒకరి వెపుఒకరు అచంచల నేత్రాలు త్రిప్పుకొని చూస్తున్నట్లు ఉండడమూ, మెత్తని గాలివేళల చక్కని గిలిగింతలు తట్టుకోలేక అంత జలరాశీ అలలు అలలుగా విరిగి కిలకిలా నవ్వడం, దూరాన క్షితిజరేఖ వద్ద మేఘాలు సముద్రస్నానానికి దిగడం, క్షుద్ర ప్రభంజనం పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ సముద్రం మీద నడవడం, ఉద్ధత తరంగాలు నురుగుజూలు ఊగిస్తూ ఎగిరిపడడం, తరువాత సముద్రంమీద పొడుగుపాటి నీడలు పాకడం-సుఖాలూ, దుఃఖాలూ, మహాకల్లోలాలూ, ఆందోళనలూ, ఆలింగనాలూ, అలజడులూ ప్రళయ యుద్ధాలూ మారణహోమాలూ పండుగలూ పబ్బాలూవేడుకలూ, ఆశలూ ఆనందాలు—

ఈ మానవ మహాసాగర మధ్యాన నవయుగారంభ వేళ నిలబడిన నవమానవుడు Universal man తెలుగు నాట వీరేశలింగం.

అలాగ నిలబడి ఇలాగ అన్నట్లు నాకు తోస్తుంది.

ఓమానవుడా! నవమానవుడా! నీది- అంటే నీబదులు నాది ధర్మసమరం సుమా నీవుసాధించే విజయం సామాన్యమైందికాదు. నిన్ను నీచపరచేదికాదు ఆ విజయం. దానివల్ల లభించే ప్రభావం నీహస్తాల్లోనే గుప్తపరుచుకోలేవు. నీది ధర్మసమరమయితే నీహస్తాలుకూడా ధర్మయోధునికి ఉచితమైనవే నీకు ఆగ్రహం పనికిరాదు. ద్వేషం పనికిరాదు. నైచ్యం, అల్పత్వం, అసత్యం పిరికితనం నీదగ్గరకు రానివ్వగూడదు. ఉషస్సులోకి తొంగిచూసే ఆశ నీది- ప్రభాతంలో భాసించే విశ్వాసం నీది.

ఓనుక ముందు ఆశకు కూడా అతీతమైన కష్టాలను పడడం, రాతిరికన్నా. మృత్యువుకన్నా నల్లనైన అవమానాలను క్షమించడం ఎదిరించ డానికికూడా వీలులేనట్లు కనబడేశక్తుల్ని—

"తృణీకరించడం,
ప్రేమించడం,
ఓర్మితో సహించడం,
శైథిల్యంనుండీ జరనుండీ నవజీవనాన్ని సృజించు కోవడం,
చలించక పోవడం,
నీమార్గంనుండి తప్పుకొనక పోవడం.
నీరస పశ్చాత్తాపంలో క్రుంగక పోవడం—


ఇవన్నీ-అన్నీ, నాలాగే నీవూ జ్ఞాపకం ఉంచుకోవాలి సుమా!" అని.

వీరేశలింగాన్ని "దేవత" అన్నాడు రామలింగారెడ్డి.

ఆ మహా మానవసాగర తీరాన నేను ఒకసారి నిలబడి ఆ "దేవత" కు నరదేవతల కందరకూ నమస్కరిస్తున్నాను.

(వీరేశలింగం జన్మదిన సంస్మరణ సంచికనుంచి)

సీరియల్



త్యాగరాజు గానానికి ముగ్ధులయ్యారు శ్రోతలు. వెంకట రమణయ్య పంతులుగారు తన ఆశీస్సులను మనసా అందించారు.

శ్యామశాస్త్రి, దీక్షితులు, శ్రోతలు ప్రతి నమస్కారం చేశారు.

ముదమున శంకర కృత సామ నిగమ విదులకు నాదాత్మక సప్తస్వర కోవిదులకు...

నాదోపాసనజేసి ధన్యులైన వారందరికి నా హృదయ పూర్వకాభివందనలు.

పంతులుగారు తన్ను తానే మరచారు. ఏక్కడో విహరిస్తుంది మనస్సు. త్యాగరాజు గానం నిలిపినా పంతులుగారు కండ్లు విప్పలేదు. ఆనందాశ్రువులు రాలుస్తున్నారు. త్యాగరాజు గురువుగారి యేకాగ్ర చిత్తతకు, తన గానంవల్ల పొందిన ఆనందానికి రసానుభూతిని పొందాడు. మెల్లగా స్వామీ యని పిలిచాడు.

కండ్లు తెరిచారు పంతులుగారు. త్యాగరాజును తనివిదీరా కౌగలించుకొన్నారు. నాయనా! ఇన్నాళ్ళకు నా జన్మ తరించింది. నీవు నాకు శిష్యుడివి కాకుంటే నా పేరే లోకానికి వినిపించదేమో అంటూ ఆశీర్వదించారు.

శ్యామశాస్త్రి, దీక్షితర్‌గారలు, యితర పెద్దలు త్యాగరాజును అభినందించారు.

పంతులుగారు త్యాగరాజును, శిష్యబృందాన్ని సత్కరించారు. త్యాగరాజు గురువుగారి అనుజ్ఞ తీసుకొని తిరువయ్యూర్ పయనమయ్యాడు శిష్యబృందంతో.

నిధి చాల సుఖమా.......

శరభోజి ఆస్థానములో మూడు వందల అరవైయైదు మంది విద్వాంసులున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్కదినము రాజును, సభికులను తమతమ కళా, పాండితీప్రతిభలతో రంజింపచేస్తుంటారు.

మరునాడు శరభోజి సభతీర్చియున్నారు. కవిత్వంపై చర్చ జరుగుచున్నది. సభికులు ఉత్సాహంతో వింటున్నారు.

కాని వెంకటరమణయ్య పంతులుగారు మాత్రం పరధ్యాన్నంలో వుండిపొయ్యారు. త్యాగరాజు గాత్రంలోని సంగతులను వీణలో పలికించిన రాగప్రస్థారాన్ని నెమరువేసుకుంటున్నారు. ఏనాడు పరధ్యాన్నంలో వుండని పంతులుగారు యీనాడు అలా వుండడం రాజుకు వింతగా దోచింది.

రాజు ఒకటికి రెండుమార్లు పంతులుగారూ అని పిలిచారు.

పంతులుగారి ముఖం తేజోమయమైవుంది. సంతోషరేఖలు ప్రస్ఫుటంగా కనుపిస్తున్నాయి. అంతటి పరధ్యాన్నం యేనాడూ రాజు పంతులుగారిలో చూడలేదు.

రాజు సింహాసనం నుంచి లేచి పంతులుగారి పీఠంవద్దకు వచ్చాడు. సభ నిశ్శబ్దమయింది. పంతులుగారూ అని మృదువుగా పిలిచాడు.

ఉలికిపడి కండువిప్పారు పంతులుగారు. కండ్లు నిండుగ నీరు నిలచివుంది.

రాజుకేసి చూచారు పంతులుగారు.

శరభోజి మీ ఆలోచనకు అంతరాయం కల్గించానా అని ప్రశ్నించాడు.

అవును. నా ఆనందానికి, ఆలోచనలకు అడ్డు తగిలారు— పంతులుగారు కంఠంలో కొద్ది కఠినత్వమే గోచరించింది శరభోజికి. వెరకుచెందాడు. అయితే........

అందుకు మీరు శిక్షార్హులు—వెంటనే అన్నారు పంతులుగారు

శరభోజి యిందుకు యేదో కారణముంది అని తలంచారు.

అవశ్యం! మావల్ల తప్పు జరిగివుంటే మేము శిక్షననుభవించడానికి సిద్ధంగా వున్నాం—

పంతులుగారి ముఖం చిరునవ్వుతో చిందులాడింది.

రాజు: నీవు వందనీయుడవు. శ్రీకృష్ణదేవరాయల భువన విజయమువలె నీ నాయకమహల్ చరిత్రప్రసిద్ధమైనది. కాని నేను మీకన్న మిక్కిలి ఆనందాన్ని పొందుతున్నాను. ఈ సభాభవనంలో. అవధులులేని ఆనందాన్ని నేనొక్కడినే పొందడం భావ్యంగాదు.

మిమ్మలను, పండితులను నా గానం వల్ల ఆనందపరిచాను. మీ సింహాసనంలో అరభాగం సంపాదించుకొన్నాను. కాని అదంతా నేడు తప్పేమోనని దోస్తున్నది.

ఈ నాయకమహలులో కళాసింహాసనాధిపీఠ మధిష్టించడానికి నేనసర్హుడనని ఋజువుచేసుకొన్నాను. అందుకు మరొకరున్నారు. ఆ కళామూర్తి గానవాహినిలో కృష్ణుని మురళిలో మధురశబ్దాలే వినిపించాయి. అతని విపంచికలలో మహతిలోని గమకములు విని పించాయేమో. అతని గానం అమరగానం, ఆ మధురగానం వినని, ఆరసాస్వాదనపొందని మీరు తప్పక శిక్షార్హులే!

శరభోజి ముఖం ప్రఫుల్లమయింది. పంతులుగారి వేదన అర్థం చేసుకొన్నాడు. పంతులుగారికి నమస్కారిస్తూ స్వామీ నేను శిక్ష పొందడానికి సిద్ధంగా వున్నాను. ఆ మధురగాయకుని పిలిపించండి. సింహాసనాన్ని అతనికి సమర్పించి అతని కళాపాండిత్యానికి నీరాజనలు సమర్పిస్తాను. వెంటనే పిలిపించండి. ఇంతకూ అతను మన నగరవాసియేనా– యని ఆత్రతతో ప్రశ్నించాడు శరభోజి.

తిరువయ్యూరు నివాసి, మన ఆస్థాన పౌరాణికుడు రామనాథం కుమారుడు త్యాగరాజు. నా శిష్యుడు... ఒకప్పుడు.

వెంటనే శరభోజి మంత్రితో రత్నాభరణములు యిచ్చి త్యాగరాజుకి రాజాస్థానమునకు వచ్చి గానం చేయమని లేఖ వ్రాసి పంపండని చెప్పాడు.

సేవకుడు రాజుగారి లేఖ తీసుకొని తిరువయ్యూరు పయనమై పోయాడు.

త్యాగరాజు యిల్లు కనిపెట్టడానికి సేవకునికి యెంతో కాలం పట్టలేదు. ఇంటి ముందుకు వెళ్ళేప్పటికి మధురగానం వినిపించింది. యథారాజా తథా ప్రజ యన్నట్లు రాజుగారి సేవలో తాను సంగీత శ్రవణం చేసి యున్నందువల్ల ఆ గాన మాధుర్యానికి సేవకుడూ పరమానందం జెందాడు. లోనికి వెళ్ళకుండా యింటి ముందరే నిలబడి పొయ్యాడు.

వాడేరా దైవము మనసా.........

అతడే దైవం, రాముడే దైవం, నా మనస్సు సదా రామునే దైవంగా భావిస్తుంది.

''ఆడిన మాటలు తప్పడనుచు

ఆ చంద్రార్కము దత్కీర్తి కల్గిన''— వాడే

పలికిన పలుకులు తప్పని సత్యమూర్తి జగత్తున్నంత కాలం కీర్తి ప్రఖ్యాతులు గల్గియుండు వాడెవడు? శ్రీరాముడే.

దండి రక్కసుల మద మణచును
అఖండలాది సురకోటులను
భూమండల సుజనులను పాలింపను
కోదండపాణి రూపముతో వెలసిన వా॥

ఇంద్రాది దేవతలను మునివర్యుల యజ్ఞక్రతువులను రాక్షసుల బారినుంచి తప్పించుటకు, సుజనావళిని కాపాడుటకును, కోదండము ధరించి సుందర రూపుడై జన్మించిన అవతార మూర్తి రాముడే నా దైవం.

ముక్తి మార్గపు దాత యీయన రాముని సంకీర్తన చేస్తున్న త్యాగరాజు గాన ప్రతిభ సేవకుని చెవి తుప్పును వదలించింది. కొద్ది సేపటికి తెప్పరిల్లుకొని బయటనుంచి "స్వామీ" యని పిలిచాడు.

అంతలోనే హఠాత్తుగ బయటనుంచి వచ్చాడు జపేశయ్య.

" ఎవరు ? "

శరభోజి మహారాజు సేవకుడను, త్యాగరాజుగారితో పనుండి వచ్చాను.'

"నేను త్యాగయ్య అన్నను. ఆ పనేదో నాకు చెప్పవచ్చు."

"శ్రీ శ్రీ శ్రీ శరభోజి మహారాజావారు త్యాగరాజుగారికి పంపిన లేఖ" యంటూ లేఖను జపేశయ్య చేతికిచ్చాడు సేవకుడు.

లేఖను చదివాడు. సంతోషంతో త్యాగూయని అరిచాడు. ఆ కేకతో త్యాగరాజు గానం వింటున్న శ్రోతలు విస్తుపోయారు.

జపేశయ్య తన తొందరపాటుకు కించెత్తు కూడా విచారించ లేదు.

"త్యాగయ్యా! నీకు శరభోజ మహారాజువద్ద నుంచి పిలుపు వచ్చిందయ్యా" అంటూ త్యాగరాజు వద్దకు వచ్చాడు.

"ఏమిటన్నయ్యా", ఆశ్చర్యంతో ప్రశ్నించాడు త్యాగరాజు.

అదేనయ్యా! మన మహారాజు తన ఆస్థానంలో నీ పాటను వినిపించమన్నాడు.

జపేశునికి త్యాగరాజు సంకీర్తనలు కేవలం పాటలుగా దోచాయి.

రేపే నిన్ను సభకు రావలెనని ఆజ్ఞాపించారు రాజుగారు ఇదిగో లేఖ.

రామ! రామ! రాజాస్థానములో నా గానమా అన్నయ్యా, నా కీర్తన దైవ సంకీర్తనకేగాని రాజుల రంజింప జేయుటకు గాదు అని నీకు తెలియదూ.

జపేశయ్య ఆశ్చర్యపడ్డాడు. త్యాగయ్యా! రాజాజ్ఞను ధిక్కరిస్తున్నవా? దీని ప్రతిఫల మేముంటుందని ఆలోచించావా? నీవు వుండే యిల్లు యెవరిదో తెలుసా! ఇది రాజాజ్ఞయని మరచి పోకు. సిరి రామో కాలడ్డకు. సిరి వస్తుందంటే కాల దంతావా? మన జీవితమంతా యీ నికృష్టపు బ్రతుకు బ్రతకవలసిందేనా? మనం సుఖంగా జీవించడం నీ కిష్టం లేదా?

అన్నయ్యా! మనమిప్పుడు సుఖంగా లేమా? ప్రశాంత మయిన మనస్సులతో బ్రతకడం లేదా, నేను పంచుతున్న యీ సంగీత ధనాన్ని యెందరు అమృతప్రాయంగా స్వీకరించడం లేదు? ధనానికి అమ్ముడు పొమ్మంటావా?

త్యాగూ ! మన జీవితాలెప్పుడూ యిలాగుంటాయా. మనమూ అందరితోబాటు నాలుగు రాళ్లు వెనుక వేసుకోవక్కర లేదా ? ఇక్కడ పాడే ఆ పాటలే ఆ స్థానములో పాడకూడదా ? ఇందులో బానిసత్వం యేముం ? నీ పాట విన్న రాజు నిన్ను సత్కరిస్తారు.

అంతేగా అన్నయ్యా ! ధనం వచ్చి మన మనస్సులను పాడు చేస్తుంది రా ! ముందే మనమిప్పుడు భేదాభిప్రాయులుగా వున్నామే యిం ఆ డబ్బు మనకు వస్తే మనమింకెంత విభేదాలతో మనవలసి వస్తుందో. ధనం సుఖాన్ని యివదన్నయ్యా నా మాట విను వచ్చిన నాల్గు రాళ్ళతో మన జీవితాలు శాంతియుతంగా గడుపుదాము.

జపేశయ్య ఓర్పు నశించింది. త్యాగయ్యా నీవు మాట్లాడేది యెంతవరకు సబబో నా కర్థం కావడం లేదు. నీ రామ భజన పొట్టకాయనా, బట్టకాయనా ? జీవితాలంతా పేద బ్రతుకులుగా గడపడం నీకు ఆనందమా ! వచ్చిన అవకాశమును జారవిడిచి మూర్ఖుడవు గాబోకు రాజ తిరస్కారానికి ప్రతిఫలం యేమిటో ఆలోచించుకో. నీ గురువు రాజా స్థానములో లేడా ? ఆయన కన్న నీవు జ్ఞానివా ? పండితుడవా ? నీవలకులే నిలబెట్టుకోవాలంటే మన సంసారాలు వేరు పడాల్సి వుంటుంది.

అన్నయ్యా ! అంతమాట అనకు మనం విడిపోకూడదన్నయ్యా ! నాకు రాజు ఒక్కడే రాజులకు రాజు రారాజు శ్రీరామచంద్రమూర్తి. ధనం సుఖాన్ని యే నాటికీ యివ్వలేదు.

నిధి చాల సుఖమా
రాముని సన్నిధి సేవ సుఖమా
నిజముగ పల్కుము మనసా ॥
దధి నవనీత క్షీరములు రుచో
దాశరథి ధ్యానభజన సుధా రసములు
రుచో.........

దమ శమ మను గంగాస్నానము సుఖమా
కర్దమ దుర్విషయ కూపస్నానము సుఖమా
మమత బంధ నీయుత నరస్తుతి సుఖమా
సుమతి త్యాగరాజ నుతుని కీర్తన సుఖమా !

జపేశునికి ఒళ్ళు మండింది త్యాగరాజు కీర్తన విని ఆపాద మస్తకం వణికిపొయ్యాడు. "లోకంలో నీవు ఒక్కడివే భక్తుడ వన్నట్లు మాట్లాడుతున్నావు. నీ మనస్సుకు నిధి కన్న రాముని సన్నిధి ముఖ్యం గావచ్చు. కాని మాకంతా నిధిముఖ్యం డబ్బులేనిదే జీవితం గడవదు. నీ భార్యను, తల్లిని, నీ కూతురును నిన్ను. నీ వదినను, యింత మందిని కష్టపెట్టి నీవు బావుకునేదేముంది. నా మాట విను. ఒక్కసారి రాజాస్థానంలో మాకోసం గానం చేయి. నీ చేతులతో నీవు రాజుయిచ్చే డబ్బు పుచ్చుకోకు. నేను స్వీకరిస్తాను. అని కోపం దిగమ్రింగుకొని బ్రతిమాలాడు.

త్యాగరాజు తొణకలేదు. రాజుముందు నేను గానం చేయలేనన్నయ్యా నన్ను క్షమించు అని స్పష్టం చేశాడు.

జపేశయ్య కోపోద్రిక్తుడైనాడు. కాని చేసేదేమున్నది. తల్లివంక తీక్షణంగా చూచాడు ఆమె అయినా చెప్పలేదని—

కాని తల్లి, భార్య త్యాగరాజు ధీరత్వానికి నిశ్చలత్వానికి యెంతో ఆనందించారు

జపేశయ్య హతాశుడైనాడు సేవకుడు వెనుదిరిగి వెళ్ళిపోయాడు

శరభోజి మహారాజుకు త్యాగరాజు తిరస్కారం ఆగ్రహం కలించింది కాని పంతులుగారు వారి ఆగ్రహాన్ని శాంతింపజేశాడు.

నేను అనుకొన్నట్లే జరిగింది అన్నారు పంతులుగారు కారణం ?

త్యాగరాజు దృష్టిలో రాజు ఒక్కడే అతడే శ్రీ రామచంద్రమూర్తి మీరు కేవలం నగరపాలకులు మాత్రమే అంతే గాదు. త్యాగరాజు ధన వ్యామోహితుడుకాడు. ఉన్నదానితో తృప్తి పడి జీవించే నిరాడంబర జీవి.

శరభోజి ఆగ్రహం భక్తిగా మారింది. మనస్సులోనే నమస్కారం జేశాడు. త్యాగరాజుకు.

మరి త్యాగరాజు గానం వినేదెలా ?

మనమే వెళ్దాం మారువేషాలు మహారాజులకు పరిపాటియే గదా ! పంతులుగారు చిరునవ్వుతో విన్నవించారు

పంతులుగారూ ప్రయాణానికి సిద్ధంకండి త్యాగరాజు గానం విననిదే నాకు నిద్రపట్టదు. అతని గానం కన్న అతనిని చూడవలననే కోరిక కూడ మిక్కుటంగా వుంది.

పంతులుగారు, శరభోజి మహారాజు. కొంతమంది సేవకులతో మారువేషాలతో తిరువయ్యారు చేరారు.

త్యాగరాజు అప్పుడే శ్రీరామునికి ఆరగింపుచేస్తూ.

ఆరగింపవే......పాలారగింపవే......... అని తోడి రాగకీర్తన గానం చేస్తున్నాడు.

రామా ! నే నందించుచున్న పాలు ఆరగించు. రఘువీర. నీ ప్రియభామిని సీతమ్మ యిస్తున్నట్లే గ్రహించు. అయితే నీ వొక్కడివే ఆరగించకుమా ! నీ సోదరులతో, పరివారముతో పవమానసుతునితో నే నొసంగుచున్న చిత్రాన్నము సకల పదార్థములు ఆరగించి నన్ను ధన్యుణ్ణి చేయి

త్యాగరాజు గానం వాకిట్లో నుంచే పంతులుగారు, రాజుగారు విన్నారు. శరభోజి త్యాగరాజు గళ మాధుర్యమునకు, భావయుక్తతకు తన్మయత్వం చెందాడు. రాజుననే భ్రమ తొలగిపోయింది. నేరుగా లోనికి వెళ్ళి త్యాగరాజుకు సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆ దృశ్యం జూచి పంతులుగారు అనిర్వచనీయమయిన ఆనందం పొందారు

త్యాగరాజుకు నమస్కరించిన వ్యక్తి యెవరో తెలియలేదు.

[తరువాయి 63 వ పుటలో]

అభయముద్ర



సిరియాల రామకృష్ణ

అప్పుడు—

ఉలూకాల కోలాహలం నిండినప్పుడు
అళీకాల హాలాహలం మండినప్పుడు
అంత అంధకార వాతావరణంలో కూడా
దాస్యం చేత మనల్ని అపహాస్యం చేయించిన
రిపుకోటిముందర—
ఒక మార్గదర్శి వెన్క మన పదధూళి పయోదాలు

లేచినప్పుడు—
మనమంతా ఒక్కటే
అనే మెరుపు కనిపించింది
మనమంతా ఒక్కటే
అనే ఉరుము వినిపించింది.

తర్వాత—
వేయివెలుగులు మన ప్రాంగణంలోకిరాగానే
మనం విడిపోయామని ప్రకటించినట్టు
చరిత్ర ఘోష మొదలయింది.
కాలం వేళాకోళం మొదలయింది.

భూగోళం వేయి గోళీలవుతున్నట్టు
సాగరాలు సాగి వచ్చేస్తున్నట్టు
గుంపులు గుంపులుగా
ఎవరి మాటలు వాళ్లు
కట్టుకోవడం మొదలయింది.
పక్షాలు
పక్షాలు విప్పాయి
కక్షలు
లక్షలు కనిపించాయి
కుక్షి నిండటం లేదని
ప్రతి నోటా ఒకటే మాట
అక్షి
చత్వారంలో పక్షి.
ఇప్పుడు
మన స్వాతంత్ర్యవిహాయసంలో
ఏదో ఉత్పాతకేతువు.
మన హృదయ దఘ్న స్నేహంలో ఏదో అరిష్టమకరి.

'పంచతంత్రం' పుట్టిన సాహిత్యం మనది
పంచదారలా కరిగే సౌహిత్యం మనది
—కాదనను;
నిదానిస్తే బోధ పడుతుంది
నిదాఘం లాంటి ప్రమాదం
అదే అనైక్యం.
రేపైనా—
మన రక్తం చైనా చేత నిపీతం కాజాలదు
మన గృహ ప్రాకారానికి
పాకిస్తాన్ చేత పతనం కలగదు.
క్షామాల ఉద్దామజ్వాల
మనల్ని తాకదు
అతివృష్టుల దిష్టి మనకు కొట్టదు.
కానీ

మనకు దారుణోత్పాత హేతువులు,
మనకు మారణాస్త్రాల తీతువులు
మన ఎడమొగాల పెడమొగాలే
మన అంతర్విరోధాల బాణప్రయోగాలే
మన అస్నేహాల బాకు మొనలే
మన భిన్నకులాల గొడ్డళ్ల కొనలే.
చరిత్ర సాక్షిగా చెబుతున్నాను—
ఎప్పుడైనా
కొంగు నిప్పుగా
మనల్ని మింగేది అనైక్యం
చెంగుమని
మన మీదికి దూకేది విభేద పంచాస్యం
అంగారాన్ని మోహించేది
అజానం; అజ్ఞానం చేతివేళ్ళ మధ్య

గజ్జి అనైక్యం-
అదే జీవనాన్ని ప్రదహిస్తుంది.

ఇంతెందుకు

ఇంగ్లీషు కృతక సూర్యుడు
మన ఇండియా వినువీధి నెలాపొడిచాడు
—మనతో పేరుకుపోయిన చీకటిని చూసే
మనలో అల్లుకుపోయిన మంచును చూసే!

అవును

అనైక్యం అవిరళాంధకార ప్రకారం
అనైక్యం నిబిడ హేమంత తుషార వికారం
అది మనలో ఉన్న ప్రదోషలేశం
దాన్నే ఆసరా చేసుకుంటుంది అసురప్రవేశం
ఫలితం శతాబ్దాలు శత్రుచ్ఛత్రం క్రింద నివాసం

పోనీ

మహాత్ముడు పిలిచాడు మనల్ని
కాలం కలిపింది మనల్ని
సాలంకృతమయింది మన సమైక్యం
అంగీకృతమయింది మన సంఘీభావం
హిమవత్కిరీటం మీద
అమరనాయకుల పూజలు జరిగాయి
విజయపుష్పమాలలు శిఖరాలై పెరిగాయి
జవహర్ శరీరం
పుష్పీభూత పులకాంకిత మయింది
జవాన్ల తండోపతండాలు
జాగృత మయ్యాయి.
కిసాన్ల విశాలకేదారాలు
సస్యహారాలు ధరించాయి

శ్రమిక వపుల్లతల ముత్యాలు పుష్పించాయి
అంగుళం నేల దొరక్క
అనైక్యం అంగారంలో పడింది
పునరారంభం
మన నిర్మాణాత్మక కార్యకలాపం
అనేకానేక ప్రణాళికల ప్రపంచకాలు
ఆర్థికామూల్య సంపద్వివర్ధకాలు
సరిత్ సలిలాల సమ్యగ్వినియోగాలు
విజ్ఞాన విహాయస విహంగ ప్రయోగాలు
సాహిత్య భామినీ సరససరాగాలు
'అదిగో
అల్లంతలో మన ఉషస్సు
ప్రాచ్యఖండాల తపోవనంలో
ఫలించిన భారతీయ తపస్సు

అదిగో
మన అంబరచుంబి జయస్తంభం
అర్ధశతాబ్దిలో తిరిగి మన నవజీవనారంభం'
ఇలా సాగింది
మన ఆలోచనార్కుల ప్రకాశం
ఔ
ననుకుంది పడమటివైపున ఉన్న ఆకాశం
కానీ
స్నేహగేహం సగంలో ఉండగా
వాటాల ప్రసంగ మేఁవిటీ
సాహిత్యదీపం వెలుగుతూ ఉండగా
కృతకరుణామారుతాలేఁవిటీ
ఆరోగ్య సేతువైన హాస్పిటల్ మీద
దాడి ఎందుకూ
విద్యారేఖ ఉదయిస్తున్న దిశముంద
కసి ఎందుకూ
రైళ్ల, బస్సుల అస్థిపంజరాల మీద
అగ్గిరాళ్లేఁవిటీ
టెలిఫోను నరాల్ని నరికే
కసాయితన మేఁవిటీ
ఇదంతా!
మన మొహం మీద మన చేతుల పగ
ఇదంతా
మన తల్లికి మనం చేసే దగా
స్వాతంత్ర్యబాలిక ఉయ్యాల తాళ్లను
ఎవరురా
ఆ ఛేదిస్తున్నది?
జననీ స్వప్నంలోని సమైక్యభారతాన్ని
ఎవరురా
ఆ శకలీకరిస్తున్నది ?
ఆశయాలయంలోని
సహస్రభుజ విశ్వరూపాన్ని
ఎవరురా
ఆ వ్రక్కలిస్తున్నది?
నవభారత నందనంలోని
అశ్వత్థా
ఎవరురా
ఆ ఖండిస్తున్నది?
ప్రపంచం కళ్లు పెద్దవిచేసుకుని
మన వైపు చూస్తోంది
ఖండాంతరాల కర్ణకుహరాల్లోకి
మన చరిత్ర చేరుతోంది
నియంతల అహంతలకు
భారతకథ ఆహా పుట్టిస్తోంది

ఇకనైనా—
సమాజగర్భకుహరంలో వేసిన
కురుపును కనిపెడదాము
ఇకనైనా—
ఈ ప్రమాదాల టెంపరేచరు
కొలిచి చూదాము
ఈ పరిస్థితుల కండూద్గమాన్ని
డాక్టర్లకు చూపిద్దాము
ముందుగా—
ప్రజాస్వామ్య నిఘంటువులో
'స్వేచ్ఛ' కర్థం విచారిద్దాము
సార్థక పద ప్రయోగం చేయగల కవుల్ని
పిలిపిద్దాము
అర్థపుష్టి కలిగించే ఆలోచనారవుల్ని
గౌరవిద్దాము
అందుకోసం
మనసహస్రభుజవల్లరుల్ని పూయిద్దాము
ఎవరికైనా—
అంతరంగ హంతకుడ్ని క్షమించడం
అనుకంప కాదు
జాతి ఖండన హేతికి పదనుపెట్టడం
పటితనం కాదు
చిక్కుల దిక్కులకు దారిచూపడం మార్గ
దర్శిత్వం కాదు
వంశాభివర్ధనానికి దుశ్శాసనపోషణ బాధ్యత
కాదు
విదేశీయ చారదృష్టికి సులోచనాలమ్మడం
వాణిజ్యం కాదు
వంచనా క్రీడారంగం మధ్యలో ఆపడం
అన్యాయం కాదు
విభేదాల సృష్టికర్త ముఖాలు గిల్లడం
హింసకాదు
అధికారరిరంసువుల దౌర్జన్యాలు
ఛేదించమంటుంది మన శస్త్రం
కుల మత కుడ్యాల నిర్మాతల చేతులు
ఖండించమంటుంది మన శాస్త్రం
అప్పుడు—
అనైక్యం తెల్లబోతుంది
ఆశయాలయం తలుపు విడుతుంది
శతకోటి పాణిపల్లవాల సమైక్యభారత
విశ్వరూపం
సత్యశాంత సుందర ముద్రతో కనిపిస్తుంది
ఆసియాకు అభయముద్ర పడుతుంది

నా జీవితానుభవాలు

చెప్పినది : కోలవెన్ను రామకోటేశ్వరరావు

వ్రాసినది : అక్కిరాజు రమాపతిరావు

నేను బందరులో చదువుకొనే రోజుల్లో తిరుపతి వేంకటకవులకూ, మా ప్రాంతం వారైన కొప్పరపు కవులకూ, అవధానక సంబంధమైన వాదవివాదాలు చెలరేగుతూ వుండేవి. తత్ఫలితంగా ఆంధ్రదేశంలో సాహితీపరుల్లో రెండు కక్షలు వచ్చాయి. అది కొంతలో కొంత వైదికి—నియోగి కక్షగా రూపాంతరమూ, పరిణామమూ చెందింది. విద్యావివాదాలు ఈ విధంగా పరిణమించడంలోని అనౌచిత్యం ఆరోజుల్లో గాఢంగా ఎవరూ సమాలోచించినట్లు కనపడదు. 1910వ సంవత్సరంలో మా నరసారావుపేటలో తిరుపతి వేంకటకవుల అష్టావధానం జరిగింది. ఆ సభలో రాయప్రోలు 'చంద్రుడెవ్వరికైన చల్లగా నుండడా, పద్మాల భాగ్యమాపాటిగాక' అన్న భావాన్ని తిరుపతి వేంకటకవులను అభినందిస్తూ చెప్పారు. అప్పుడే రాయప్రోలుతో నాకు మొదటి పరిచయం. అటుతరువాత చెన్నపట్నంలో వీరితో పరిచయం బాగా వృద్ధిపొందింది. ఆ రోజుల్లో మిత్రులందరమూ కలిసి సాహిత్య విషయాలు చర్చిస్తూ వుండేవాళ్ళం. అప్పుడే మా మిత్రుల్లో వొకరైన వింజమూరు రంగాచార్యులు పింగళి సూరన్న ప్రతిభను గూర్చి వొక చిన్న విమర్శ గ్రంథాన్ని ప్రకటించాడు. అప్పటికే కట్టమంచి రామలింగారెడ్డిగారి కవిత్వతత్త్వ విచారం వచ్చింది. మా మిత్రులమందరమూ సమావేశమై ఏకగ్రీవంగా రామలింగారెడ్డిగారు వ్రాసిందానికన్న మా రంగాచార్యులే మెరుగ్గా వ్రాశాడని ఎట్లానయితేనేం, శ్రమపడి సాధించాం!?

ఆ రోజుల్లోనే వ్యవహారిక భాషోద్యమంకూడా కాలూనుతున్నది. ఆ ప్రచారం కోసం బుర్రా శేషగిరిరావుగారూ, గిడుగు సీతాపతిగారూ ప్రెసిడెన్సీ కాలేజికివచ్చి కొన్ని ఉపన్యాసాలిచ్చారు. విద్యార్థులలో అధిక సంఖ్యాకులు గ్రాంథిక భాషాభిమానులుగానే వుండేవారు. ఆ తారుణ్యంలో, ఆ అమాయకత్వంలో ఉత్సాహంలో నేనూ, ఇంకా కొందరు మిత్రులమూ కలిసి, ఈ వ్యవహార భాషోద్యమ ప్రచారకుల సభల్లో, ఆ ఉపన్యాసకులను అల్లరిపెడుతూ వుండేవాళ్ళం. ఒకరోజున గిడుగు సీతాపతిగారు ఉపన్యసిస్తూ మాంచి ఆత్మవిశ్వాసంతోనూ, స్థైర్యంతోనూ "మీరిప్పుడు మా మాటలను లక్ష్యపెట్టక పోయినా, సమీప భవిష్యత్తులోనే మా తీర్పు ప్రకారమే" నడచుకుంటారు, తప్పదని గంభీరంగా పలికారు. "బేకన్స్ ఫీల్డ్" పార్లమెంటులో ఒక సందర్భంలో ఇట్లానే ఉద్ఘాటించాడు. సీతాపతిగారి మాటలను నేనందుకొని "మహాదిగావు లేవయ్యా అభినవ బేకన్స్‌ఫీల్డువి "అని వో విసురు విసిరాను, ఆ రోజులటువంటివి ఉత్సాహోద్రేకాలు పరవళ్ళు తొక్కుతుండేవి. తరువాత ఆయన జోస్యం నిజమైనట్లుగానే మేమంతా వ్యవహారిక భాషావాదానికెంతో ప్రోత్సాహమిచ్చాం.

ఉభయులకూ తెలిసిన బంధువుల ద్వారా బరంపురంలో నాకు సంబంధం కుదిరి 1913లో అక్కడే వివాహమైంది. నాభివారి కుటుంబం అక్కడ స్థిరపడ్డారు. కాబట్టి వాళ్ళ కుటుంబంతో మా సాన్నిహిత్యం మరిన్ని వృద్ధిచెందింది ఉదాదిగా, 1913 జూన్ 18న వివాహం జరిగింది. నా వివాహమైన ఆరు నెలలకే మా తండ్రిగారు ఆ సంవత్సరమే డిసెంబరు 18వ తేదీన పరమపదించారు. అప్పటికి వారి వయస్సు 60 సంవత్సరాలు. 1917లో బి ఎల్ పట్టా పుచ్చుకొని స్వగృహంలో వుండి ఇంటికి ఎదురుగా ఉన్న కోర్టులో నరసారావు పేటలో ప్రాక్టీస్ ప్రారంభించాను మా తండ్రిగారి దగ్గర గుమాస్తాగా ఉన్న శ్రీ బెల్లంకొండ లక్ష్మీనారాయణగారు కొన్నాళ్ళు నాకు సహాయులుగా ఉన్నారు. తరువాత కొన్నాళ్ళు శ్రీ ఎండపల్లి భుజంగరావు గారు గుమాస్తాగా వున్నారు

నరసారావు పేటలో స్థిరపడటానికి ముందు మద్రాసులో విద్యార్థి దశ ఆనందంగా గడిచి పోయిందనే చెప్పాలి. సాహిత్యపరులైన మిత్రులతో, ఉత్సాహంగా గడిచి పోయేదికాలం. 1914లో రాయప్రోలు తృణ కంకణం, ప్రకటించారు. తృణ కంకణాన్ని గూర్చి మా మిత్ర మండలి వాళ్ళం సమావేశమైనప్పుడల్లా చర్చించే వాళ్ళము. తెలుగు సాహిత్యానికి నూతనమైన వికాసం కలిగించిందా కావ్యమని మేమంతా అభిప్రాయపడేవాళ్ళము తృణ కంకణం ఒక నెరేటివ్ పోయమ్. ప్రేమ గాథ.

1917వ సంవత్సరం నుంచి 1921 దాకా నరసారావుపేటలో ప్రాక్టీస్ చేశాను. కోర్టు మా యింటికి ఎదురుగానే వుండేది. కోర్టు వెనకాలే క్లబ్ వొకటి వున్నది. ప్రతిరోజూ టెన్నిస్ ఆడేవాణ్ణి. ఆ రోజులు చాలా సంతృప్తిగా, ఉత్సాహంగా గడిచిపోయినాయి. నాన్నగారి క్లయింట్లు చాలామంది వచ్చి చేరినందువల్ల సంపాదన కూడా తృప్తికరంగా వుండేది. క్రిమినల్ కేసులో కంటే సివిల్ కేసులోనే పనిచేయడం నాకెక్కువ అభిలాష. కొంతకాలమైన తరువాత ప్రాక్టీస్ గుంటూరుకు మార్చవచ్చునన్న కోర్కె ఆ రోజుల్లో ఉండేది. నాతోటి ప్లీడర్లలో చావలి వెంకట కృష్ణయ్యగారు, తాడేపల్లి సంపూర్ణ లక్ష్మీనారాయణగారు నాకు అత్యంత సన్నిహితులూ, ప్రీతిపాత్రులూ అయినారు. కాలేజీలో చదువుకుంటున్న రోజులనుంచీ వారు నాకు సన్నిహితులు. అప్పటివారిలో మా ఊళ్ళో నడింపల్లి జగన్నాథరావుగారు, కొండుభొట్ల గోపాల కృష్ణయ్యగారు ప్రముఖ వ్యక్తులు. జగన్నాథరావుగారు గొప్ప చరిత్ర పరిశోధకులు. ఆంధ్ర మహాసామ్రాజ్యమన్న ఉద్గ్రంథాన్ని ప్రకటించారు. పురాతత్త్వవిశారద అన్న బిరుదుకూడా వీరికుండేది.

గోపాలకృష్ణయ్యగారు న్యాయవాదుల్లో చాలా ప్రముఖుడుగా ఉండే వారు. నరసారావుపేటలో కుదురుగాఉన్న నాలుగైదు సంవత్సరాలలో కొంత నిర్మాణాత్మక కార్యక్రమం కూడా మిత్రుల సహాయంతో నిర్వహించాను. 1917లో శ్రీ బెల్లంకొండ రాఘవరావు గారితో కలిసి మా ఊళ్ళో ఒక గ్రంథాలయం స్థాపించాను. అది ఇప్పుడు మునిసిపల్ లైబ్రరీగా రూపొందింది. హోమ్‌రూల్ ఉద్యమంపట్లా, ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమంపట్లా విశేషమైన ఆసక్తివుండేదినాకు. గాంధీగారి ఉద్యమానికి పూర్వమే 1916లో ఏనిబిసెంట్‌గారు హోమ్‌రూల్ ఉద్యమాన్ని ప్రారంభించి భారత దేశానికి చాలా గొప్ప సేవచేశారు. ఆ రోజుల్లో ఆమె ప్రబోధం వల్ల ఎందరో యువకులు ప్రభావితులైనారు. మా ఊరి నాటక శాలలో నిర్వహించే కార్యక్రమాలలోనూ, ఇతర స్థానిక కార్యక్రమాలలోనూ ఉత్సాహంగా పాల్గొనేవాణ్ణి.

1917లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభకు వెళ్ళాను. అక్కడ మహానాయకులందరినీ దర్శించటం ఒక అపూర్వానుభూతి. బాలగంగాధరతిలక్, సురేంద్రనాథబెనర్జీవంటి మహానాయకుల సందర్శనం. వారి ఉపన్యాసాలువినే మహద్భాగ్యం మరువలేనిది. అప్పుడే శ్రీ జె. సి. బోస్ [ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త జగదీశచంద్రబోస్] గారి ఉపన్యాసంకూడా విన్నాను. నాకు న్యాయవాద వృత్తిలో మంచి అభిరుచి వుండేది కాని, తగినంత కృషి చేయకముందే గాంధీ మహాత్ముని మహోద్యమం ఆకర్షించడం వల్ల, జీవితం వేరొక మార్గంలో పడింది. విద్యార్థిదశనుండికూడ కలకత్తానుండి వెలువడుతుండే 'మోడరన్‌రివ్యూ' కు చందాదారుణ్ణి. ఆ పత్రికను శ్రద్ధగా చదివే వాణ్ణి. తెలుగు పత్రికల్లో కృష్ణాపత్రిక నాకు ప్రీతి పాత్రంగా వుండేది. డా. పట్టాభిగారి 'జన్మభూమి' పత్రికకూడా నా అభిమాన పత్రికగా వుండేది. ఆరోజులు కాంగ్రెసు రాజకీయాల్లో ఒక పరిణామదశ అని చెప్పాలి.

1907 లో సూరత్ కాంగ్రెసులో చీలిపోయిన మితవాదులను, అతివాదులను కలిపి సంయుక్త కాంగ్రేస్‌గా రూపొందించి ఎనిబిసెంట్‌గారు దేశానికి మహోపకారంగావించారు. 1910లో కాంగ్రెస్ గొప్ప ఆందోళన లేవదీసింది. 1910 లోనే మార్లే-మింటో సంస్కరణలు వచ్చాయి. కాని ఈ సంస్కరణలు కొందరికి నచ్చలేదు. ఇంతకన్నా అధికమైన ప్రాతినిధ్యం హిందూదేశీయులకు కలగాలనీ, స్వరాజ్య సంపాదనకు అనువైన మార్గం నిర్దేశించాలనీ, కాంగ్రెస్ ఆందోళన లేవదీసింది. ఈ ఆందోళన ఫలితంగా మాంటేగ్ హిందూదేశానికి వచ్చి పర్యటించి, దశలవారీగా భారత దేశానికి స్వాతంత్ర్యం ప్రసాదించడానికి ఒక నివేదికను సిద్ధపరిచాడు. తిలక్ మహాశయుడు, ఈ నివేదిక ఏమాత్రమూ సంతృప్తికరంగా లేదని నిరాకరించాడు. దీనితో మళ్ళీ కాంగ్రెస్‌లో చీలికలు ఏర్పడ్డాయి. మితవాదులంతా కలిసి కాంగ్రెసు నుంచివిడిపోయి లిబరల్ లీగ్ అనే పేరుతో వేరే సంస్థను స్థాపించారు. ఆంధ్రదేశంలో మోచర్ల రామచంద్రరావుగారు, న్యాపతి సుబ్బారావు పంతులుగారు మొదలైన వారంతా ఇందులో చేరారు. పట్టాభిగారు, కొండ వెంకటప్పయ్యగారు మాత్రం కాంగ్రెస్ సంస్థలోనే వుండి, నిరంతరం, దేశసేవచేసేవారు. ఆరోజుల్లో మోచర్ల రామచంద్రరావుగారు మద్రాసు శాసన సభలో ప్రధానపాత్ర వహించారు. ఆ తరువాత శాసన సభలో సభ్యులైనారు. ఢిల్లీలో పని చేసే శాసన సభను 'ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్' అనేవాళ్ళు. పరిమితమైన పరిధిలోనే ఆ రోజుల్లో నాయకులు పనిచేయవలసివచ్చేది. కాని అవకాశంవున్నంతలోనే దేశ సౌభాగ్యంకోసం వాళ్ళు పాటు పడేవాళ్ళు. రామచంద్రరావుగారి తర్వాత కొండ వెంకటప్పయ్య గారు మద్రాసు శాసన సభకు, గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల తరపున ఎన్నికైనారు.

1913 లోనే ప్రారంభమైన ఆంధ్రరాష్ట్రోద్యమ్యం కూడా, ఆరోజుల్లో బాగా వ్యాప్తి చెందింది. ఆంధ్రరాష్ట్రం కోరుతూ నాయకులంతా మాంటేగ్‌కు ఒక వినతి పత్రం కూడా సమర్పించారు. మాంటేగ్ సూత్రప్రాయంగా దీన్ని అంగీకరించాడుకూడా. కాని మన నాయకులంతా సహాయ నిరాకరణోద్యమంలో ప్రవేశించినందువల్ల అటుపై ప్రభుత్వంతో, ఆంధ్ర రాష్ట్ర స్థాపన విషయమై సంప్రతింపులు జరిపేందుకు అవకాశం లేకపోయింది. రాయప్రోలు సుబ్బారావుగారి దేశభక్తి ప్రపూరితాలైన గీతాలు ఆ రోజుల్లో ఆంధ్రోద్యమ వ్యాప్తికి బాగా తోడ్పడ్డాయి. దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు కూడా ఇంగ్లండు నుండి వచ్చిన తరువాత కొంత కాలం రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో పనిచేసి, కొన్ని పేచీలు పెట్టుకొని, అక్కడ ఉద్యోగానికి స్వస్తిచెప్పి, ఆ తరువాత ఆంధ్ర జాతీయ కళాశాలలో చేరారు. అక్కడాయన ధర్మార్థ కామ మోక్షాలు గూర్చి పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు. అక్కడ కూడా, ఆయనకు అభిప్రాయ భేదాలు వచ్చాయి. జాతీయ కళాశాలనూ విడిచిపెట్టారు. ఆంధ్ర మహాసభ కార్యదర్శిగా గోపాలకృష్ణయ్యగారు మొట్ట మొదట రాజకీయాల్లో ప్రవేశించారు. ఆ తరువాత అసహాయోద్యమంలో చేరి గొప్ప నాయకులైనారు. వీరి రామదండు ఉద్యమం, ధైర్య సాహసాదులూ, చీరాలలో నిర్వహించిన సత్యాగ్రహం, లోకప్రసిద్ధాలు.

నేను కొంతకాలం సహాయ నిరాకరణోద్యమంలో ఈ ప్రాంతంలో కృషిచేసి గుంటూర్లో రాష్ట్ర కాంగ్రెస్ సంఘానికి ప్రచురణోద్యోగిగా శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారికి (స్వామీ సీతారాం) తోడ్పడే వాణ్ణి. ఆ రోజుల్లో దేశమంతటా వెల్లివిరిసిన ఉత్సాహం, కార్యదీక్ష, నిరుపమానంగా వుండేవి. కోర్టులు బహిష్కరించాలనీ, విద్యార్థులు స్కూళ్ళను వెలివేయాలనీ, శాసన సభల్లో పాల్గొనకూడదనీ, గాంధీగారు ప్రబోధించారు. దీన్నే త్రివిధ బహిష్కారం అనేవారు. దీన్ని అనుసరించే నావంటివాళ్ళ 1920 నాగపూర్ కాంగ్రెస్ సభల తర్వాత, న్యాయవాద వృత్తిని విసర్జించాము. అంతకు పూర్వమే జరిగిన ఎన్నికలలో ప్రజలు వోటుచేయకూడదని వొక ఆందోళన యీ ప్రాంతాలలో బాగా జయప్రదంగా కొనసాగింది. శ్రీ కొండ వెంకటప్పయ్య పంతులు తమ శాసన సభా సభ్యత్వానికి రాజీనామా ఇచ్చారు. 1921 వ సంవత్సరంలోనే వెంకటప్పయ్య పంతులుగారూ, ఉన్నవ లక్ష్మీనారాయణగారూ, కారాగార శిక్ష అనుభవించారు. ఇది గుంటూరు మండల పన్నుల నిరాకరణోద్యమానికి నాంది అయింది. ఉన్నవ

లక్ష్మీనారాయణగారు వేలూరు జైలులో వున్నప్పుడే 'మాలపల్లి' రచించారు. ఆధునికాంధ్ర సాహిత్యంలో ఈ మహోత్తమ గ్రంథం వొక నూతనాధ్యాయాన్ని సృష్టించింది. ప్రథమంగా దీన్ని ముద్రించిన కీర్తి శ్రీ బెల్లంకొండ రాఘవరావుగారిది. దేశ వ్యాప్తంగా వుధృతంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమ చరిత్రను విపులంగా చెప్పాల్సిన పనిలేదనుకొంటాను. దేశ చరిత్రలో యీ ఉద్యమం ప్రధాన స్థానాన్ని వహిస్తుంది.

1921 నవంబరులో శ్రీ ప్రకాశం పంతులుగారు 'స్వరాజ్య' అనే ఆంగ్ల దిన పత్రికను చెన్నపట్నంలో ప్రారంభించారు. నేను అందులో సహాయ సంపాదకుడిగా చేరాను.

ఈ అధ్యాయం ముగించే ముందు ఒక విషయం చెప్పవలసి వుంటుంది. 1904 వ సంవత్సరంలో చనిపోయిన మా అన్నగారు శ్రీ రామగోపాల కృష్ణారావుగారి కుటుంబం గురించి నాలుగుమాటలు చెప్పాలి. మా ఒదినగారు మహాతల్లి. 50 సంవత్సరాలు వైధవ్య దుఃఖాన్ననుభవించి 1956 వ సంవత్సరంలో నా చేతిమీదుగానే వెళ్ళిపోయారు. ఈమె తన కన్నకడుపుకన్నా మిన్నగా నన్ను ప్రేమించేవారు. మా అన్నగారి మరణానంతరం బందరు చేరుతూ, ఈ మహా దుఃఖంలో సైతం, నన్ను విడిచి వెళ్ళటం ఎక్కువ దుఃఖకరంగానూ, వ్యసనకరంగానూ వుందని కన్నీళ్ళు పెట్టుకున్నారు. మా ఒదినగారిది మహా దయనీయమైన జీవితం. మా కంటి పాపలాగా పెరిగిన మా అన్నగారి కొడుకు రాజగోపాలరావు మరణించటంతో, ఆమె దురదృష్టం అవధి నందుకుంది. ఈమెగారు తమ జీవితాన్నంతా గీతా ప్రచారానికి అర్పించుకున్న ధన్యురాలు. పరమ భక్తురాలు. మహా జ్ఞాని. సాధు చరిత. ద్వంద్వాలకు అతీతమైన స్థితప్రజ్ఞ నామె జీవితంలో సాధించగలిగారు. ఆమెగారు చనిపోయే ముందు విహ్వల భావంతో, 'ఒదినా మన రాజగోపాలం వున్నట్లయితే యీ పాటికి ఎంతవాడయ్యేవాడో కదా" అన్నాను. దాని కామె "నాయనా వాడు మధ్యలోనే వచ్చాడు. మధ్యలోనే వెళ్ళాడని" సాంత్వన వాక్యాలు పలికింది. ఆమె మారెళ్ళవారింటి ఆడపడుచు. పేరు అన్నపూర్ణమ్మగారు. మా అమ్మగారిపేరు రుక్మిణమ్మగారు.

ఈ విధంగా 1921 నవంబరులో మద్రాసుచేరి స్వరాజ్యలో సహాయ సంపాదకుడిగా చేరిందాకా, నరసారావుపేటలో వున్నాను. మద్రాసు వెళ్ళబోయే ముందు జరిగిన ఇంకో సంఘటన వివరించాలి. అది గిడుగు రామ్మూర్తి పంతులుగారి దర్శనం. 1920 ప్రాంతంలో రామ్మూర్తి పంతులుగారు మా నరసారావుపేట వచ్చారు. వారివెంట శ్రీ బెల్లంకొండ రాఘవరావు వద్దకు పమిడిపాడు వెళ్ళాను. అది చాలా అపూర్వమైన అనుభవం. రామ్మూర్తి పంతులుగారు మా ఊరి హైస్కూల్లో గొప్ప ఉపన్యాసం ఇచ్చారు. వారిదగ్గర, వ్యవహారిక భాషోద్యమానికి అవసరమైన సరంజామా అంతా వుండేది. కవిలెకట్టలూ, సాక్ష్యాధారాలూ జయ పత్రికలూ, రుజువులూ, తమ వాద నిరూపణాధారాలూ అన్నీ వుండేవి. వ్యవహారిక భాషోద్యమం ఆయనవల్లనే వ్యాపించింది. ఫలించింది.

స్వరాజ్య పత్రికలో రెండేళ్ళు సహాయ సంపాదకుడిగా పని చేసిన రోజులు మరువలేనివి. ప్రకాశం పంతులుగారు నిర్వహించిన స్వరాజ్య పత్రిక మన దేశంలోనే పత్రికానిర్వహణలోనూ, వార్తా పత్రికల ప్రచురణలోనూ ఒక చరిత్రను సృష్టించింది. ఎప్పుడైనా సంపాదకీయాలను వ్రాయటం, వార్తలను 'ఎడిట్' చేయడం చేస్తూ వుండేవాణ్ణి. స్వరాజ్యలో నాతోపాటు శ్రీ ఖాసా సుబ్బారావు, కృపానిధిగార్లు పనిచేసేవారు. వారితో కలిసి పని చేయటం, మరపురాని ఒవ్యానుభూతి అనిపిస్తూ వుంటుంది. ట్రిప్లికేన్‌లో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని వుండేవాళ్ళం. మా అమ్మగారు మాతోనే వుండేవారు. 'బ్రాడ్‌వే' లో స్వరాజ్య ఆఫీసు వుండేది. సుమారుగా 5, 6 వేల ప్రతులు స్వరాజ్య అచ్చువేసేవారు. పత్రికను ప్రతిభావంతంగానే నడిపినా, ఆర్థికంగా సౌష్టవం లేక చాలా వొడుదుడుకులోనైంది. ప్రకాశంపంతులుగారు తమ సంపదనంతా వెనకా ముందు చూడకుండా యీ పత్రికకోసం వెచ్చపెట్టేవారు. ప్రకాశంగారితో నాకొక చిన్న వివాదం సంభవించింది. పత్రికలో ఎవరో సర్ యస్. సుబ్రమణ్యయ్యర్ గారినిగూర్చి ప్రస్తావిస్తూ ఆయనగారు రెండు సార్లు కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా వున్నారని ఉదహరించారు. ఇది పొరపాటనీ ఆయనెప్పుడూ కాంగ్రెసధ్యక్షుడుగా వుండలేదనీ ప్రకాశంగారితో అంటే, "నీవప్పటికి పుట్టలేదు—నీకెట్లా తెలుసు?" అని చమత్కార ధోరణిలో వేళాకోళం చేశారు. కాని తరువాత నన్నే వెళ్ళి ఆ పొరపాటును దిద్దమని పురమాయించారు. మొదట తొందరపడినా ఇతరుల మాటను మన్నించటం పంతులుగారి దొడ్డ గుణాలలో ఒకటిగా వుండేది. ఆ కాలంలో శ్రీ సి. రాజగోపాలాచారిగారు తరుచూ స్వరాజ్య ఆఫీసుకువచ్చి సహకారం నెరుపుతూ వుండేవారు. వారి పరిచయ భాగ్యం నాకప్పుడే కలిగింది. పంతులుగారూ రాజగోపాలాచారిగారూ అప్పుడు అత్యంత సన్నిహితులుగా వుండేవారు. ఖాసా సుబ్బారావు చాలా ప్రతిభావంతుడనీ, వ్యాస రచనలో అందెవేసిన చేయిఅనీ అప్పటికే పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. కృపానిధితోనూ, ఖాసాతోనూ నాకు చాలా స్నేహం వుండేది. ముగ్గురం ఒకే చోట కలిసి పనిచేస్తూ వుండేవాళ్ళం కాబట్టి, కలిసి మెలిసి వుండేవాళ్ళం.


స్వరాజ్య పత్రికలో తీవ్రమయిన వ్యాసాలు వస్తూవుండేవి కనుకా, సహాయనిరాకరణోద్యమాన్ని మిక్కిలి ప్రోద్బలపరుస్తున్నందువల్లా, ప్రభుత్వంవారు పత్రికపై చర్య తీసుకుంటారేమోనని ఎప్పటికప్పుడు విచికిత్సకు లోనవుతూ వుండేవాళ్ళం. కానీ అలాటిది సంభవించలేదు. సి. ఆర్. అప్పుడప్పుడు స్వరాజ్య పత్రికలో కాంగ్రెస్ రాజకీయాలనుగూర్చి వ్రాస్తూ వుండేవారు.

స్వరాజ్య పత్రికలోనే ఆ పత్రిక వచ్చినంతకాలం పనిచేసే వాణ్ణేమోకాని, బందరునుండి పట్టాభి సీతారామయ్యగారు నేను వచ్చి జాతీయ కళాశాలలో అధ్యాపకత్వం స్వీకరించవలసిందని అభిలషించినందున 1923 వ సంవత్సరం జూలై నెలలో బందరువచ్చి జాతీయ కళాశాలలో అధ్యాపకుణ్ణిగా చేరాను. అప్పటికే కోపల్లె హనుమంతరావు గారు కీర్తిశేషులైనారు.

[సశేషం]

దినదిన ప్రవర్ధమానమౌతున్న

నిజాం పంచదారమిల్లు




ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమన దగిన నిజాం పంచదార మిల్లు భారతదేశంలోనే పెద్ద కర్మాగారం. ఈ మిల్లు రోజుకు 4500 టన్నుల చరకుగడను గానుగపడుతుంది. నిజామాబాదు జిల్లాలోని బోధన్‌లోవున్న యీ మిల్లును ఆగ్నేయాశియాలోనే పెద్ద పంచదార మిల్లుగా పేర్కొవచ్చు. 1938లో యీ మిల్లు పని చేయడం ప్రారంభించింది. ఈ మిల్లులోని రెండు విభాగాలూ ఏటా సుమారు 6 లక్షల టన్నుల చెరకుగడను గానుగపడతాయి.

ఈ కర్మాగారం యింతగా ప్రసిద్ధి చెందడానికి యిక్కడ చెరకు గెడను విస్తారంగా పండించడమే ప్రధాన కారణం. ఈ మిల్లు సేకరించిన వెయ్యి ఎకరాలలోనూ 1937_38 నుంచి స్వంతంగా చెరకు గెడను పండించడం ప్రారంభించారు. వీరు రైతులనుంచి సేకరించిన భూమి విధిగా సేద్యం చేయవలసిన దాన్నుండి ప్రభుత్వం మనహాయించినదీ, ఎక్కువ అభివృద్ధిపరచ వలసినదీను.

మొట్టమొదటి ఏడాది ఎకరాకు సగటున 9 టన్నుల చెరకు గెడ మాత్రమే దిగింది. ఆ తర్వాత 20 మైళ్ళ పరిధిలోవున్న మరిన్ని ఎకరాలను సేకరించి షుగర్‌ఫారం ఒకటి ఏర్పాటు చేయబడింది. ఈ కంపెనీ ఆధీనంలోవున్న భూమి సంవత్సరాలు గడిచే కొద్దీ మరింతగా విస్తరింప చేయడం జరిగింది. ఇప్పుడు దీని క్రింద 16,782 ఎకరాలు వున్నాయి.

ఈ కర్మాగారం 1956 నాటికి 5,500 ఎకరాల్లో చెరకు పండిస్తుండేది. అప్పటికి ఎకరా దిగుబడికూడా 40 టన్నులకు పెరిగింది. ఇప్పుడు చెరకును 6,500 ఎకరాల్లో పండిస్తున్నది. ఎకరా దిగుబడి యీ నాడు 43 టన్నులు వుంది. నాటిన చెరకులోంచి, వచ్చే ఏడాదికి చెరకు మొలకల్ని విడిగా వుంచడం జరుగుతోంది. వీటిని అనేకమంది రైతులకు కూడా పంపిణీ చేస్తున్నారు.



చెరకు గెడ నుండి చక్కెర వరకు

1. నిజాం చక్కెర మిల్లు దృశ్యం.

2. చెరకు గడ కోసిన తర్వాత రెండెడ్ల బళ్ళలో దానిని మిల్లుకు చేరవేస్తారు.

3. పెద్ద పెద్ద పదును అంచుల ప్లేట్లతో చెరకు గెడను చిన్న చిన్న ముక్కలుగా చేస్తారు.


4. చిన్న చిన్న చెరకు గెడ ముక్కల్ని మరగానుగలో ఆడి రసం తీస్తారు.


5. చెరకు రసాన్ని మరగగాచి తేటని ఆవిరి గావిస్తారు. పంచదార తెల్లబడటానికి దానిలో గంధకం, సున్నం, ఇతర సామానులను తగు పాళ్ళలో కలుపుతారు.

6. మొదటి అంచెలో చెరకురసం ఆవిరి కావింపగా, రెండో అంచెలో చక్కెర పలుకుల్ని ఎండ బెడతారు.

7. పంచదారను సంచుల్లోకి ఎక్కిస్తారు.

8. వినియోగదార్ల వద్దకు దాన్ని చేరవేస్తారు.





పరిశోధనా విభాగం

ఈ కర్మాగారం ఎస్టేటు ప్రారంభించిన తొలి రోజులలో భూమి స్వభావం. శాస్త్రీయ పద్ధతుల్లో చెరకుతోట పెంపకం విషయాలకు సంబంధించి తగినంత మార్గదర్శకత్వం, సమగ్రమైన సమాచారం లేకపోయింది. అందువల్ల యీ కర్మాగారం 1912లో ఒక చిన్న పరిశోధనా విభాగాన్ని నెలకొల్పింది. నేల బాగోగులను గురించి పరిశోధనలు జరపడం, దిగుబడి పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం వంటి పనులను యీ విభాగంద్వారా జరపడానికి వీలయ్యింది.

పరిశోధనకు ఎక్కువ ప్రాముఖ్యం యివ్వడంవల్ల ఆ తరువాతి సంవత్సరాలలో చెరకు దిగుబడిని ఎక్కువ చేయడానికి వీలయ్యింది. మొదట్లో యిక్కడ తక్కువ దిగుబడి రకాలు పండించబడుతుండేది. ఈ రకాలకు రసం తక్కువ. పిప్పి ఎక్కువ. ఈ రకాలను మెల్ల మెల్లగా తొలగించి అధిక దిగుబడి రకాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఎక్కువ దిగుబడినిచ్చే కొత్త కొత్త రకాలను కనుగొనడానికి నిత్యం యిక్కడ పరిశోధనలు జరుగుతూనే వున్నాయి. రుద్రూరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం వారు జరిపే పరిశోధనా కార్యక్రమంతో యీ కర్మాగార పరిశోధనా విభాగము తమ కార్యక్రమాలను సమన్వయించి పని చేస్తున్నది.

చెరకు సరఫరా విభాగం

ఈ కర్మాగారంలో చెరకు సరఫరా విభాగం ఒకటి ఏర్పాటు చేయబడింది. ఈ విభాగం రైతులకు, కర్మాగారానికి మధ్య అనుసంధాన శాఖగా పని చేస్తుంది. చెరకు పెంపకందార్ల అవసరాలను కూడా యీ విభాగం చూస్తుంది. ఈ కర్మాగారం కార్మికులందరికీ మంచి నీటి సౌకర్యం, పారిశుధ్య సౌకర్యం, వైద్య సౌకర్యాలతో కూడిన గృహవసతి కల్పించబడింది. అన్ని చెరకు ఫారమ్‌లలోనూ ప్రాథమిక పాఠశాలలు వున్నాయి. వీటి భవనాలు, పరికరాలు మొదలైన వాటిని యీ కర్మాగారమే అందజేసింది

ఈ కర్మాగారంలో ఆడుతోన్న చెరకు గెడలో సుమారు 2,50,000 టన్నుల చెరకుగెడ నేరుగా యీ కర్మాగారానికి చెందిన చెరకు తోటలనుంచే వస్తోంది. సుమారు 3,50,000 టన్నుల చెరకుగడను రైతులు సరఫరా చేస్తున్నారు. చెరకుగడను పండించేందుకు రైతులను ప్రోత్సహించే వుద్దేశంతో కర్మాగారం వారు రైతులకు అనేక ప్రోత్సాహక సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఆర్థిక రూపంలో కల్పిస్తోన్న సౌకర్యాలవల్ల యీ కర్మాగారం పరిసరాలలోని చెరకు పెంపకందార్లు యీ నాడు తాము స్వంతంగా పెట్టుబడి పెట్టుకుంటానే చెరకు పండించే స్థితిలో వున్నారు.

శక్కర్‌నగర్ ప్రాంతం అభివృద్ధి చెందిందంటే అందుకు కారణం యీ పంచదార మిల్లే. నిజామాబాదు జిల్లా ఐశ్వర్యానికి నిజాంసాగర్ ప్రాణాధారం అనవచ్చు. పదేళ్ళ క్రితం సాగులో వున్న అభివృద్ధి చెందిన మొత్తం భూమి 1,75,000 ఎకరాలు వుండగా యీ నాడు 2,35,000 ఎకరాలు వుంది.

పట్టణం

నిజాం పంచదార మిల్లు చుట్టూ పెరిగిన వూరు బాగా పెరిగి అభివృద్ధి చెందుతోంది. ఈ వూళ్ళో అన్ని హంగులూగల ఆసుపత్రి, కుటుంబ నియంత్రణ క్లినిక్కు, ఇంకా కార్మికులకు కావలసిన అనేక సౌకర్యాలు వున్నాయి. ఈ కర్మాగారం విషయంలో చెప్పుకోదగిన అంశమేమంటే యీ కర్మాగారం యాజమాన్యానికీ, కార్మికులకూ మధ్య సుహృద్భావ స్నేహవాతావరణం వెల్లి విరిసి వుండడమే. ★

భవన నిర్మాణపు పనివారలకు కనీస వేతనాల నిర్ణయం

భవనములు, రోడ్ల నిర్మాణం పనులలోనియమించబడిన పనివారలకు కనీస వేతనాలను నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. ఈ ప్రకటన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వగజెట్‌లో ప్రచురించబడిన తేదీ నుంచి ఈ వేతనాలు అమల్లోకి వస్తాయి.

కనీస రేట్ల వివరాలు:		ఇతర పనివారలకు .	
నిపుణతలేని పనివారలకు	నెల 1కి రూ. 90లు రోజుకు రూ. 3.00లు	గుమాస్తాలు, స్టోరుకీపరు, మస్టర్‌క్లర్కు	నెల 1కి రూ. 140.00లు రోజు 1కి రూ. 4.65లు
కొంత నిపుణతగల పనివారలకు	నెల 1కి రూ. 127.50లు రోజుకు రూ. 4.25లు	రెండెద్దుల బండిగల వ్యక్తికి	నెల 1కి రూ. 315.00లు రోజు 1కి రూ. 10.50లు
నిపుణతగల పనివారలకు	నెల 1కి రూ. 180.00లు రోజు 1కి రూ. 6.00లు	ఒంటెద్దు బండిగల వ్యక్తికి	నెల 1కి రూ. 225.00లు రోజు 1కి రూ. 7.50లు

పిల్లలను పనిలో నియమించినట్లయితే, వారికి వయోజనఉద్యోగులకిచ్చే జీతంలో 75 శాతం చెల్లించాలి.

మహాభారతము

తెమెగంటుల లక్ష్మణశాస్త్రి

46

సౌగంధికాహరణము:-

అప్పుడు ఈశాన్యదిక్కునుండి వీచిన గాలి ద్వారా ఒక సూర్యాకారమగు వేయిరేకుల కమలము వచ్చి పాండవుల యెదుట పడెను. దివ్యగంధము గల ఆ పద్మమును ద్రౌపది తీసికొని భీమసేనునితో "నాథా! ఈ సుగంధికుసుమము ఎంతో మనోహరముగా నున్నది. దీనిని ధర్మరాజున కిచ్చెదను. ఇట్టిదే వేరొక పుష్పము నాకు తెచ్చి యిమ్ము. నీకు నాయెడల ప్రేమ యున్నచో నిట్టి పువ్వులనేకములు తెచ్చి యిమ్ము. వానిని నేను కామ్యక వనమునకు తీసికొని పోయెదను ." అని చెప్పి యామె దానిని ధర్మరాజున కిచ్చెను.

ప్రియురాలి కోర్కె తీర్చుటకై భీమసేనుడు ఆ పువ్వును తెచ్చుటకు గాను ఆపుష్పగంధము వచ్చిన యీశాన్యదిక్కునకు అభిముఖుడై పోయెను. అతడు చేతియందు సువర్ణధనస్సును, సర్పములవంటి బాణములను ధరించి సింహమువలె క్రోధముతో మదధారలు స్రవించుమదగజమువలె నడచి పోయెను. అట్లు నడచు చున్నభీముని సర్వభూతములు చూచెను. ఆ వాయుకుమారుని అలసటగాని వైకల్యముగాని, భయసంభ్రమములుగాని అంట కుండెను. మహాబలశాలియై యెదుటనున్నగంధమాదన పర్వతము పైకి ఎగిరిపోయెను. అనేకపుష్పఫలతరుశోభితము, నీలశిలామయము, నానావర్ణధాతువులు, వివిధపక్షికులములు గలిగి యున్న ఆ పర్వతము సర్వాభరణశోభిత మగు భూదేవి భుజమువలె ప్రకాశించు చుండెను.

రమణీయ మగు నాగంధమాదనపర్వతమును నేత్రానందకరముగా చూచుచు మనస్సున కాహ్లాదము గొలుపు శ్రవణానందకరములగు కోకిలాది పక్షులరవములను వినుచు భీమసేనుడు మనస్సునకు చక్షువులకు, శ్రోత్రములకు నేకకాలమున మహానందము ననుభవించెను. వివిధ పుష్పసుగంధ మిశ్రితమగు వాయువు వీచుటచేత ఘ్రాణేంద్రియ తృప్తి గాంచెను. శీతలవాయుస్పర్శచేత అలసట తీరి శరీరానంద మనుభవించెను. ఈవిధముగా నతడు పంచేంద్రియతృప్తి గాంచు చుండెను. ఆ పర్వతశరీరమునందు వివిధ ధాతువుల రంగులచేత రేఖలేర్పడి యిరువైపుల మేఘములు రెక్కలవలె ఆడుచుండగా నా పర్వతము రంగుల వేషముతో రెక్కలు గట్టుకొని నృత్యము చేయుచున్నట్లుండెను. సెలయేళ్లు ముత్యముల హారములవలె గిరికూటములందు ప్రకాశించెను. నదులు క్రిందకు పారుచుండగా ఆ పర్వతముయొక్క వస్త్రము జారి పడుచున్నట్లుండెను. భీతహరిణములు తనను చూచుచుండగా భీమసేనుడు సంతోషముతో నాడుచు పాడుచు నడచు చుండెను. మనస్సులో దుర్యోధనుడు చేసిన యపకారములను, ద్రౌపదికష్టములను, ధర్మరాజుధర్మశీలత్వమును తలచుకొనుచు పుష్పమును అన్వేషించుచు ముందుకు సాగుచుండెను. పాదవిక్షేపముచేత భూమిని కంపింప జేయుచు, సింహవ్యాఘ్రగజాదులను భయపరచుచు సింహనాదములచేత గుహలలోని మృగములుగూడ బయటికి వచ్చునట్లు చేయుచు, భయముచేత వనవాసులు దాగి యుండునట్లు చేయుచు ముందుకు పోయెను. అచట నున్న కదళీ వనమును క్షోభింపజేసెను. ఆపైన నొకసరోవరమును చూచెను. అందులో జలక్రీడ చేసి శంఖమును ఊదెను. ఆతని సింహనాదముచేతను, శంఖనాదము చేతను, అచటి మృగపక్షి కులములు గగ్గోలు పడెను.

ఆ ధ్వని విని అచట కదళీవనమునందున్న హనుమంతుడు "ఆవచ్చువాడు తనసోదరుడగు భీముడు, ఇతడీమార్గమున స్వర్గమునకు పోయినచో చాలకష్టపడు నని తలచి ఆ మార్గమును అడ్డగించి శయనించి యుండెను. భీముడు ముందుకు సాగి హనుమంతుని చూచి పెద్దగా సింహనాదము చేసి 'త్రోవ విడువు' మనెను. అప్పుడు హనుమంతుడు కన్నులు తెరచి యిట్లనెను:—

'అయ్యా ! నేను రోగిని, ఇక్కడ నిద్రించుచున్నాను, నీవు భూతములయందు దయా దృష్టితో మెలగ వలెను, మేము తిర్యగ్జంతువులముగనుక ధర్మము నెరుగము. మనుష్యులు బుద్ధిమంతులగుటచేత ప్రాణులయందు దయ గలవారగుదురు. నీవంటి బుద్ధిమంతులు, మనోవాక్కాయ దూషితములగు నిటువంటి

అధర్మము లగు క్రూరకర్మలు చేయుదురా? నీవు ధర్మము నెరుగవా? బుధులను సేవించలేదా? అల్పబుద్ధితో జంతువులనే నశింపజేయు చున్నావు? నీవెవడవు? మానవులకు వర్జిత మైన యీ వనమున కేల వచ్చితివి? ఇప్పుడు నీ వెచ్చటకు పోవలెను? ఈ పైన ఈ పర్వతము నందు నీవు పోవజాలవు ఇది దేవలోక మార్గము. సిద్ధ గమనము లేక యెవరును నిచట ముందుకు పోవ జాలరు. మానవుల కిది అగమ్యము. నీయందలి కరుణ చేత నిన్ను వారించుచున్నాను 'నీకు స్వాగతము ఈయమృతోపమానములగు పండ్లను తిని తిరిగి పొమ్ము వ్యర్థముగా మృత్యువు నెదుర్కొనకుము, నాహితమును విని తిరిగి పొమ్ము". అప్పుడాయిరువుర కీవిధముగా సంవాదము జరిగెను :—

భీమసేనుడు :—"నేను చంద్రవంశమునందలి క్షత్రియుడను. వాయుపుత్రుడను. నా పేరు భీమసేనుడు నీవెవడవు? వానర రూపమును ధరించి యిట్లేల యున్నావు?

హనుమంతుడు:— (చిరునవ్వుతో) నేను వానరుడను. నీకు మార్గము నీయను. నీ యిష్టము వచ్చినట్లు పొమ్ము. లేదా తిరిగి పొమ్ము. లేకున్నచో నీ ప్రాణములు నిలువవు.

భీమ:— నా ప్రాణములు పోవచ్చుగాక. లేదా వేరుఅపాయములు కలుగుగాక. ఆవిషయము నిన్నడుగుట లేదు. త్వరగా లేచి నాకు త్రోవ యిమ్ము అట్లైనచో నా చేతిలో నీకు ఏలాటి కష్టము కలుగ కుండును

హను:— నాకు లేచుటకు సామర్థ్యము చాలకున్నది. వ్యాధిచే పీడితుడనై యున్నాను నీకు తప్పక యీ మార్గము ద్వారా పోవలసి యుండినచో ఎగిరి నన్ను దాటి పొమ్ము.

భీమ:— నిర్గుణుడగు పరమాత్ముడు ప్రాణుల శరీరములో వ్యాపించి యుండును. జ్ఞానముచేతనే తెలిసికొనదగిన అట్టి పరమాత్ముని అవమానింప జాలను. కనుక నిన్ను నేను దాటి పోను. అట్టి భగవంతుని శాస్త్రజన్య జ్ఞానము చేత కూడ నేను తెలిసి కొన జాలను. దాటి పోవలసి యుండినచో నీ వెంత? సముద్రమునైనను పర్వతముల నైనను హనుమంతుడు వలె నేను గూడ దాటి పోగలను.

హను:— సముద్రమును, పర్వతములను దాటి పోగలిగిన ఆ హనుమంతుడను వాడెవడు? చెప్పుము

భీమ:— హనుమంతునే యెరుగవా? అతడు రామాయణములో ప్రసిద్ధముగావర్ణింపబడినవాడు. శరీరబలము, బుద్ధిబలము విశేషముగా గలవాడు. విశేషించి నాకు సోదరుడగు వానరపుంగవుడు. సీతాదేవి కొరకతడు శతయోజనవిస్తీర్ణమగు సముద్రము నొక దుముకులో దాటెను. అన్నివిధములను అతనితో నేను సమానుడను. నిన్ను ఓడించగలను. కనుక లెమ్ము. నాకు త్రోవ నిమ్ము. నా యాజ్ఞను తిరస్కరించినచో నిన్ను నే నిపుడే యమ లోకమున కంపెదను.

హను :— (మనస్సులో నవ్వుకొని) నాయనా ! ప్రసన్నుడవగుము ముసలివాడను. లేవలేకున్నాను. నాపై దయయుంచి యీ నా తోకను ప్రక్కకు తొలగించుము. నీకు మార్గము దొరకును. పోవచ్చును.

ఆమాట విని భీమసేనుడు 'దుర్బలుడగు నీవానరుని ఒక్క ఊపుతో లేపి యమలోకమునకు పంపెదను'అనుకొని అవలీలగా ఎడమచేత తోకను లేపబోయెను. అతనికి సాధ్యము కాలేదు. తిరిగి రెండు బాహువులతో దానిని కదలించుటకు తన బలమంతయు వినియోగపరచి మహాప్రయత్నము చేసెను. కాని అతనికి వీలుకాక శరీరమంతయు చెమట పట్టగా అలసిపోయి సిగ్గుపడి భీమసేనుడు హనుమంతునకు నమస్కరించి ప్రక్కన నిలుచుకొని 'కపిరాజా! నా గర్వపు మాటలను క్షమించి ప్రసన్నుడవు కమ్ము. నీవు సిద్ధ-సాధ్య-గంధర్వాది దేవతలలో నెవడవు ? ఇట్లు వానరరూపమును ధరించి యున్నావు నిన్ను శరణు జొచ్చితిని నీ వృత్తాంతము రహస్యము కాకున్నచో నాకు తెలుపుము. శిష్యునివలె నిన్ను చేరి ప్రార్థించు చున్నాను.' అని వేడుకొనెను. ఆ మాటలు విని హనుమంతు డిట్లనెను :—

"వీరుడా ! నన్ను గూర్చి తెలిసికొనుటకు నీకు ఇచ్ఛ యున్నచో వినుము. నేను జగత్తునకే ప్రాణ స్వరూపుడగు వాయుదేవునకు కేసరీదేవియందు జన్మించిన హనుమంతుడను వానరుడను. సూర్యపుత్రుడగు సుగ్రీవుని, ఇంద్రపుత్రుడగు వాలిని వానరులందరు సేవించిరి. నేను మాత్రము సుగ్రీవునే సేవించితిని. మా యిరువురకు అగ్నికి వాయువునకు వలె అతి స్నేహముండెడు. సుగ్రీవుడు తన సోదరునిచేత పీడింపబడి నాతోపాటు ఋష్యమూక పర్వతమునందు చాలకాలము నివసించు చుండెను. 'రాముడు' అను పేరుతో మానుష రూపమును ధరించిన శ్రీ మహావిష్ణువు పితృవాక్యపరిపాలనార్థమై భార్యతో, సోదరునితో ధనుర్ధారియై దండకారణ్యమునందు సంచరించుచుండెను. అతని భార్యను దుష్టుడగు రావణాసురుడు అపహరించెను. భార్యను వెదకుచు రాముడు తమ్మునితో ఋష్యమూకమునకు సుగ్రీవుని కడకువచ్చెను. అ యిరువురకు మైత్రి కలిగెను. రాముడు వాలిని సంహరించి సుగ్రీవునకు వానరరాజ్య పట్టాభిషేకము చేసెను సుగ్రీవుడు సీతను వెదకుటకై వానరవీరులను నలుదిక్కులకు పంపెను. నేను వానరులతో దక్షిణ దిక్కునకు పోయి యేలాగైనను కార్యముసాధించవలెనను పట్టుదలతో నూరు యోజనముల వెడల్పుగల సముద్రమును దాటితిని. సీతను చూచి లంకాదహనముచేసి రామనామమును అచట స్థాపించి తిరిగి వచ్చితిని. రాముడు నామాటప్రకారము సముద్రముపై సేతువును బంధించి వానర సేనతో సముద్రమును దాటి లంకలో రాక్షసులను, రావణాసురుని సంహరించి, లంకారాజ్యము నందు, తనకు భక్తుడు, ధార్మికుడునగు విభీషణుని పట్టాభిషిక్తుని జేసి, అదృశ్య మైపోయినవేదశ్రుతిని తిరిగి తెచ్చినట్లు సీతను తెచ్చెను. తిరిగి అయోధ్యకు పోయి అచట సంతోషముతో పట్టాభిషేకము చేసికొని సుఖముగా నుండెను.

అప్పుడు నేను రామునకు నమస్కరించి యిట్లు ప్రార్థించితిని: "మహానుభావా! ఎంతకాలము శ్రీరామకథ యీ లోకమునందు ప్రచారములో నుండునో అంతకాలమువరకు గూడ నేను జీవించి యుండునట్లు వరమును ప్రసాదింపుము." ఆ నా ప్రార్థనకు శ్రీరాముడు 'తథాస్తు' అనెను సీతాదేవియనుగ్రహముచేత. నేను ఇక్కడ నున్నప్పటికిని నాయిష్టముప్రకారము సర్వసుఖములు నాకు లభించుచుండును పదకొండువేల సంవత్సరములు రాజ్యము నేలి శ్రీరామచంద్రుడు తిరిగి తనవైకుంఠ ధామమునకు పోయెను. నాయనా! ఇచట గంధర్వులు, అప్సరసలు రామచరితమును గానము చేయుచు నన్ను ఆనందపరచు చుందురు.

"కురునందనా! ఈమార్గము మానవులకు అగమ్యము కనుకనే నిన్నిచట అడ్డగించితిని. నీవీ మార్గమున పోయినచో నిన్నెవరైన తిరస్కరించి శపించెదరు. ఇది దేవతల మార్గము. దీనియందు మనుష్యులు పోవరు. కురుపుంగవా! నీవు ఏ కార్యమును సాధించుటకై బయలుదేరితివో ఆ సరోవర మిదియే." అని హనుమంతుడు చెప్పెను

హనుమంతునిమాటలు విని భీమసేనుడు తనయన్నయగు నతనికి నమస్కరించి 'మహాత్మా! నిన్ను చూడగలిగిన నాకంటె మరియొకడు ధన్యుడు లేడు నీ యనుగ్రహము నాపై కలిగెను. నేను చాల తృప్తి చెందియున్నాను. ఒక్క విషయము మాత్రము నిన్ను అడగదలచినాను అది యేమనగా, నీవు పూర్వము సముద్రమును దాటినప్పటి అప్రతిమాన మగు నీ రూపము నిప్పుడు చూడ గోరుచున్నాను. అట్టి నీరూపమును చూచుటచేత నేను సంతుష్టిని చెందుటమాత్రమే కాక నీవు హనుమంతుడవే యను విశ్వాసముగూడ నాకు కలుగును.' అని యనెను ఆ మాటలకు హనుమంతుడు నవ్వి, 'నాయనా! అప్పటి నారూపమును చూచుటకు నీకుగాని యితరులకుగాని యిప్పుడు సాధ్యముకాదు. అప్పటికాలము వేరు అవస్థవేరు అవియిప్పుడులేవు. అది కృతయుగ కాలము ఇది ద్వాపరయుగ కాలము. ఇది అన్నివస్తువులను నష్టపరచు కాలము. కనుక ఆ రూపమిప్పుడు నాకు రాదు. భూమి, నదులు, పర్వతములు, వృక్షములు, సిద్ధులు, మహర్షులు కాలానుసారముగా ప్రతి యుగమునందు పరివర్తనము చెందుచుందురు. అన్ని వస్తువుల శరీరములు, బలములు, ప్రభావములు యుగానుసారముగా పెరుగుచు తరుగుచు నుండును. కనుక నాయనా! అప్పటి నారూపమును ఇప్పుడు చూడ గోరకుము. ఈ ద్వాపర యుగమును అనుసరించియే యిప్పుడు నేను మెలగెదను. ఎందుకనగా, అన్నిటికన్నను కాలము 'దురతిక్రమము' గదా! దాని నెవడును అతిక్రమించజాలడు.

ఆ మాటలు విని భీమసేనుడు, 'మహానుభావా! నాకు యుగముల సంఖ్యను, ఏయే యుగమునందు ఏ యేధర్మములు, ఆధారములు అర్థకామముల తత్త్వము, శుభాశుభకర్మలు, వాటి శక్తి, ఉత్పత్తి–వినాశములు ఉండునో వాటిని దయచేసి వివరించి చెప్పుము'. అని యడిగెను. ఆ మాటకు హనుమంతు డిట్లు చెప్ప దొడగెను:—

యుగ ధర్మములు

"నాయనా! అన్నిటికన్న మొదటిది కృతయుగము. దానియందు సనాతనధర్మము సంపూర్ణముగా ప్రతిష్ఠితమై యుండును. దానియందలిమానవులకు కర్తవ్యములగు కర్మ లేవియు మిగిలి యుండవు. అన్ని శుభకర్మలు చేసియే యా యుగమునందు నివసించు చుందురు. అందుచేతనే 'కృతం ఏవ సర్వం శుభం యస్మిన్ యుగే' అను వ్యుత్పత్తిచేత ఆ యుగమునకు 'కృత యుగము' అనుసార్థకనామ మేర్పడినది. ఆ యుగమునందు ధర్మములు నశించవు. తలిదండ్రుల యెదుట సంతానము మరణించదు. ఆ యుగమునందు దేవదానవాదులు లేకుండిరి. అనగా వారికి పరస్పరభేదభావము లేకుండె నని భావము. అప్పుడు క్రయవిక్రయ వ్యవహారములు లేకుండెను. వేదములకు ఋగ్యజుస్సామములు అనుభేదము లేకుండెను కృష్యాది మానవ కర్మలు లేకుండెను. అప్పటి వారికి తలచినంత మాత్రమున సకల ఫలములు చేకూరుచుండెను. అప్పుడు స్వార్థత్యాగము' అను ధర్మ మొక్కటే ఆచరించబడుచుండెను. రోగములు, ఇంద్రియ దుర్బలత్వము, అసూయ, దుఃఖములు, గర్వము, దర్పము, ఇతర వికారములు మానవులకు లేకుండెను. పరస్పర ద్వేషములు, జగడములు; సోమరితనము: లోభము; భయసంతాపములు; ఈర్ష్యా మాత్సర్యములు కృతయుగమునందు లేకుండెను. యోగిజనములకు ఆశ్రయుడై సర్వభూతాంతరాత్ముడై వెలసిన శ్రీమన్నారాయణ మూర్తి ఆ యుగమునందు శుక్లవర్ణముగలవాడై యుండెను. వర్ణాశ్రమ ధర్మములు సక్రమముగా నిర్వర్తింపబడుచుండెను. ఆ సమయమునందు అందరికి పరబ్రహ్మ ఒక్కడే ఆశ్రయుడై యుండెను. అతనిని పొందుటకే మానవులు సదాచారమును పాటించుచుండిరి. ఆ పరబ్రహ్మ జ్ఞానమునే అందరు కాంక్షించుచుండిరి. అతనిని ఉద్దేశించియే అందరును సత్కర్మాచరణము చేయుచుండిరి అందువలన వారికి ఉత్తమ ధర్మఫలము ప్రాప్తించుచుండెను: అప్పటివారికి ఒకడే దేవుడు: ఒక దేవునే స్మరించుచు సేవించుచు పూజించు చుండిరి: వివిధ వర్ణాశ్రమాచారపరులైనప్పటికిని మానవులందరు ఒక్క వేదధర్మమును మాత్రమే అంగీకరించుచు సనాతన ధర్మము ననుసరించుచుండిరి: ఆ సత్యయుగమునందలివారు 'బ్రహ్మచర్య–గృహస్థ– వానప్రస్థ–సన్న్యాసములు' అనెడు నాలుగు ఆశ్రమముల ధర్మములు ఆయా సమయములలో ననుష్ఠించుచుండి కూడ కర్మఫలమును కోరకుండిరి కనుక అన్ని యాశ్రమముల వారికిని మోక్షము సిద్ధించుచుండెను? చిత్తవృత్తులను పరమాత్మయందు నిలిపి అతనిలో నైక్యమునుకలిగించు 'యోగము' అను ధర్మము సత్యయుగ సూచకము: ఆ యుగమునందు సనాతన ధర్మము సంపూర్ణముగా నాల్గుపాదములతో స్థిరముగా నిలిచి యుండెను:

ఇక త్రేతాయుగమును గూర్చి వినుము:— 'త్రేతాయుగమునందు ధర్మములో నొక పాదము లోపించియుండును. శ్రీమన్నారాయణుడు రక్తవర్ణముగలవాడై యుండును. ప్రజలు సత్యవంతులు. శాస్త్రోక్త కర్మాచరణమునందు ఆసక్తిగలవారై యుందురు.

ఈ త్రేతాయుగమునందే, ధర్మములు వివిధ సత్కర్మములు ఆరంభమగును. ప్రజలు వేదోక్త కర్మాచరణముద్వారా, దానాదుల ద్వారా తమ తమ యిష్టార్థములను బడయుచుందురును ఈ సందు మానవులు స్వధర్మమును వీడకయుందురు.

ఇక ద్వాపరయుగమును గూర్చి వినుము:—'ద్వాపరయుగమునందు ధర్మము రెండు పాదములే యుండును. శ్రీమన్నారాయణుడు పసుపువర్ణము గలవాడుగా నుండును వేదము 'ఋక్ యజుస్, సామ, అథర్వ' భేదములచే నాలుగు విధములుగా నుండును. ద్వాపరయుగమునందు కొందరు నాల్గు వేదములను; కొందరు మూటిని; మరి కొందరు రెంటిని; ఇతరులు ఒక్క వేదమునుమాత్రమే తెలిసియుందురు కొందరు ఒక్క వేద మంత్రమునుగూడ నేర్వనివారుగా నుందురు ప్రజలు రాజసవృత్తి గలవారై తపస్సు-దానము మొదలగు కర్మలను , చేయుచుందురు ఈయుగమునందు ఒక్క వేదమును నేర్చినవాడుగూడ లేకపోవుటచేత ఆ వేదమునకు అనేక భాగములేర్పడినవి. సాత్విక బుద్ధిగూడ క్షీణించియుండుటచేత ఎవరో ఒకరిద్దరు మాత్రమే సత్యవంతులుగా ద్వాపరయుగమునందు విరళముగా కనబడుచుందురు సత్యదూరులగుటచేత వారికి అనేక వ్యాధులు మూడును. వారికి పెక్కు కోరికలు కలుగుచుండును ఆధిదైవికములగు అనేక ఉపద్రవములు కలుగుచుండును వాటిచేత పీడితులై ప్రజలు తపస్సులు చేయుచు, కొందరు స్వర్గసుఖమును కోరి యజ్ఞకర్మానుష్ఠానమును చేయుచుందురు. ఈ విధముగా ద్వాపరయుగమునందు ప్రజలు అధర్మముచేత క్షీణించుచుందురు.

ఇక కలియుగమును గూర్చి వినుము:— 'భీమసేనా ! కలియుగమునందు ధర్మము ఒక్క పాదమునందే నిలిచియుండును. తమోగుణ భూయిష్ఠమగు కలియుగమునందు శ్రీమన్నారాయణుడు కృష్ణవర్ణము గలవాడుగా నుండును వేదాచారములు, ధర్మములు, యజ్ఞకర్మములు అన్నియు నశించును. ఈతిబాధలు, వ్యాధులు, సోమరితనము, క్రోధము మొదలగు దోషములు, మానసిక రోగములు, ఆకలిదప్పులవలన భయము, ఈ మొదలగు నుపద్రవములన్నియు కలియుగమునందు పెరుగును. ఈ యుగమునందు మానవులకు ధర్మక్షయము వలన సుఖక్షయముగూడ కలుగును. దానివలన ప్రజాక్షయము, దానిచేత లోకులను నడపు సద్భావము గూడ క్షీణించును. ఇట్లు అనేక నాశములచేత మానవుల కోరికలు ఎప్పుడుగూడ కలియుగమునందు సిద్ధించవు. విపరీత ఫలము నిచ్చుచుండును' కనుక నాయనా ! ఇట్టి కలియుగము అచిర కాలములోనే రానున్నది. చిరంజీవులు మాత్రమే ఆ యుగమును అనుసరించియుందురు

కనుక నాయనా ! నా పూర్వశరీరమును నీవు ఇప్పుడు చూడగోరుట సరికాదు. నీవు తెలివిగలవాడవు గనుక ఇట్టి వ్యర్థ విషయములకై పట్టుపట్టకుము. ఇప్పుడు యుగధర్మములన్నియు వింటివి. నీకు మేలు కలుగుగాక. ఇక నీవు తిరిగిపొమ్ము.

ఇంత చెప్పినను భీమసేనుడు హనుమంతుని పూర్వరూపమును చూడకుండ తిరిగి పోవుటకు ఇష్టపడకుండెను. అప్పుడు హనుమంతుడు అనుగ్రహించి నవ్వుచు సముద్రమును దాటినప్పటి తన పూర్వశరీరమును అతనికి చూపెను ఎత్తైన పర్వతమువలె భయంకరముగానున్న హనుమంతుని రూపమునుచూచి భీమసేనుడు మిక్కిలి ఆశ్చర్యమును, హర్షమును అనుభవించెను. అప్పుడు హనుమంతుడు "నాయనా ! నీవు నా విశ్వరూపమును ఇంత మాత్రమే చూడగలుగుదువు ఇంతకన్న ఎన్నియోరెట్లు ఎక్కువగా నా శరీరమును నా యిష్టము వచ్చినంత పెంచగలుగుదును. దానిని చూచుట నీకు సాధ్యము కాదు అది శత్రువులకు అత్యంత భయంకరము. "అని చెప్పెను. ఆ యద్భుతమైన వింధ్యపర్వతమువంటి మహాకాయమును చూచి భీమసేనుడిట్లనెను:—

" మహాత్మా ! మిక్కిలి విశాలమైన నీ శరీరమును చూచితిని. ఇంక దీనిని ఉపసంహరించుకొనుము ప్రచండమగు సూర్య ప్రభవలె వెలుగుచున్న యీ శరీరమును నేను చూడజాలకున్నాను. నీవింతటి తేజశ్శాలివి గనుకనే శ్రీరామచంద్రుడు నిన్ను ప్రక్కనబెట్టుకొని రావణాదులను సంహరించగలిగెను. నీకు అసాధ్యమేదియు లేదు. నీ శక్తికి ఒక్క రావణుడేమి ? ఎందరు రావణులైనను చాలరు " ఆ మాటలువిని హనుమంతుడిట్లనెను:—

" నాయనా ! నీవన్నమాట సత్యము నా బలమునకు ఆ రావణుడెంత? నేనే అతనిని చంపినచో రాఘవునకు కీర్తి రాదని మానుకొంటిని. కనుక రాముడే అతనిని సంహరించి సీతను తెచ్చి రాజులలో తనకీర్తిని నిలబెట్టుకొనెను. కనుక తండ్రీ! నీ సోదరుల హితమునుకోరి నీవు తిరిగిపొమ్ము. నిన్ను సర్వదా వాయుదేవుడు రక్షించుగాక ! ఇదుగో ఇదియే 'సౌగంధిక' పుష్ప వనమునకు మార్గము. యక్ష రాక్షసుల చేత రక్షింపబడుచున్న కుబేరుని ఉద్యానవనమును చూడగలవు. అచట నీవు తొందరపడి పువ్వులను కోయకుము. అక్కడ దేవతలుందురు. వారుపూజ్యులు గనుక వారిని పూజించి వారియనుగ్రహమును సంపాదించి పువ్వులను గ్రహించుము.

స్వధర్మ పాలనముచేయుచు ఉత్కృష్ట ధర్మసాధనకై ప్రయత్నించుము స్వధర్మమును పాలించనివారు, వృద్ధులను సేవించనివారు బృహస్పతి యంతవారైనను ధర్మార్థములను గూర్చి తెలిసికొన జాలరు. అజ్ఞానులు ధర్మమును అధర్మముగాను, అధర్మమును ధర్మము గాను తలచుచుందురు. నీవు జ్ఞానివి గనుక ఆ రెంటి వివేకమును తెలిసి సంచరించుము. సదాచారము వలన ధర్మము కలుగును. ధర్మమునందు వేదములు నిలిచియుండును. వేదములనుండి యజ్ఞములు ఉత్పన్నములైనవి. యజ్ఞములచేత దేవతలు నిలిచియున్నారు వేదోక్త యజ్ఞాచరముచేతనే దేవతలు జీవించుచున్నారు. 'బృహస్పతి—శుక్రాచార్యులు' ఈ యిరువురు చెప్పిన నీతిని అనుసరించి మానవుల జీవనము నిర్వహింపబడుచున్నది.

వాణిజ్యము, పన్నులు తీసికొనుట, కృషికర్మ, గోపాలనము, మేకలు మొదలగు పశువుల పోషణము, విద్య నేర్పుట, నేర్పించుట–ఈ మొదలగు కార్యములను ధర్మానుకూలముగా చేయుచున్న ద్విజులు ప్రపంచ రక్షణముచేయగలరు. విజ్ఞులైన బ్రాహ్మణులు మూడు వేదములను, క్షత్రియులు దండనీతిని, వైశ్యులు కృషి–వాణిజ్యములను సరియైన మార్గములో నడపినప్పుడే లోకయాత్రసాగును. అది ధర్మ మార్గములో నడపని యెడల జగత్తు అడ్డులేక స్వేచ్ఛగా సంచరించి నాశమునకు దారితీయును. సక్రమముగా మూడు వృత్తులు నడపబడినచో ప్రజలు ధర్మ సంపాదనచేయుచు సుఖముగా నివసించుచుందురు. సత్యము పలుకుట, సత్యముగా వ్యవహరించుట, సద్భావముతో నుండుట ఇది ద్విజులకు ముఖ్య ధర్మము. వారికి సాధారణ ధర్మములు యజ్ఞములు, వేదాధ్యయనము, దానములు చేయుట యగును. ద్విజులలో బ్రాహ్మణులకు యజ్ఞములు చేయించుట, వేదశాస్త్రములను నేర్పుట, దానమును తీసికొనుట ధర్మముగాను,క్షత్రియుల ధర్మము ప్రజాపాలనము. వైశ్యులధర్మము ప్రజా పోషణము అయియున్నవి. ద్విజులుచేయు పై మూడు ధర్మముల నిర్వహణములో వారిని అనుసరించుచు, సహకరించుచు, సేవించుచు నుండుట శూద్రుల ధర్మము వారు బిచ్చమెత్తుట, యజ్ఞములు, వ్రతములు చేయకూడదు. కనుక భీమసేనా ! నీవు క్షత్రియ ధర్మమును అవలంబించి ప్రజారక్షణము చేయవలెను కనుక ఇంద్రియనిగ్రహముతో స్వధర్మమును అనుష్ఠించుము. పెద్దలతో, సత్పురుషులతో ఆలోచనలు సలిపి దండనీతి ప్రకారము స్వధర్మమును ఆచరించుము. అదివీడినపుడు పరిభవమును చెందెదవు క్షత్రియుడు నిగ్రహానుగ్రహసమర్థుడైనప్పుడే లోకులు కట్టుబడియుందురు. కనుక రాజ్యపాలకుడు శత్రువుల దేశములో, దుర్గములోను గల శత్రు మిత్రబలములను గూఢచారులద్వారా తెలిసికొనుచుండవలెను. శత్రువుల వృద్ధిక్షయములను కనిపెట్టుచుండవలెను. రాజ్యపాలకుల కార్యసిద్ధికి, సామ–దాన–భేద–దండ, ములు అను నాల్గు ఉపాయములు, గూఢచారులు, మంచిబుద్ధుని సురక్షితమగు మంత్రాలోచనము, పరాక్రమ ప్రదర్శనము, శత్రు నిగ్రహము, మిత్రానుగ్రహము, చాతుర్యము ఇవన్నియు సాధనములగును. 'సామము-దానము భేదము దండము ఉపేక్ష' అను ఉపాయములలో నొకటి రెండుగాని, అన్నిగాని ప్రయోగించి పాలకులు శత్రువులను అణచి కార్యములను సాధించవలెను. భీమసేనా అన్ని నీతులు, గూఢచారుల మూలాధారములు ఆలోచనలను గుప్తముగానుంచుటవలననే సిద్ధించును. అట్టి ఆలోచనల ద్వారా కార్య సిద్ధినిపొందుటకు ఉపాయములను ద్విజులతో రహస్యముగా ఆలోచనలను సాగించి తెలిసికొనవలెను, 'స్త్రీలు మూర్ఖులు, బాలకులు, లోభులు, నీచులు, ఉన్మాదలక్షణములు గలవారు, ఇట్టివారితో నెప్పుడుగూడ రహస్యాలోచనలు చేయగూడదు. విద్వాంసులతోనే రహస్యాలోచనము చేయవలెను. పనులను సాధించగల శక్తిమంతులతోనే కార్యము చేయించవలెను. మిత్రులతోనే నీతి ప్రయోగమునకు సంబంధించిన పనులుచేయవలెను. మూర్ఖులతో ఏకార్యముగూడ చేయించగూడదు. రాజ్యపాలకులు ధర్మాలను ధర్మ కార్యములందును, అర్థశాస్త్ర పండితులను ఆర్థిక కార్యములందును స్త్రీల సంరక్షణ కొరకు నపుంసకులను, క్రూరులను క్రూర కార్యము లందును నియోగించవలెను. అనేక కార్యములను ఆరంభించునప్పుడు ఆ పని చేయదగినదా, కాదా యని స్వపక్షము వారితోను, శత్రు పక్షమువారితోను ఆలోచనలు జరుపవలెను. దానితో పాటు శత్రువు యొక్క బలాబలములను తెలిసి కొనుటకుగూడ ప్రయత్నించవలెను. తనను శరణుజొచ్చిన వారిని తన బుద్ధితోబాగుగా పరిశీలించి వారిలో సజ్జనుల పైన అనుగ్రహమును, దుర్జనులపైన నిగ్రహమును చూపవలెను. నిగ్రహానుగ్రహ సమర్థుడగు పాలకుని రాజ్యములో ప్రజలు కట్టుబాటుతో అణగిమణగియుందురు. దేశములో శాంతి భద్రతలు సురక్షితములై యుండును. కుంతీ నందనా ! నేను నీకు అత్యంత కఠినమైన రాజ్య ధర్మములను ఉపదేశించితిని. ఈ ధర్మము యొక్క మర్మమును తెలిసికొనుట అతి కష్టము కనుక నీవు నీక్షత్రియ ధర్మమును మాత్రము వినయశీలుడవై యనుసరించుము. బ్రాహ్మణులు తపస్సుచేతను, స్వధర్మానుష్ఠానముచేతను, ఇంద్రియ నిగ్రహముచేతను, యజ్ఞములుచేయుట చేతను ఏ విధముగా ఉత్తమ లోకములను చెందెదరో వైశ్యులు దానము ఆతిథ్యము మొదలగు ధర్మములను ఆచరించుటవలన ఎట్టి ఉత్తమ లోకములను పొందెదరో ఆవిధముగానే క్షత్రియులు నిగ్రహానుగ్రహ సమర్థులై రాజ్యపాలనముచేత ఉత్తమ స్వర్గలోకమునకు పోయెదరు. దండనీతి నియోగ్యముగా ప్రయోగించి, రాగద్వేషరహితులై క్రోధ లోభములకు దూరులై రాజ్యపాలనము చేయుక్షత్రియులు సత్పురుషులు పొందదగిన లోకమునకుపోయెదరు.''

[సశేషము]

రవీంద్రుని సంగీతము

— పోకూరి శ్రీరాములు

సంగీత స్ఫురణ స్వతఃజన్యమైనా అనుభూతి నాధారంగా దానిని స్థూలంగా రెండు వర్గాలుగా విభజించవచ్చు. శాస్త్రీయము అని, అశాస్త్రీయము లేక జానపదము అని శాస్త్రీయ సంగీతము స్వయంభూత మైనా, సుకృత ఫలమైనా దానికి ప్రయత్నం, సాధన కొంత వరకు అవసరమై యున్నవి. ముందు ఉద్భవించింది సంగీతమా లేక సంగీత శాస్త్రమా అన్న మీమాంస వచ్చినపుడు సారస్వత రంగంలో లక్ష్యగ్రంథాల తదుపరి లక్షణ గ్రంథాలు పుట్టినట్లు సంగీతం ఉద్భవించినతర్వాత శాస్త్రం ఉద్భవించినదని చెప్పడం తప్పదేమో. శాస్త్రీయ సంగీతానికి సంస్కారంతోబాటు సాధనగూడ కావాలి ఇక జానపద సంగీతమో–అది అప్రయత్నంగా నోటినుండి జాలువారే సెలయేరులాంటిది. నిరాఘాటంగా నిష్కంటకంగా కొండలు కోనలు దాటి, ఎత్తు పల్లాల్ని సమంగా తడిపి, వనాల్ని తాకి, త్రొక్కిన గట్లన్నిటినీ మధుర స్వనలహరితో ప్లావితంచేసి మనోహరంగానూ, జడిత గమనంతోనూ కమనీయమైన తేటతో పారెడు సరితా స్నేహితునికి సమర్పణ చేసుకొనే నిర్ఝరములాంటిది. రెండింటిలో ఏది అత్యుత్తమమైంది అన్న ప్రశ్నవస్తే పండితునికి శాస్త్రీయము, పామరునికి జానపదము అనుభవేకవైద్యములని చెప్పాలి. సంగీత జన్య ఆనందాన్ని ఇద్దరూ వారివారి అనుపాతంలో పంచుకుంటారు. అంటే శాస్త్రీయము విద్వత్ సమాజంవారి గుత్త అనీ, జానపదులకు అభేద్యమనీ దీని తాత్పర్యం కారాదు. శాస్త్రీయసంగీతాన్ని పండితుడు లోతులు గ్రహించి ఆనందిస్తే పామరుడు దానిలోతులు, గతులు తెలియక పోయినా విశుద్ధ మాధుర్యంతో పులకాయమానసుడౌతాడు. ఐతే ఇద్దరి అనుభూతి పొందే పద్ధతులు భిన్నంగా వుండవచ్చు. పండితుడు సంస్కారస్థాయీ భావాల ప్రసరణచే ఆనందిస్తూ సంగీత లక్షణసారాన్ని జీర్ణించుకున్న కారణంగా పామరునికన్న మిన్నగా తన్మయత్వం పొందవచ్చు. పామరుడేమో కేవలం రాగమాధుర్యాన్ని, సంగీతనాద సౌందర్యాన్ని అనుభవించి మూగవాడు మధువు గ్రోలి దాని రుచి చెప్పజాలనట్లు డోలాయమానసుడౌతాడు.

ఈ సందర్భంలో కొందరు శాస్త్రీయ సంగీతం ఆదిజన్యమా లేక పాటక సంగీతమా అని ప్రశ్నిస్తూ ఉండడం సహజం. జానపద సంగీతమే ఆదిజన్యమనడం సమంజసమేమో ఉదాహరణకు కావ్యాన్ని తీసుకుందాము. పల్లె పదాలు పుట్టి ప్రచారమై జనబాహుళ్యంలోకి వచ్చాయి తదుపరి వానికి సొబగులు కూర్చి, నుడికారాలకు నగిషీ జోడించిన తర్వాత అవి వాసన సజ్జకలుగా మారి గీతాలైనవి. పైరు చేలలో పిల్లగాలికి పెరిగి పెద్దదైన పల్లెపడుచు పట్నవాసం చేరి, నాగరికత నేర్చి, మేను రేఖలు తీర్చి హొయలు చూపిస్తుంది. సహజ సౌందర్య సుమానికి తావి జోడించినట్లు సువాసనలో అడవిమల్లెకు సన్నజాజికి ఎంత అంతరముందో అంతే వుంది శాస్త్రీయ సంగీతానికి జానపద సంగీతానికి. రెండూ ఆనంద దాయకములే, రెండూ ఆహ్లాదకరములే. ఒకటి అరమరికలు లేకుండ అందరి నాకట్టుకుని ఆకర్షిస్తే మరొకటి సార్వభౌమత్వంతో హృదయాన్ని రంజింప చేస్తుంది.

విశ్వకవి రవీంద్రుడు, గేయాలుగ వ్యవహరింపబడే సుమారు నాలుగువేల పదాల్ని రచించాడు. వాటి ఛందస్సు స్వతఃసిద్ధంగా సంగీతంతో మేళవింపచేసుకుని శాస్త్రీయము, జానపదము రెంటిని ఆకళించుకుని శోభిస్తున్నది. ఇదే అతని సంగీతంలోని ప్రత్యేకత. కావ్యం ద్వారా రెండు సంగీతవాహినులకు కళాకారుడు అమూర్త భావాలు సాకర్యాన్ని పొందే విధంగా సామాన్య ధరాతలాన్ని ప్రతిష్ఠించాడు. చైతన్యంలో గల కల్పనను ప్రేరేపించి వ్యంజనాకృతికి గల సమృద్ధశక్తి ద్వారా అతని గీతాలు రూపకల్పన, గతిని సఫలంగాను చక్కగానూ చిత్రించగల్గినాయి.

వంగభాష నాద సంపత్తికి పుట్టినిల్లు. అందుచేత వంగ సాహిత్యమే ఒక రకమైన సంగీతమేమో! 18, 19 శతాబ్దాలలో వంగపదాలు, కీర్తనలు శాస్త్రీయ సంగీతంలోని మెరుగుల్ని వరించినాయి. కాని ఠాగూరు రచించిన ఛందస్సు అందుకు భిన్నంగా విశిష్ట మార్గాన్ని త్రొక్కి వాగ్గేయకారులకు చెప్పనలవి కాని ఆనందానుభూతిగా మారింది.

రవీంద్రునికి సంగీత జ్ఞానమపారం. ఆయన గళంలో పరిణతిపొందిన గాయకుని మాధుర్యముండేది. గేయాల్నిపాడే వేళ ఒక వైపు కవి హృదయమూ, మరొకవైపు సంగీత

కారుని ఆత్మ రెంటిని ఆవాహనచేసి చక్రవర్తిలా భాసించేవారు. రవీంద్రుని గేయాల్ని విభిన్నలయలు జోడించి పాడవచ్చు. కాని మానసకుహరంలో మసలే సౌందర్యలాలస, అత్యంత వుత్కృష్ట నైతికస్థాయి కల్గినట్టి గాయకుడు కావాలి ఆలాపన చేయడానికి. ముక్తసరిగా చెప్పాలంటే రవీంద్రుని సంగీతం స్వేచ్ఛా లహరివలె ఎంత సరళమో దానిని ప్రవేశపెట్టుట అంత సంక్లిష్టము.

చేవ తేలిన చిత్రలేఖనము, గుండెలనూపగల్గిన గాయకత్వము, పరమోన్నత్వాన్ని పొందిన కవనము ఈ మూడు రవీంద్రునిలో మూర్తీభవించి కళాత్మక సౌందర్య సామ్రాజ్యానికి అతనిని చక్రవర్తిగా చేసాయి. అన్య కళలకన్న సంగీతంపై వారికి శ్రద్ధ మెండు. వారి వుద్దేశ్యాలు వున్నతములు. భువనలోకాన భగవానుని సాక్షాత్కరింపజేయుటకు సంగీతాన్ని ఉపాసనా పుష్పంగా భావించాడు రవీంద్ర కవీంద్రుడు. ప్రకృతి సాహచర్యం అతనికెల్ల వేళలయందు కరతలామలకము. ఆ సుందర మూర్తి ఒడిలో అతడు కీర్తించిన గీతాలు విశ్వసాహితీ ప్రపంచానికి వెలుగు కంబాలు. ఒకవైపు సూర్యుడు సంధ్యారాగంలో అస్తమిస్తూ, మరొకవైపు ఆకాశతారకలు ఆలోకప్రభలను చిందుతూ వుంటే, ఒడ్డున కూర్చున్న రవీంద్రుడు ఏ చిరంతన సత్యాన్ని అన్వేషిస్తూ మైమరచేవాడో ఎవరు చెప్పగలరు? ఈ ఆత్మ విస్మృతియే శబ్దాలకు స్వరాల్ని సంధించి ఛందస్సనే సూత్రంలో గ్రుచ్చి, పచ్చల హారాన్ని అందించేది. ప్రతి కవీ వ్రాసిన గీతాన్ని పాడుటకు వీలు లేనట్లే ప్రతి గాయకుని సంగీతం శబ్దాలుఅనే వేషం ధరించుటకు యోగ్యం కానేరదు. కలం పట్టి కావ్యం వ్రాసే కవి ఎవరైతే పాడుతాడో, గళాన్ని సవరించి పాడే గాయకుడు ఎవరైతే కావ్యాత్మకు సన్నిహితంగా వుంటాడో అతనినే కళా కన్య వరిస్తుంది. తన స్వీయానుభవాల్ని రవీంద్రుడు ఇలా వర్ణించాడు. 'పాటలో శబ్దాలున్నపుడు ఆ శబ్దాలు పాట హద్దును మీరుట అనుచితం. కారణం అక్కడ అవి గాన వాహనాలు మాత్రమే కావడం కనుక. గానము తన సంపత్తివల్లనే గొప్పది. వాక్యానికి అదెందుకు ఊడిగం చేయాలి? వాక్యం ముగియగానే గానం ప్రారంభమౌతుంది. ఆ గానాన్ని వాక్యం వ్యక్తీకరించజాలదు. ఆ పని గానంవల్లనే సాధ్యం అవుతుంది, అది అనిర్వచనీయమైనది.

నేను ఎప్పుడైనా కూనిరాగంతీస్తూ ఒక పంక్తి వ్రాసినపుడు, స్వరం వాక్యాన్ని తీసుకెళ్ళగలిగినమేరకు వాక్యం చేర నసమర్ధుడిగా వుండడం గ్రహించాను. ఏ గొప్ప విషయాన్ని వినడానికి మనస్సు ఆరాటపడుతుందో అది వనరాజు శ్యామలత్వంలో కలిసినట్లున్నా, పున్నమ రాతిరి నిస్తబ్ధ శుభ్రితలో మునిగినట్లున్నా, దిశాంతిరేడు వినీలాభ్రమున అవగుంఠితమైనట్లున్నా అనిపిస్తుంది నాకు. ఇది యావత్ చరాచర స్థావర జంగమాల నిగూఢ రహస్యమేమో!

చిన్ననాటినుండి మనస్సులో సింహాసనము ప్రతిష్ఠించుకున్న 'తొమాయి విదేశినీ సాజియేకెదిలే' అన్న పదం ఏవిధంగా ఠాగూరును మంత్రముగ్ధుణ్ణి చేసిందంటే అతడొక రోజున నత రెండవ గీతంలోని ప్రథమ పంక్తిని 'ఆమిచిని గోచిని తోమారే ఆగో విదేశినీ' అని వ్రాయక తప్పలేదు. ఈ గీతానికి స్వర సంవిధానం లేనిచో దాని పరస్థితి ఊహించనంతగా దిగజారేది. స్వరమాధుర్యము నా హృదిలో విదేశినీ మనోజ్ఞ రూపాన్ని సాక్షాత్కరింపజేసినది. ఈ బ్రహ్మాండములో విశ్వమోహినిగా అలరారే విదేశినీ దవ్వులకు స్వరం నన్ను అనాయాసంగా తోడి తెచ్చింది. ఈ నాటికీ ఎప్పుడేనా భోల్‌పూర్ దారిన ఏ 'బాఉల్' పాడుతూ వెళ్ళినా నా భావపంజరంలోని చిలుక పలుకుతూన్నట్లుగా వుంటుంది. మనస్సు ఆ ప్రభావాన్ని చిరస్థాయిగా గ్రహించాలని ప్రయత్నిస్తుంది. కాని ఆ అశక్త అపరిచిత విపంచికా గమనాన్ని స్వరం మినహా ఎవరు నాకు చెప్పగలరు? అందుచేతనే పాటలపొత్తమంటే నాకు వల్లమాలిన సందేహం.'' సంగీతాన్ని సన్యసించి సాధనాల్ని స్వీకరించడం విఘ్నేశ్వరుని విసర్జించి వాహనాన్ని పట్టుకువ్రేలాడటమే అని ఠాగూరు అభిభాషించాడు.

రవీంద్రుని గీతాల్లో సునాయాసంగా బోధగమ్యంకాని ఒక విశేషముంది. వాటిని ఆకళించుకొనుటకు ఎక్కువ సహృదయత, సాధన ఎంతేని అసరం. వాటిని సిద్ధింపజేసుకొన్నవాడే రవీంద్రుని హృదయ సామ్రాజ్యంలో విహరించగలడు. శిల్పి, గాయకుడు, కవి—ఈ మూడు వ్యక్తిత్వాలు అతనిలో పూర్తిగా మూర్తీభవించుటచే అతని రచనల్లో ప్రాపంచిక రాగద్వేషాల్ని కడిగి ఇహపరాలు రెంటిని ఆలోకమయంచేసే విశిష్టత వుంది. కళాజన్యానందముద్వారా సత్యాన్వేషణ రవీంద్రుని సంగీతానికి ఆయువుపట్టు: కాన వంగ దేశంలో రవీంద్రుని సంగీతచ్ఛాయల్ని అనుసరిస్తూ నేటికీ ఎందరో విద్వాంసులున్నారు. సంగీతం, సాహిత్యం, సౌందర్యం, సత్యం—ఈ నాల్గింటిని తగు పాళ్లలో మేళవించిన కారణంచేత రవీంద్రుని సంగీతం సంస్కృతికీ, కళాజగత్తుకూ అధిక సుసంపన్న రూపంగా శోభించుచున్నది.

అయితే రవీంద్రుని సంగీతం భారతీయ సంగీత శాస్త్రానికి ఎంతవరకు అనుగుణంగా వున్నది అని కొందరు ప్రశ్నిస్తారు. అట్టి కుతూహలం కలగడంకూడా సహజమే. రవీంద్రుని సంగీతం ఓ మహా సాగరమైతే భారత దేశంలో సర్వ ప్రాంతాల సంగీతాన్ని సాగర వీచికలతో పోల్చవచ్చు. భావాల్ని భాష వహిస్తుంది. భాషను పీఠికగా ఎంచి సంగీతం ప్రకాశిస్తుంది. శాస్త్రీయ సంగీతంలో రాగాలకున్న ప్రాధాన్యము భాషకు లేదు. రెండు మూడు చరణాల్ని ఆధారంగా చేసుకుని గాయకుడు గంటలకొలది సంగతుల్ని అమర్చి మూర్ఛన గమకాల్ని చూపించగలడు. కాని రవీంద్రుని సంగీతం అట్టిదికాదు. అందు మూడు గుణాలు విశిష్టంగా వున్నాయి. అవి—భావం, భాష, సంగీతం. భావానురూపంగా భాషను, భాషకు తద్రూపమైన రాగానికి ఎంత ప్రాధాన్యముందో అంతే ప్రాధాన్యం కావ్యానికీ వున్నదన మాట అతని సంగీత మార్దవాన్ని గ్రోలాలంటే అతని కావ్యభాషతో మంచి పరిచయం ఉండడం సంగీత సహృదయునికి అవసరం.

ఏవో కొన్ని గీతాలను మినహాయించి రవీంద్రుడు ప్రతి గీతానికి ఫలానా రాగతాళం అని నిర్ణయించలేదు ఉటంకించిన గీతాల్లో కొన్నింటికి మూడు నాలుగు రాగాల్ని మిశ్రితంచేసి నవ్య స్వరాన్ని సృష్టించాడు. ఇది రవీంద్రుని మౌలికత్వానికి మచ్చు తునక. ఉదాహరకు 'ఓరే ఆమ్‌రే......' అతానా — బహార్, మిశ్ర; 'అయి భువన మనోమోహినీ...' భైరవి, భైరవి మిశ్ర; 'ప్రఖర్ పతన్‌తాపే......' భీమ్‌పలాసీ, ముల్తానీ, భైరవి మిశ్రల్లోను ఆలాపించవచ్చు.

విషయ ప్రధానంగా రవీంద్రుని సంగీతాన్ని అనేక భాగాలుగ విభజించవచ్చు. వానిలో పూజ, ప్రేమ, స్వదేశము, ప్రకృతి, విచిత్రము ప్రముఖంగా పేర్కొనవచ్చు. సాధారణంగా చాల మంది విశ్వకవి రవీంద్రుని ప్రకృతి కవిగా భావిస్తుంటారు. అందులో ప్రధానంగా ఆయన రచించిన వర్షఋతువుకు సంబంధించిన గీతాలు అత్యంత ప్రశంసనీయమైనవి. అయితే ఇతర గీతాలు గూడ ప్రథమశ్రేణికి చెందినట్టివే.

1. పూజ:— 'ధ్వనిల్ ఆహ్వాన్......' వైతాళిక ప్రార్థనా గీతం. "అదుగో ప్రభాతాకాశంలో ఆహ్వానం ధ్వనించింది. భువనమందిరాల్లో శాంతిగీతం నలుదెసల విరిసింది. నిఖిలలోక బాంధవుడైన ఆ మహారూపాన్ని హృదిలో దర్శించు......... ప్రాక్పశ్చిమాలు ఏకంకావాలి, విశ్వసంఘంలో స్నేహబంధం మరింత గట్టిపడాలి."

''హంబే జయ్......' ధీరోదాత్తుడైన విశిష్టపురుషునికి ఎన్ని కష్టములొచ్చినా అవి తొలగిపోయి విజయమాతణ్ణి వరించును. రవీంద్రుడు రచించిన 'ఫాల్గుణీ' నాటకంలో కూడ ఈ గీతం చేర్చబడివుంది.

'ఆమార్ ముక్తి ఆలోయ్‌ఆలోయ్'"నాకు ముక్తి ఆకాశంలో ఆలోకంలో, ధూళికణంలో, పువ్వుపువ్వులో లభిస్తుంది. దేహాతీతమైన మానస జగతుతీరంపై ఎచట మారిపోవుదునో! పవన గానం, గీతస్వరంలోనూ నాకైవల్యముంది. సర్వజన మానసంలోనే నాకు తరుణోపాయం వుంది. దుఃఖాన్ని తుచ్ఛంగా ఎంచి మోక్ష ప్రాప్త్యాశతో నా జీవితాన్ని బలిచేస్తాను."

'ఆమార్ మిలన్ లాగి'... ఆరాధ్యదేవతను ఉద్దేశించి భక్తుడు చేసిన నమ్రనివేదన.

'తోమార్ అసీమే...' అను గీతంలో భగవంతుని ధ్యానించినంత కాలం జీవిని ప్రాపంచిక సుఖదుఃఖాలు ఏమీ చేయజాలవనియూ, అతనిపై శ్రద్ధాసక్తులు సడలగానే అవి వెంటాడి వేధింపునని చెప్పబడింది.

'ఓయి ఆసన్ తలే...' దాస్యభక్తికి, సేవక సేవ్యభావానికి ప్రతీక.

స్వదేశీయము

'అయి భువన్ మనమోహినీ...' అను గీతం భారత మాతను ఉద్బోధించి వ్రాయబడింది. "అఖిల భువనమోహినీమాతా! నిర్మలజాలార్కుని ధరణీ జననీ! జలధి నీచరణాలను ప్రక్షాళనం చేస్తూంచే, పవనం నీ నీలికొంగును వూపుతూంది. నింగినంటే హిమనగాన్ని మంచు కిరీటముగ ధరించిన దానవు నీవు. సూర్యోదయం నీ ఆకాశంలో అవుతూవుంది. సామవేదం నీ తపోవనంలో ప్రప్రథమంగా ప్రతిధ్వనించింది. ప్రప్రథమంగా నీ వన విడిదిలో వేదవేదాంగాలు కావ్య సృష్టి జరిగాయి. నీవు ధన్యురాలివి. వాడ వాడల అన్నపూర్ణవని ప్రఖ్యాతిగన్న దానవు. నీ కరుణారస తరంగిణులైన గంగాయమునలు స్తనద్వయమై అమృత వాహినులైనవి".

ప్రకృతి

'మోర్ వీణా ఉఠే కోన్ సుర్ బాజే'...అనుగీతంలో వీణను ఆధారంగా స్వీకరించి సంగీతావయవాల ప్రక్రియల్ని అభివర్ణిస్తూ "ఏ స్పర్శాశచేతనో పల్లవాలకు భాష అబ్బినదని వసంత ఋతు పూర్వాగమనలీలను మనోహరంగా చిత్రించినాడు రవీంద్రుడు. 'ఆజి వసంత్ జాగత్ ద్వారే...' అనుమరోగీతంలో వసంతాగమన వేళల్లో మానవుని ఎదలోని భావరూపాలు చొప్పించబడినవి."కుంఠిత జీవితంలోకి నేడు వసంతంవచ్చింది. తరతమ, ప్రథమోత్తమ భేదాల్ని మాపి హృదయదళాల్ని వికసింపజేయుము. సంగీతం ప్రతిధ్వనించే నీలాకాశంలో నీసువాసనలను వెదజల్లుము. ఈ జగతివైపు విచ్చేసి మాధుర్యాన్ని అందజేయుము. వనంలో విడిది చేసిన ఆర్తి ఆకు ఆకున వ్యాపించాలి. దూరంగా నింగిలో వసుంధర సింగారించుకుని ఎవరి రాకకో వ్యాకులంగా వుంది...ఓయీ సుందర వల్లభా! నీ గంభీరస్వాగతం ఎవ్వరికో!''

''గ్రీష్మతాపంతో ఆకాశం దాహంతో కంపిస్తూంది. పవనం తాళ లేక హాహాకారాన్ని చేస్తూంది. చాలా దూరంనుండి నడచివచ్చి డస్సిన పాంథుడు గుడితలుపుల్ని తెరవమని ప్రాధేయపడుతున్నాడు. ఎవరుకేలెత్తి పిలిచారో బయటకు వెళ్ళి ఎంతసేపయిందో కాని ప్రభాత పుష్పహారం వాడిపోతూంది. వెంటనే తలుపులు తీయుము. హృదయ విపంచి ఆశాహీనంగా క్షీణస్వరంలో పల్కుతూంది. ఎవరా సవ్వడిచేయునది. ఇంతవరకు కనుకోకలేక పోతిని. ఈ రోజంతా ఒకడ్కనే భరించజాలను'' అని ''ప్రఖర్‌తపన్ తాపే..." అను ఈ స్వరం నాప్రాణాల్లో గానం చెయ్యాలి. ఈ గానభారత్వాన్ని గేయంలో గ్రీష్మకాలం నాటి ఉదాసీన వాతావరణం సజీవంగా చిత్రించబడింది.

రవీంద్రుడు రచించిన ఋతుపర్ణనా సంబంధమైన గీతాల్లో వర్షఋతు గీతాలు అద్వితీయములు. వానిలో 'బాదల్ బాఉల్ బాజాయ్‌రే...' నిరుపమానమైనట్టిది. వంగదేశంలో 'బాఉల్' అనుగాయక సంప్రదాయకులు వున్నారు. ఈ సంప్రదాయం వారు పాటతో బాటు ఆడతారు కూడాను. బొజ్జనిండా నీరు నింపుకుని ముసిరివచ్చే వర్షాకాల మేఘాల్ని పై గీతంలో ఈ గాయక సముదాయంతో పోల్చబడింది. బాఉల్ రూపధారులైన కారు మేఘాలు రేయింబవళ్ళు గర్జించుచున్నాయి. ఏకపోతగా ధాత్రి అంతా కురుస్తున్నాయి. నేరేడు వనంలోనేమి, సస్యక్షేత్రంలో నేమి, కుండపోతగా ఒకటే ధార.

''తన్మయత్వంతో పదే పదేపాడి ఆడి డస్సినాడు పిచ్చివాడు. నింగిలో స్వరాలు మ్రోగినవ్. పల్లవపాణిపై వర్షబిందువులు రాలి మధుర మంజీరరావాల్ని చేయుచున్నాయి. గృహమంటే విముఖుడై వ్యాకులమైన స్వరంలో పాడుతూ నగరనగరాలు దీనంగా తిరుగుతూ ప్రాతఃకాల పిల్లవాయువుల్లో గూటిని చేరాడు.'' సారస్వత విలువదృష్ట్యా ఈ గీతం ఓజస్సు ప్రధానమైనది. ధ్వన్యనుకరణాలంకారములచే వన్నెలు కలిగి వర్షఋతువును మన కనుల ముందు చూపుతుంది. విపుల నాదైశ్వర్యాన్ని పుణికి పుచ్చుకున్న ఈ గీతానికి ఖమాస్ మణికాంచన యోగాన్ని సమకూర్చింది.

'శరత్ ఆలోర్ కమల్‌వనే...' అనేది శరత్కాల గీతం. శాంతి నికేతనంలో ప్రతి ఏట హోలీ పండుగ చేసుకుంటారు. ఆ వేడుకలో గానంతోబాటు నృత్యంచేయడం ఆచారం. వసంతం వచ్చింది. దాని గుబాళింపు నలుదిక్కులు వ్యాపించింది. అశోకము పలాశము ఎర్రగా నవ్వులు వెదజల్లుతున్నాయి. ఉదయాకాశాన్ని జేగురు మబ్బులు మైకంగా క్రమ్ముకున్నాయి. చిగురుటాకు అంచులపై ఎర్రని జీరలు కనబడుతున్నాయి. దక్షిణ పవనంలో వేణువనం సవ్వడి వినబడుతూంది. గడ్డిపోచలపై శీతాకోకచిలుకలు ఆడుతున్నాయి, పుష్పంచుట్టూ ఝుమ్ ఝుమ్ మంటున్నాయి బమ్మెరలు. ఛిఱికి రెక్కల్ని గలగల ఆడిస్తూంది. పవనస్పర్శ సోకగానే మాధవీకుంజాలు మత్తిల్లినాయి. బింబచిత్రణలో సిద్ధహస్తుడైన రవీంద్రుని పారదర్శిక దృష్టినుండి ప్రకృతి ఎలా తప్పించుకోగలదు?

చిత్రమేమంటే ఆనందోత్సాహాలకు ప్రతీక అయిన వసంతంలోగూడ విశ్వకవి వేదనను అనుభవించాడు. ఆనందాతిశయంలోగూడ దుఃఖం దాగివుంటుంది సుమా అని 'తుమ్ కి ఛూదియే జావో' గీతంలో వ్రాశుచ్చాడు. ఆనందం గట్లుతెంచుకొని ప్రవహించినపుడు మానవుడు దుఃఖానుభూతి ఎలాపొందగలడన్న సందేహం చాలామందికి కలవచ్చు. ఆంగ్లకవి కీట్సు వ్రాసిన ODE TO A NIGHTINGALE ఉద్బోధనా గీతంలో ఈ రహస్యం చక్కగా వర్ణింపబడింది.

ఇతరములు


'గ్రామ్ ఛాడా ఓయి...' ఇది రవీంద్రుని 'ప్రాయశ్చిత్' అను నాటకంలోనిది. వంగగాయక సముదాయమైన బాఉల్‌బాణీకి ఇది అత్యంత సన్నిహితం.

'ఖరవాయు వయవేగే...' అను గీతం అన్యోక్తిగా రాబోయే తుఫాను గురించి నావికుని హెచ్చరించుటకు సంబంధించినది. ప్రభంజనము వీచుచున్నదనియు, కాళమేఘాలు కలిసివచ్చినవనియు, తాను తెరచాప పట్టిన నీవు చుక్కాని వహింపుమనియు చెప్పుతూ ఝంఝూమారుతం విరుచుకపడినా చెక్కుచెదరక అచంచలధైర్యంతోవుండి గీతరచనలో నిమగ్నమైపొమ్మని ఆజ్ఞాపించబడింది.

రవీంద్రనాథఠాగూరు బుద్ధభగవానునిపై అతని పునర్జన్మనాకాంక్షిస్తూ ఓగీతాన్ని రచించాడు. గీతం మూలంలో మొత్తం మూడు చరణాలున్నాయి. కాని వాడుకలో రెండు చరణాలుమాత్రమే గ్రహించబడినాయి. 'హింసాయ వున్మత్ పృథ్వీ...' అని చెప్పి ద్వంద్వసంకులమైన ప్రపంచంలో, దుర్మార్గం రాజ్యం చేస్తూన్న లోకంలో, అరిషడ్వర్గాల్లోఒకటైన లోభంచేత బంధింపబడిన జగత్తులో భయావహులైన ప్రజలంతా నీపునర్జన్మను ఆకాంక్షిస్తున్నారని, ఆక్రందనాహాహాకారాలతో సంసారికతాపంతోనూ విషయలోలురై జీర్ణించి ఖిన్నులైన జనాన్ని సముద్ధరించడానికి పృథివిపై మరల అవతరించి మంగళ శంఖము పూరించి, శుభసంగీతాది ఛందస్సులను భాషించి ఈ ధరిత్రిని నిష్కళంకముగా చేయమని ప్రార్థిస్తాడు ఠాగూరు. బుద్ధభగవానుని పునరావతరణ హిందూ మతసమ్మతమైన 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' మాదిరిగా ఐవుండి ఎక్కువ పాళ్ళలో RESURRECTION OF CHRIST తో పోలికలు కల్గియున్నది.

రవీంద్రుని సంగీతం వంగదేశంలో వేళ్లుపాతుకున్నా దాని ప్రచారం ఇతర ప్రాంతాలలోకూడా ఎంతేని అవసరమైవున్నది. మనం ఈ సందర్భంలో రవీంద్రుని గీతాన్ని సంగీతానుక్రమంగా ఇంతవరకు ఎవరూ తర్జుమా చేయలేదన్న విషయాన్ని విస్మరించరాదు. ప్రపంచమంతా కొనియాడబడిన విశ్వకవి గీతాల్లోని సాహితీ సంగీతతత్వానికి ఉన్న విలువను భారతీయులమైన మనం క్షుణ్ణంగా అవగాహనచేసుకోక పోవడానికి కారణం మన ప్రయత్నలోపమేమో !

★







నగర వార్తా చిత్రాలు


ఎడమవైపు పైన : అమెరికా రాయబారి కెన్నెత్ బి. కీటింగ్ ఫిబ్రవరి 13 న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవనంలో రోటరీ డిస్ట్రిక్ట్ 316 వ సమావేశాన్ని ప్రారంభించారు.


ఎడమవైపు మధ్య : జనవరి 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరిగిన పౌష్టికాహారానికి సంబంధించిన తొలిసమావేశంలో రాష్ట్ర గవర్నరు ప్రసంగించారు.


ఎడమవైపు క్రింద : రాష్ట్ర గవర్నరు జనవరి 31 న జిల్లాను సరళతమ సంస్కృత సమితి సమావేశంలో ప్రసంగించారు.

పైన : ఫిబ్రవరి 12 న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వారు రివెన్యూబోర్డు ప్రథమ సభ్యుడు శ్రీ బి. కె. రావు ఐ. సి. ఎస్. శ్రీ భగవాన్‌దాస్‌ను సన్మానించారు.


క్రింద : అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనలో ఏర్పాటు చేయబడిన ఫల పుష్ప ప్రదర్శన








పాల ప్రాజెక్టు పెవిలియన్




సమాచార, పౌర సంబంధ, యాత్రిక శాఖ ఏర్పాటు చేసిన పెవిలియన్

1971 అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన


రాష్ట్రంలో అతి పెద్ద ప్రదర్శన – అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన – యథాప్రకారం యీ ఏడాదికూడా హైదరాబాదులోని ముకరంజాహిరోడ్డుప్రక్కనగల ఎగ్జిబిషన్ మైదానంలో జరిగింది. అనేక ప్రయివేటు సంస్థలు, ప్రభుత్వ శాఖలు పాల్గొన్న యీ ప్రదర్శనకు 1971 జనవరి 1 వ తేదీన ఉపరాష్ట్రపతి ప్రారంభోత్సవం చేశారు. ఫిబ్రవరి 10 వరకు ఈ ప్రదర్శన వుంది. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేయబడిన కొన్ని ప్రభుత్వ శాఖల పెవిలియన్‌లను ఇక్కడ ప్రచురిస్తున్నాం.



వ్యవసాయ శాఖ పెవిలియన్



మత్స్యశాఖ పెవిలియన్



పశు సంవర్ధకశాఖ పెవిలియన్



ఆసియా ఖండంలో వరి నెలవంక

— రావూరు వెంకట సత్యనారాయణరావు

వడ్లు దంచంగా
వచ్చె చుట్టమ్మ
పొమ్మన్నా పోడాయె
వరి కూటి వాపి... ”

ఇది పాతకాలపు పాట. వరి పంట సమృద్ధిగా లభించని కాలమది. ఎవరో సంపన్నులు మాత్రం వరి అన్నం తినే వారు. తక్కిన వారంతా, తయిదలు, చోళ్ళు, జొన్నలు, సజ్జలు మొదలైన ధాన్యాలతోనే కడుపు నింపుకొనేవారు.

అలాటి కాలంలో ఎవరి యింటికైనా బంధువువస్తే అక్కడ వడ్లు దంచడం గమనిస్తే రెండు పూటలు వుండి ఆ ఓగిరం ఆరగించి వెళ్ళాలని కోర్కె కలగడంలో ఆశ్చర్యం లేదు. ఎలాగో కాసిని వడ్లు సంపాదించి, వాటిని దంచుకొని రెండు పూటలు పండుగలాగా విందులారగిద్దామని అభిలాష చెందే గృహస్థులను బంధువు వచ్చి కూర్చుంటే అతగాడికి కొంత వడ్డించడమంటే కొంత కష్టంగా తోచడం కూడా సహజమే! ఈ బాధనే పై పాట వర్ణిస్తుంది.

అలాటి వరి పంట చరిత్ర తెలుసుకోవడంలో ఎంతో ఆనందం వుంటుంది. ఆశియా ఖండంలో వరి అతి ముఖ్యమైన పంట...చాలా మందికి ఈ పంటను బట్టి ఆర్థికస్తోమతకూడా ఏర్పడుతుంది. సుమారు నూరు కోట్ల మంది ప్రజలు వరి అన్నం మీద ఆధారపడి జీవిస్తున్నారని అంచనా వేయబడింది.

ఆశియా ఖండం వరి పంటకు పుట్టిల్లు

వరి పంట పండే ఆశియా దేశాలు పశ్చిమ పాకిస్థాన్‌నుంచి జపాను వరకూ నెలవంక రూపంలో వున్నాయి. ఇది ఎంతో సుందరమైన దృశ్యంగా మన భావనా జగత్తులో మెదులుతుంది. ఆశియా ఖండంలో ఈ వరి నెలవంక స్వరూపం అలాగే వున్నా, కాల క్రమాన ఈ పంట ఇతర దేశాల కూడా ప్రాకిందీనాడు. అయితే పైన చెప్పిన నెలవంకలో ప్రపంచపు పంటలలో నూటికి తొంభై అయిదు వంతుల పంట పండుతుంది. అంతేకాదు — ఆ పంట ప్రజల జీవితాలలో ప్రతిబింబిస్తుంది. వారి ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం—అంతా వరి పంటనుంచే అవతరిస్తాయి.

ఈ నాడు వరి పంట యాభైపైగా దేశాలలో పండుతోంది. కొన్ని దేశాలలో ఆదేశవాసుల అన్నపు కంచాలు మూడు పూటలా నింపడానికి అవసరమైన దాని కంటె ఎక్కువగా పండుతోంది. అయితే వరిపంటకు పుట్టిల్లయి ఆశియాదేశము ఇతర దేశాలనుంచి బియ్యం తెప్పించుకోవలసిన అవస్థకు లోనైంది, గతదశాబ్దంలో.

ఆశియా దేశం వరి పంటకు కాణాచి. ఇక్కడ వాతావరణం, భూసారం వరికి అనుకూలమైనట్లుగా మరి ఏ పంటకు కాదు. పల్లపు భూములలో వరి పండుతుంది. ఇతర పంటలు ఎంత మాత్రం వర్ధిల్లవు. అలాటి తావులో, అతి వేడికీ, అతి శీతలత్వానికీ, నీటి మురుగుకూ, ఎద్దడికీ వరి తట్టుకోగలదు.

కొరియాలో కరిగిపారే మంచులో వరిపంట నవ్వుతూ నిలబడుతుంది. ఎంతో ఎత్తునవున్న కాశ్మీర్ పర్వతాలమీద ధాన్యలక్ష్మి పకపకలాడుతూ దర్శనమిస్తుంది. భూమధ్యరేఖకు దగ్గిరగావున్న మలయాలో హాయిగా వర్ధిల్లుతుంది. వరి చాలావిచిత్రమైనపంట.

వామనావతారం వరి—రామావతారం వరి

సంవత్సరానికి రెండు వందల దుక్కులు పడే అస్సాంలో ఏడు మీటర్ల వరదనీరు పారే తూర్పు పాకిస్థాన్, బర్మా, తాయిలాండ్, ఫిలిప్పీను దీవులలో వరి గర్వంగా తల ఎత్తి నిలుస్తుంది. వరిలో—మెట్టవరి, పల్లపువరి, నీటి మీద తేలే వరి,— ఇలాటివి అనేక రకాలున్నాయి. వరి ఒక్కొక్క చోట వామనావతారం ఎత్తుతుంది, ఒక్కొక్కచోట రామావతారం తాలుస్తుంది.

పంటలు పండటంలో కూడా మార్పులున్నాయి. కొద్ది రోజుల్లో పండేవి, చాలా రోజులకు పండేవి. కొన్ని రకాలు ఎనభై రోజులకే కోతకు వచ్చేవి, తక్కినవి రెండు వందల రోజుల దాకాపోతాయి. గింజల్లో మళ్ళీ ఎన్నోరకాలు—ఎన్నోరంగులు పొడుగు, పొట్టి మధ్య రకం గింజలున్నాయి. తెలుపు, ఎరుపు నీలం రంగు గింజలున్నాయి. కొన్ని గింజలు గట్టిగా వుంటాయి కొన్ని పొట్టిగా వుంటాయి. అన్నిటికంటె ఆశ్చర్యకరమైన విషయమేమంటే — కొన్ని సెంటు వాసన వేసేవి కూడా వుంటాయి. మొత్తం పదివేల రకాలున్నట్లుగా అంచనా వేశారు. ఇప్పుడింకా పెరిగి వుండవచ్చు.

నారు నాటాలంటే నవ్వులాటలు కావు

వరి సాగు విషయంలో అనేక పద్ధతులున్నాయి. దుక్కి నాగళ్ళ వద్ద నుంచి ఉక్కు నాగళ్ల వరకూ వినియోగించబడు తున్నాయి. అన్నిటిలో పల్లపు సాగు ఎక్కువ ప్రాంతాలలో వుంది. కాని వెయ్యి సంవత్సరాల క్రింద సాగుబడి పద్ధతి ఇప్పుడు లేదు. చాలా చోట ఎంత మార్పు వచ్చినా ఊడ్పు పద్ధతి అలాగేవుంది. మానవులు సాధించవలసిన పనే అది.

వరి పుట్టుకను గురించి ఇతమిత్థమని తేల్చి చెప్పడం సాధ్యం కాదు. అడవి వరిలో నుంచి యీవరిపంట అవతరించిందని మాత్రం చాలా మంది అభిప్రాయ పడుతున్నారు. అలాటి అడవి వరి ఇండియా, బర్మా, సయాంలలో ఎక్కువగా వుండేది. కనుక ఈ మూడు దేశాలలో ఎక్కడో వరి పంట అవతరించిందని శాస్త్ర వేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

ఆశియా ఖండంలో రెండు ప్రత్యేకతగల భూభాగాలున్నాయి. ఒకటి—గంగ, బ్రహ్మపుత్ర, ఐరావతీ, మెకాంగ్, యాంగ్‌ట్సీకి యాంగ్ నదుల వరదలకు లోన్యయే ప్రాంతాలు, రెండు నైరృతీ పవనాలు ప్రసరించే ప్రాంతాలు—ఇక్కడే ఆశియాలో ఆదిమవాలను నివాసా లేర్పరుచుకొని వుంటారని తెలుస్తుంది. ఇక్కడే వరి పంటలుకూడా ఆరంభమై వుంటాయి.

తర్వాత ప్రజలు వలస పోవడం ఆరంభించినప్పుడు—వరి పంట లాటి దాన్ని వదలి ఎలా పోగలుగుతారు! అలా మానవ ప్రవాహం ఈ పంటను అటు చైనాకూ, ఇటు ఇండియాకు, దక్షిణానగల మలయా, ఇండోనేషియాలకు చేర్చింది. పురావస్తు పరిశోధనశాఖ వారూ, భాషా పరిశోధకులు పై నిర్ణయానికి రాగలిగారు.

క్రీస్తు పూర్వం 3000 నాడే చైనాలో వరి

కాని క్రీ. పూ. 3000 నాటికే చైనాలో వరి పంట వున్న ట్లుగా చరిత్ర చెబుతోందని కొందరు పేర్కొన్నారు. అయితే వరి భోజనం ఆ కాలంలో ఒక్క చక్రవర్తులకే లభించేది. క్రీ.పూ. 1000 నాటికే భారత దేశంలో వరి పంట వున్నట్లు "సుశ్రుత సంహిత" వల్ల తెలియవస్తోంది. ఈ గ్రంథంలో పుష్టి ధాతువు లను బట్టి బియ్యాన్ని ఒక జాబితాగా పేర్కొన్నారు." అని డా. ఫెలిక్సు వ్రాస్తున్నాడు.

తర్వాత వరి పంట జావా, ఫిలిప్పయిన్ దీవులకు ప్రాకింది. క్రి. పూ. 500 నాటికి సింహళంలో వరి పంట తొంగి చూచింది. క్రీస్తు శకారంభంనాటికి అటు జపానుకూ, ఇటు పర్షియాకు తరలి వెళ్ళింది ధాన్యలక్ష్మి. అరబ్ దేశస్థులు ఈజిప్టు, స్పెయిను దేశా లకీ పంటను కానుకగా అందించారు. 15వ శతాబ్దం నాటికి ఇటలీలో వరిసాగు ఆరంభమైంది. అక్కడ నుంచి ఫ్రాన్సు, బాల్కన్ దేశాలకు నవ్వుతూ నడిచి వెల్లిందీ పంట. ఐడతకీచులు, స్పెయిను దేశస్థులు ఈ పంటను అమెరికాకు తరలించారు. ఈవిధంగా 1685 లో అమెరికాలో ఈ పంట ఆరంభమైంది.

అమెరికాలో ఆధునిక వ్యవసాయ కృషి

ఇంత ఆలస్యంగా వెళ్లిన ఈ దేశంలోనే ఇప్పుడు వరి పంట ఎంతో గొప్పగా వర్థిల్లుతోంది. ఇదంతా యంత్రాల వల్లనే జరుగుతోంది. కాలిఫోర్నియాలో వెయ్యి ఎకరాల భూమిని ట్రాక్టర్లతో దున్నుతారు. నిమిషానికి వెయ్యి గాలన్ల నీరు సప్లయి చేసే పంపులు ఉపయోగించి మళ్ళలో నీరు నింపుతారు. విమానం మీద నుంచి విత్తులు, ఎరువులు, క్రిమి సంహారక ఔషధాలు విరజిమ్ముతారు. పంటలు పండించి బజారుకు తోలడం దాకా అంతా యంత్ర సహాయంతోనే. మొత్తం వ్యవసాయ కార్య క్రమానికి వారికి ఎకరానికి ఏడు గంటల మానవకృషి సరిపోతుంది. జపానులో ఎకరానికి తొమ్మిది వందల గంటల మానవకృషి కావాలి తక్కిన ప్రాంతాలలో వారు వెయ్యి గంటల కృషి చేస్తారు. కాని అమెరికా, జపానులలో పండే పంటలలో ఎన్నో వంతో వీరి పంట.

నెలవంకలో కోటి నెలవంకలు

కోతల కాలంలో ఆశియా వరి నెల వంకలో ఇరవై అయిదు కోట్ల ఎకరాల వంట పొలంలో ధాన్యలక్ష్మి నృత్యంచేస్తుంది. కోత కోసేవారు నెల వంక రూపంలోనే దర్శన మిస్తారు. రంగు రంగుల వస్త్రాలతో రమణీయమైన భావనలతో ఒకనెల వంకలో కోటి నెల వంకల దృశ్యమది.

ఇప్పటికింకా ధాన్యపు పంటను వృద్ధి చేయాలనే స్థిర సంక ల్పంతో అనేక దేశాలు కృషిచేస్తున్నాయి. పరిశోధనలు జరుపు తున్నాయి. ఎరువుల ఫ్యాక్టరీలు నిర్మిస్తున్నాయి. ట్రాక్టర్లు దిగుమతి చేసుకొంటున్నాయి. ఆనకట్టలు కడుతున్నారు. పాతాళ గంగను బైటికి తీస్తున్నారు. మన భారత దేశంలో వరి పంట పుష్కలంగా మున్నెన్నడూ వినని రీతిగా పండిందనే సువార్త ఈ సంవత్సరం వినిపించిందొక మంగళ గీతంగా, మధురాలాపనగా!

భారత దేశంలో వరిపంట ఎలాటి స్థానాన్ని ఆక్రమించిందీ—ఏయే గ్రంథాలలో పేర్కొనబడిందీ, ఎలాటి పద్ధతులతో ఉపయోగ పరచబడుతున్నదీ—రాస్తే పెద్ద వ్యాసమవుతుంది. 'వరి పంట' చరిత్ర యింతటితో ఆగిపోలేదు. ప్రతి దినం క్రొత్త అధ్యా యాలు సృష్టిస్తూనేవుంది, వరి పంట ఆదిలో లాగా కాకుండా సర్వసామాన్యమై పోయింది.

"జడి వాన కెదురీది
వచ్చాడు చుట్టమ్మ
వండవే కోడలా
వంక సన్నాలు
చేయవే కోడలా
పాయ సాన్నాలు"

★

కాళేశ్వర క్షేత్రము

వి. నాగేశ్వర శర్మ

ఆంధ్రుల ఆధ్యాత్మిక చింతనను ప్రసరింపజేయు పుణ్యనిలయాలెన్నిటికో నిలయమైవున్నది పావన గోదావరి నదీతీరము. అట్టి నిలయాలుకొన్ని కాలగర్భంలోకలసిపోగా, కొన్ని జీర్ణ శిథిలచ్ఛాయలలో నేడు ప్రాచీనాంధ్ర ఔన్నత్యాన్ని చాటే చిహ్నాలుగా నిలిచి పోయినవి. ఆ ప్రాచీనాంధ్ర క్షేత్రాలలో కాళేశ్వరం ఒకటి.

"త్రిలింగ" దేశవ్యుత్పత్తిని సూచించుచున్నవి శ్రీశైల ద్రాక్షారామ, కాళేశ్వరలింగములు. ఇందలి కాళేశ్వరము, కరీంనగర్ జిల్లాలోని మంథెన తాలుకాలో గోదావరి దక్షిణ తీరంలో వున్నది. పూర్వము మహావైభవముగా వెలసిన ఈ క్షేత్రము నేడు 1,026 మంది జనాభాతో నున్న ఒక కుగ్రామముగా వున్నది. సమగ్రమైన చరిత్ర అందుబాటులో లేకపోవడంచేత, తగినంత ప్రయాణ సౌకర్యాలు లేకపోవడంచేత, బహు పురాతనమైన ఈ క్షేత్రపు ఉనికి పెక్కు మందికి తెలియదనడానికి ఆశ్చర్యములేదు. కాళేశ్వరము చేరుకోవాలంటే, మహాదేవపురం నుండి 8 మైళ్లు చిట్టడవి మార్గంగా ప్రయాణంచెయ్యాలి. ఇప్పుడిప్పుడే, పంచాయతీ సమితి రోడ్డు నిర్మాణమవుతున్నది. బస్సు సౌకర్యాలు ఇంకా ఏర్పడలేదు. కార్లలోనైనా, బండ్లలోనైనా ప్రయాణం చెయ్యాల్సొస్తుంది.

భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్‌కు, ఇది సరిహద్దుగావున్నది. కరీంనగర్ జిల్లాలో గోదావరి ఆవలి వైపు మధ్యప్రదేశ్, మహారాష్ట్రములున్నాయి. ఇదిగాక ఆదిలాబాదు జిల్లాకూడావున్నది. ఈ ప్రదేశాల నుండి కూడా ప్రజలు ఈ క్షేత్ర దర్శనానికి వస్తుంటారు.

సంగమము

కాళేశ్వరము నానుకొనియే, గోదావరి ప్రవహిస్తున్నది. ప్రణీత, గౌతమీనదితో కాళేశ్వరమువద్దకలిసి, పవిత్రమైన సంగమ తీర్థముగా ఏర్పడివున్నది. ప్రణీత తీర్థములు రెండు. సంగమ తీర్థములు రెండు, గోదావరి తీర్థములు రెండు–ఈ ఆరు కలిసి ఒక షట్కోణము కలిగించుటచేత, "...సంగమ తీర్థే షట్కోణ మధ్యే..." అని సంకల్పించేస్తూ స్నానం చేస్తుంటారు ప్రజలు. ప్రత్యక్షంగా మనకు కనబడేది, ఈ రెండు నదుల కలయికయే ఐనా, ఇది పంచనదీ కలయికయని ఇక్కడ, ప్రణీత, వైన్య, వరద, సరస్వతి, గౌతమి అనే నదులు కలిసి పంచనదీ సంగమస్థానమైయున్నదని. అందుచేత ఇది ప్రయాగలోని త్రివేణి సంగమముకన్న, కోటిరెట్లు గొప్పదని స్కాంద పురాణంలో, ఈ విధంగా చెప్పబడివున్నది: "ప్రణీతా, వరదా, వైన్యా, గౌతమీచ సరస్వతీ నద్యః–పంచవహంత్రత్రే ప్రయాగాత్కోటి శోఽధికం"

ఈ సంగమములో కార్తీకమాస స్నానము విశేషము.

ఈ క్షేత్ర ప్రస్తావన బ్రహ్మాండ పురాణమందు, విద్యానాథ కవి విరచితమైన "ప్రతాపరుద్ర యశోభూషణ"మను అలంకార శాస్త్రమందు, వ్యాసకృత స్కాందపురాణమందు కలదు.

బ్రహ్మాండ పురాణమందు సుభుద్రడను ఆర్యాంధ్రుని కుమారుడైన ఆంధ్ర విష్ణువు, నిశుంభుడను రాక్షసుని సంహరించి వాని నివాసమాక్రమించి, శ్రీశైలము భీమేశ్వరము, కాళేశ్వరములను, మహేంద్రపర్వతముతో కలియునట్లుప్రాకారముల నిర్మించి, వాటిని "త్రిద్వారములు"గా నెంచి పాలించెనని ఈ క్రింది శ్లోకమునందున్నది:

"శ్రీశైల, భీమ, కాళేశ మహేంద్రగిరి సంయుతం ప్రాంకురాంతు మహత్కృత్వా (ప్రాకారం సుమహత్ కృత్వా) త్రీణి ద్వారాణి చాకరోత్

త్రిలింగరూపస్యవసత్ త్రిద్వారేషుగణైర్వృతః
ఆంధ్రవిష్ణు స్ఫురయుతో దనుజీవ నిశుంభువా
యుధ్వా త్రయోదశయుగాన్ హత్వాతం రాక్షసోత్తమం
అవసత్తత్ర ఋషిభిర్యుతో గోదావరీ తటే
తత్కాల ప్రభృతి క్షేత్రం త్రిలింగ మితివిశ్రుతం".

ఈ శ్లోకమునుబట్టి, కాళేశ్వరము క్రీ.శ. 6వ శతాబ్దినాటి ఆంధ్ర విష్ణువు కాలమునుండి ప్రసిద్ధమైయున్నదని తెలియుచున్నది. ఇందు "త్రిలింగ" శబ్దరూప కల్పన కూడ జరిగినది.

"ప్రతాపరుద్రీయ"మున "శ్రీశైల కాళేశ్వర దాక్షారామ నివాసినః" అని ప్రతాపరుద్ర మహారాజు, (క్రీ.శ. 1295–1323) ఈ విధముగా స్తుతింపబడినాడు:

"యైర్దేశస్త్రి భిరేష యాతి మహతీం
ఖ్యాతిం, త్రిలింగాఖ్యయా
యేషాంకాకతి రాజకీర్తి విభవైః

కైలాస శైలాకృతాః
తేదేవాః ప్రసర త్ప్రసాదమధునా
శ్రీశైల. కాళేశ్వరః
ద్రాక్షారామ నివాసినః ప్రతిదినాం
చేప్రియసే జాగ్రతు".

ఈ ఆధారమును బట్టి, శ్రీశైల కాళేశ్వర ద్రాక్షారామము లను మూడులింగముల మధ్యస్థితమగు దేశము "త్రిలింగదేశ"మని వ్యవహరింపబడుతున్నది. కాకతీయుల కాలంలో, కాళేశ్వరము ప్రసిద్ధమై యుండెనని. పూర్వమది మహావైభవము ననుభవించిన క్షేత్రమనికూడా తెలియుచున్నది. ఆ కాలంలోనే ఇది వరంగల్లుకు రక్షణదుర్గముగా నుండినదని చారిత్రకాధారమున్నద

14వ శతాబ్ది ప్రారంభమునాటి విన్నకోట పెద్దిరాజుకూడ, తన "కావ్యాలంకార చూడామణి"యందు ఆంధ్రదేశము, త్రిలింగ దేశమును గురించి ఈ విధముగా పేర్కొని యున్నాడు:

"ధరశ్రీ పర్వత కాళే
శ్వర దాక్షారామ సంజ్ఞవఆలు త్రిలింగా
కరమగుట నంధ్రదేశం
బరుదార త్రిలింగ దేశమన జను గృతులన్"

ఇవిగాక, ఈ క్షేత్రములోని. జైన, బౌద్ధ అవశేషములను బట్టి, కాళేశ్వరము సుమారు 2000 సం.కు పూర్వంకూడ చరిత్రలో వుండినదని, కాలక్రమేణ ఇది శైవ క్షేత్రముగా మారినదని కనబడుతున్నది.

ఈ క్షేత్రములో ప్రధానాలయము ముక్తీశ్వరాలయము. ఇందు 16 స్తంభములుగల మంటపమున్నది. వీటిలో కొన్నిటిమీద శిలాశాసనాలున్నవి. ("తెలంగాణ శాసనము"లందివిలేవు) పురావస్తు శాఖకు చెందిన డా॥ యన్. వెంకటరమణయ్యగారు ఇందొక శాసనాన్ని పరిష్కరించి Epigraphica Indica (Volume XXXVI)నందు ప్రచురించియున్నారు. ఈ శాసనము ముఖ్యమైన చారిత్రికాంశమును తెలియబరుస్తుంది. రెండవ హరిహరుని కుమారుడైన మొదటి దేవరాయలు, ఉదయగిరిలో రాజప్రతినిధి హరిహరుడు, ఇతనికి సైన్యమునిచ్చి దక్షిణదేశ దిగ్విజయ యాత్రకు పంపినాడు. తన దిగ్విజయ యాత్రానంతరము దేవరాయలు తులాపురుషమహాదానము చేసెనని ఈ శాసనమున పేర్కొనబడి యున్నది ఈ మహాదానము జరిగిన తేదీ కూడా ఇందు పేర్కొనబడియున్నది. అది "27 ఫిబ్రవరి 1397 క్రీ.శ. బుధవారమునకు" సరిపోవు తేది. తన ఎత్తు బంగారమును తూచి బీదలకు పంచిపెట్టునది తులాపురుష మహాదానము. ఇది పురాణములలో పేర్కొన్న 16 మహాదానములలో ఒకటి.

మిగిలిన మూడు నాలుగు శిలాశాసనములను కూడా సంస్కరించిన మరింత ముఖ్యమైన చారిత్రికాంశములు తెలియ వచ్చును.

కాళేశ్వరమను పేరు

స్కాందపురాణాంతర్గతమైన "కాళేశ్వరఖండము"నందు, కాళేశ్వరమును గురించి ఆసక్తికరమైన కథనములున్నవి.

యమ ధర్మరాజు పాపాత్ముల దూషణను సహించ లేక, స్వర్గలోకము వలెనే తన పేరిట ఒక పట్టణమును విశ్వకర్మచే నిర్మింపచేసి, ఆ క్షేత్రమునకు వచ్చిన వారందరు ముక్తులగునట్లు ఈశ్వరుని వరము పొందినాడు. కాళుడు నిర్మించిన ఆ నగరమే కాళేశ్వరము. ఇప్పటి దేవుపకొలను కూడా విశ్వకర్మ త్రవ్వించినదని ప్రతీతి. ఈ నిర్మాణమును సమర్థించునట్లు, ముక్తీశ్వరాలయ ప్రాంతములో "యమకోణము" "ఉక్కుస్తంభము" "చిత్రగుప్తుడు" "భైరవుడు" "వీరభద్రుడు" మొదలైన శిల్పములున్నవి.

కాళేశ్వర లింగము

కాళేశ్వర నగర నిర్మాణానంతరము, ఆనగరములో వెలసిన ముక్తీశ్వరుని దర్శనముతోనే జనులు ముక్తి బొందుతుండటం చేత, యమలోకమునకు ప్రాధాన్యత, ఆవశ్యకత లేక పోయినది. ఈ పరిస్థితిని గుర్తించి, యమధర్మ రాజు, బ్రహ్మదేవుని ప్రస్తావించగా ఆ విధాత ఆజ్ఞానుసారము యముడు శివుని ప్రార్థించాడు. మహేశ్వరుడు సాక్షాత్కరించి "నాపీఠమునందే నీ పేరిట మరొక లింగమును స్థాపింపుము నిన్ను పూజింపక నన్ను పూజించిన వారికి ముక్తి నొసంగను" అని చెప్పగా, కాళుడు ఆ విధముగానే లింగ ప్రతిష్ఠ చేసినాడు. ఈశ్వర సాక్షాత్కారము బొంది ఒకే పీఠము (పానవట్టము) పై, ముక్తీశ్వరునితో తానూవెలసి, సంపూర్ణ, ప్రభావవైభవములతో లింగాకారుడుగా వెలసి యున్నాడు కాళేశ్వరుడు. నేటికిని ఆ మహేశ్వరుని ఆదేశానుసారము భక్తులు, మొదట కాళేశ్వర లింగమును పూజించి, తర్వాత ముక్తీశ్వరుని పూజిస్తుంటారు.

ఒకే పీఠముపైనున్న కాళేశ్వర ముక్తీశ్వర లింగములు ముచ్చటగా వున్నాయి. ఇందు ముక్తీశ్వరుని లింగము ముఖమున రెండు రంధ్రములున్నవి. ఎంత అభిషేకము చేసినా నీరు ఈ రంధ్రములగుండా పోవును. అభిషిక్త జలము క్షీరము మొదలగునవి దూరముగానున్న సంగమ మందు కలియునని చెప్పుదురు. ఈ రంధ్రములను గురించి ప్రస్తావన కాళేశ్వర ఖండమందు లేదు. లింగ ముఖమున రంధ్రములుండడం విచిత్రమే. ఇవి ఏర్పడటానికి కారణాలేమిటో, దీని గాథ లేమిటో తెలియవు.

ముక్తీశ్వర లింగము అడుగు భాగమున సర్పము పైన లేచినట్లున్న శిల్పము కనబడుతుంది. ఈశ్వరలింగము 'కాళము' (సర్పము—శ్రీకాళహస్తి "లోని 'కాళ' శబ్దము వలె) చేత చుట్టబడి యుండటం చేత, అది "కాళేశ్వర లింగము" కాకూడదా? యన్న సందేహము కూడ కలుగుతుంది. దీని ఆధారము విచారణీయము.

క్షేత్రమహిమ

"కాళేశ్వర నివాసోవా కాళేశ్వర నిరీక్షణం
కాళేశ్వరస్యస్మరణం సర్వపాప ప్రణాశనం"

అని కాళేశ్వర ఖండములో ఈ క్షేత్రమును గురించిన ప్రశంస వున్నది. ఇది 'దక్షిణకాశి' యని కాశీక్షేత్రముకన్న 'వరిముల్లువెత్తు"

ఇది గొప్పదని కూడ ఈ క్రింది విధముగా కీర్తింపపడివున్నది.

"యవాధిః కుతో హేతోః

కాశ్యాః కాళేశ్వరో భవేత్".

దీనికి పౌరాణిక గాథ ఒకటున్నది. జయ విజయులు కాశికన్న కాళేశ్వరము గొప్పదని-లేదని తగాదా పడగా, సూర్యభగవానుడు ఆ రెండింటిని తూచి, కాళేశ్వరము, కాశికన్న 'వరిముల్లు' ఎత్తు గొప్పదని చెప్పెనట: ఈ సంఘటనను సస్ఫూర్తిస్తూ, ఆలయములో ద్వైలింగముల వెనుక భాగమున నున్న గర్భాలయములో జయ విజయుల విగ్రహములు సూర్యభాగవానుని విగ్రహము. ఒక్కొక్కటి 6 అడుగుల ఎత్తున వున్నది. ఇందు సూర్య విగ్రహము చూడ ముచ్చటగా నుండు శిల్పకళా ఖండము.

ఈ ఆలయానికి ప్రాకారాలు లేవు. ప్రధానాలయానికి సమీపంలో చిన్న చిన్న దేవుళ్లు-దేవతలు-వీటినిమిత్తం కొన్ని గుళ్లు వున్నాయి. దక్షిణాన సరస్వతీ మందిరము. ఉత్తరాన బాలరాజేశ్వర సన్నిధి. తూర్పున బిందు మాధవుని సన్నిధి, ఇవిగాక ముక్తీశ్వరుని భార్య అన్నపూర్ణ, కాళేశ్వరుని భార్య సదాపూర్ణ (శ్యామల) విగ్రహాలు. చతుర్ముఖ బ్రహ్మ (పంచముఖేశ్వరుడు?) కాలభైరవుడు, నారదుడు, ఆంజనేయుడు, విఘ్నేశ్వరుడు మొదలగు రాతి విగ్రహాలు ఎన్నో వున్నాయి. వీటిలో చాలా విగ్రహాలు చిందరవందరగా, ఒకచోట నుండి మరొక చోటికి చేర్చబడినట్లు కనబడుతుంది. ఆలయ ప్రాంగణములో 8 అడుగుల పొడవు గల రాతి చేప ఒకటి వున్నది.

శివాలయములో సాధారణముగా ప్రధాన మూర్తుల ఎదురుగా నందీశ్వరుడుంటాడు. అట్టి నంది ఈ ఆలయములో కనబడదు. ఇది లేకుండా వుండదు. బహుశ, ఏ మతావేశాలకో గురియై ఇతర విగ్రహములవలనే, నంది విగ్రహము కూడా తీసివేయబడి యుండవచ్చును. లేక, ఏ మట్టి దిబ్బలోనో పూడి పోయి వుండవచ్చును.

ప్రధానాలయంలో రాతి ధ్వజస్తంభ మొకటి వున్నది. దీనిపైన ఒక చిన్న మండపానికి ఒక నందీశ్వర విగ్రహము వున్నది.

పదడుగుల ఎత్తుగల సురాభలితేశ్వరుడు, నీలకంఠేశ్వరుడు అను చక్కటి నల్లరాతి లింగములు రెండు ఆలయానికి ఉత్తరాన పడియున్నవి. నిగనిగలాడుతున్న ఈగంభీర లింగమూర్తులు చూడ ముచ్చటగా నున్నవి. దీనికి ఆలయములుగాని, పూజలుగాని లేవు.

బిందుమాధేశ్వరుని ఆలయమువద్ద కొన్ని శిల్పపు చెక్కడాలు కనబడతాయి. అక్కడున్న స్తంభములపైనున్న శిల్పము, రామప్పలోని శిల్పమును పోలివుంటుంది.

సరస్వతీ ఆలయములు

కాళేశ్వరమునకు 28 మైళ్ళ దూరాననున్న మంథెన (మంత్రకూటము)లోని గౌతమేశ్వరాలయములో సరస్వతీ మందిరము. కాళేశ్వరాలయములోని సరస్వతీ మందిరము, ఆదిలాబాదు జిల్లాలో ప్రసిద్ధమైన "బాసర" సరస్వతీ ఆలయము-ఈ మూడు సరస్వతీ నిలయాలు గోదావరీతీరంలో కొద్దిపాటి దూరాలలోనే వుండడం గమనించదగ్గవిషయము. దీనిని ఒక మండలంగా పరిగణిస్తే ఈ ప్రాంతాలలో ఒకప్పుడు సరస్వతి ఆరాధన ప్రధానంగా వుండవచ్చునని, ఇక్కడ విద్యా పీఠములుకూడా వుండియుండునని తోచుచున్నది. ఈ ప్రాంతాలచరిత్ర పరిశోధిస్తే బహుశ దీని విశేషములు తెలియవచ్చును.

ఇతర దేవాలయాలు

ప్రధానాలయానికి సుమారు రెండుమైళ్ళ దూరంలో ఆది ముక్తీశ్వరాలయమున్నది. ఇది పూర్తిగా శిథిలమైవున్నది. పాములకు, కీటకాలకు నిలయము. ఇచ్చటి లింగముఖములోకూడ ముక్తీశ్వరలింగ ముఖములోవలె రెండు రంధ్రములున్నవి. ఈ ఆలయమువద్ద పలకలు, పలకలుగా గల రాతిముక్కలనుండి విభూతి లభిసుంది. దీనినిగురించి "పాషాణ పీఠికా విభూతి ప్రశంస" కాళేశ్వర ఖండమందున్నది.

రామాలయము, చంద్రశేఖరాలయము ఇంకా చిన్నచిన్న ఆలయాలు ఈ గ్రామంలో అక్కడక్కడా కనబడుతాయి.

ఈ ఆలయాలన్నీ ఒకేకాలంలో వర్ధిల్లినట్లులేదు. ఇది కొంతవరకు మతావేశాలకుకూడా గురియైనట్లున్నది. ముక్తీశ్వరాలయము వెనుకభాగములో ఔరంగజేబు నిర్మించిన మసీదొకటున్నది.

గోదావరి తీరమునందు, జ్ఞాన తీర్థము, వాయసతీర్థము చిత్సుఖ తీర్థము మొదలగు అష్టతీర్థములు, వాటి మహిమలను గురించి, కాళేశ్వర ఖండమునందు వివరింప బడియున్నది. సంగమతీరమందు సంగమేశ్వరాలయమున్నది, అదికూడా శిథిలావస్థలో వున్నది.

ఐతిహాసికముగాకూడ, ఈ ప్రాంతానికి ప్రాముఖ్యతవున్నది. శ్రీరామచంద్రుడు వనవాసంచేస్తూ కాళేశ్వర ప్రాంతములో చరించినట్లు, ఇది దండకారణ్య ప్రాంతమని-ప్రతీతి.

ఈ క్షేత్రాన్ని జ్యోతిర్లింగ క్షేత్రముగా కొందరు పేర్కొన్నారు. కాని శివపురాణంలో చెప్పబడిన ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రములు ఇవి-సోమనాథము, మల్లికార్జునము, మహాకాళము ఓంకారము, వైద్యనాథము, భీమశంకరము, రామేశ్వరము, వీరేశ్వరము, విశ్వేశ్వరము, త్ర్యంబక, కేదారము, ఘుసృణేశము. ఇందు కాళేశ్వరము పేర్కొన లేదు.

ప్రస్తుతం ఈ ప్రాంతములోని దేవాలయాలన్నీ జీర్ణావస్థలో వున్నవి. పురావస్తు శాఖవారు ఈ ప్రాంతమును పరిశోధించుట ఎంతైనా అవశ్యము. ఆలయ పునరుద్ధరణకు Temple Renovation Committee కూడ వున్నది. ఈ కమిటీ సత్వర కార్యాచరణకు పూనుకోవచ్చును. ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలోని వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరస్వామి దేవస్థానమువారు 1500 రూపాయలు ప్రతి సంవత్సరము విరాళ

ముగా ఇస్తున్నారు. దీనికి స్వామివారి ఆరాధన, సేవలు ప్రతి రోజు జరుగుతున్నవి. శివరాత్రి ఇక్కడ మహాపర్వదినము. శివరాత్రి ఉత్సవాలు, శివకళ్యాణము పెద్ద ఎత్తున జరుగుతాయి. దూరప్రాంతాలనుంచికూడ వందలాది యాత్రికులు వస్తుంటారు యాత్రికులకు వసతులు కల్పించడంకూడ చాల అవసరము. ఈ ప్రాంతం నదీతీర ప్రకృతిశోభలతో విలసిల్లుతుండడ-చేత తగిన ప్రయాణ సౌకర్యాలు కలిగించి, ఒక Tourist Centreగా కూడ దీనిని అభివృద్ధి చేయవచ్చును. అన్నిటికన్న ముఖ్యమైనది ఈ క్షేత్రాన్నిగురించిన ప్రభావము. తెలుగుదేశం త్రిలింగోద్భవం. త్రిలింగాల అంతర్భాగం కాళేశ్వరము ఈవిధంగా మహాంధ్ర చరిత్రలో కాళేశ్వరమునకొక ప్రధానపాత్ర వున్నది. ఇంతటి ఉజ్వల చరిత్రగల ఈ ప్రాంతానికి, నేడు తగినంత ప్రచారంలేక పోవడం శోచనీయము. జీర్ణ శిథిలచ్ఛాయలలోనున్న ప్రాచీనాంధ్ర సుక్షేత్రాన్ని అన్నివిధాల అభివృద్ధిపరచడం మన కర్తవ్యం.

దివ్వెలా వెలగాలి

యస్. వెంకటరంగారెడ్డి

దివ్వెలా వెలగాలి.
నవ్వులా నిలవాలి.
పువ్వులా నవ్వాలి.
ఈ జీవితం లోతు
కొందరికే తెలుసు!
ఈ జీవితం ఎంతో
వింతైనది చూడు...
కాలంతోపాటు
లోకాన్ని
లోకంతోపాటు
కాలాన్ని
కనులతో చూసి
మనసులో మార్పును నిలిపి
ప్రగతి పథాన నడిచే జీవితమే
సంతృప్తిని చూపే దర్పణం.
చీకటి, వెలుగు
పవలు, రేలూ
సుఖాలు; దుఃఖాలు
మన నీడలు...
వాటి ప్రభావం
మనపై పడక తప్పదు.
'చీకటి'లో నలగటం
వెలుగులో నవ్వటం
జీవితాలకు కొత్తకాదు.
జీవితానుభవమే అది.
అవకాశాలు మెరుపులాంటివి
ఆశలను రేపేవి.
మెరిసి, ఆరిపోతాయి.
అవి, అందుకొని వెలిగితే
జీవితమే దీప్తి.
మనిషికి, మనసుకు సంతృప్తి.
అవకాశాలను అందుకోలేని
అసమర్థుల జీవితాలు
పరిమళించవు ఎన్నడూ—
పలుకరించరు ఎవ్వరూ—
అందమైనది
పువ్వు—
పువ్వు నవ్వితే
అందానికి అందం.
నవ్వు నిలిస్తే
ఆనందానికి అందం.
దివ్వెలా జీవితం వెలిగితే
జీవితమే ఆనందాల అందం.
దివ్వెలా వెలగాలి.
నవ్వులా నిలవాలి.
పువ్వులా నవ్వాలి.

మన వార పత్రికలు

పండ్రంగి రాజేశ్వరరావు

మనదినపత్రికలు కాఫీలాగా తాత్కాలిక తృప్తిని హుషారును కలిగిస్తాయి. చాలామందికి తెల్లవారేసరికి దిన పత్రిక చేతికి రాకపోయేసరికి మతిపోయినంత పని అవుతుంది. దానివిలువ తిరగేశే పది నిముషాల పాటే. ఆ మధ్య ఒక ప్రముఖ రచయితను దిన పత్రికలకు బొత్తిగా వ్రాయటం లేదేమని ప్రశ్నిస్తే ఆదివారం సంచిక సహితం మరునాడు పాత పత్రికలతో మిఠాయి కొట్టుకు వెళ్ళి ముక్కలై పొట్లాలు కట్టటానికి మాత్రమే పనికొస్తోందని సమాధానం వచ్చింది.

వార పత్రికల సంగతి వేరు. వాటిని అభిప్రాయాలకోసం (Views) చదువుతారు. వాటి ప్రాముఖ్యత రచయితల స్థాయిని బట్టి వుంటుంది. కొన్నిటిని వారం పొడుగునా చదువుతూ వుంటారు; చదివింది నెమరు వేస్తూవుంటారు. వీటి ప్రతులను కొందరు భద్రపరచటం సహితం కలదు. పాత పత్రికలను తూచుకునే వాళ్ళ దృష్టి దిన పత్రికల మీద తప్ప వీటిపై అట్టే పారదు.

ఈ సందర్భంలో విజ్ఞానఋషిగా ప్రసిద్ధికెక్కిన కాశీ హిందూ విశ్వవిద్యాలయ ప్రధానాచార్యులుగా పనిచేసిన శ్రీ ధృవ, గుర్తుకు వస్తున్నారు. ఆయన ఇండియా, ఇంగ్లండు, అమెరికాలలో ప్రచురితమయ్యే ప్రముఖ వారపత్రికలను క్షుణ్ణంగా చదివేవారు. తత్రాపి సకల విషయములందు నిష్ణాతులమైనామని చెప్పేవారు. అట్లా చెయ్యమని శిష్య పరంపరకు నూరిపోసేవారు.

మన దేశంలో పత్రికా రచన ఇంగ్లీషులోంచి దేశ భాషలలోకి దిగుబడి అవటంచేత వున్నత స్థాయినందుకున్న వారపత్రికలు తొలుత ఇంగ్లీషులోనే ప్రచురితమయ్యాయి. లోకమాన్య తిలక్ గారి "మరాటా" అనిబిసెంటమ్మ "న్యూ యిండియా" గాంధీ మహాత్ముని "యంగ్ ఇండియా", "హరిజన్", మహమ్మదాలీ నడిపిన "కామ్రేడ్", కె. నటరాజన్ నిర్వహించిన "ఇండియన్ సోషలు రిఫార్మరు", భారత్ సేవా సంఘము వారి "సర్వెంటు ఆఫ్ ఇండియా", కామత్ గారి "సన్ డే టైమ్సు" పట్టాభి గారి "జన్మభూమి", బిర్లాల "ఈష్టర్న్ ఎకానమిష్టు" ఈశ్వర దత్తు గారి "వీక్ ఎండ్" ఖాసా సుబ్బారావు గారి "స్వతంత్ర" (దరిమిలాను 'స్వరాజ్య' గా మారి నేటికీ వారి స్మారకార్థము రాజాజీ ఆధ్వర్యాన నడుస్తోంది) ఇందుకు తార్కాణము అట్లాగే శ్రీ యమ్. యన్. రాయ్ స్థాపించిన "ఇండిపెండెంటు ఇండియా" నేటికీ "రాడికల్ హ్యూమనిష్టు" అనే పేరుతో నడుస్తోంది. ఆ స్థాయికి చెందినదే ఢిల్లీనుంచి వెలువడే "థాట్". లజపతిరాయి స్థాపించిన "పీపిల్సు", వామపక్షీయుల "బ్లిట్జ్". "లింకు" పూర్వపక్షీయుల "ఆర్గనైజరు" "కరెంటు" అందరినీ ఆకర్షించే "ఇల్లస్ట్రేటెడు వీక్లీ ఆఫ్ ఇండియా" దేదీప్యమానంగా దినదినాభివృద్ధిని పొందుతూవున్నాయి కాని అనిబిసెంటమ్మ, గాంధీజీ, ఈశ్వరదత్తు, పట్టాభి, నటరాజన్ గార్ల వారపత్రికలు మాత్రం వారితో అంతమయ్యాయి.

మరి తెలుగు వారపత్రికలు గడచిన శతాబ్ది మధ్యలోనే బయలుదేరి నానాటికి వర్ధిల్లుతున్నాయి. తొలుత యీ పనికి పూనుకున్నది క్రైస్తవ మిషనరీలు. ప్రథమ తాంబూలము బళ్ళారినుంచి వెలువడిన "సత్యదూత్" కు (1835 సం॥) లభించింది. తర్వాత 1838 లో మదరాసు నుంచి శ్రీ మండిగల వెంకటరాయశాస్త్రి "వృత్తాంతిని"ని వెలువరించారు. 1842 లో వెలువడిన "వర్తమాన తరంగిణి"కి పువ్వాడ వెంకట్రావు సంపాదకులు, సయ్యదు రహింతుల్లా ప్రచురణకర్తలు. తదుపరి 1861లో పీటర్స్ పెర్సివాల్ సంపాదకత్వమున "దిన వర్తమాని" వుద్భవించి బాలారిష్టాలు తట్టుకుని 1872 వరకు నడిచింది. 1874 లో కందుకూరి వీరేశలింగంగారి సంపాదకత్వమున బయలుదేరిన "వివేకవర్ధని" 1890 దాకా నడిచింది. 1893 లో గట్టుపల్లి శేషాచార్యులు గారి సంపాదకత్వమున వెలువడిన "శశిలేఖ" ఏడుఏళ్ళ కాలం (7) బహుళ ప్రచారంలోవుంది. 1898లో శ్రీ దేవగుప్తం శేషాచలపతి సంపాదకత్వమున బయలుదేరిన "దేశాభిమాని" చక్కగా నడిచింది. ఆ సంవత్సరమే ఏలూరులో మంత్రి ప్రగడ భుజంగ రావుగారి అధ్వర్యమున వుద్భవించిన "మంజువాణి" నేటికీ కొనసాగుతోంది. 1902 లో వెలసిన "కృష్ణా పత్రిక"కు తొలిసంపాదకులు సర్వశ్రీ కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావు 1907 లో వెంకటప్పయ్యగారు గుంటూరు వెళ్ళాక ముట్నూరి కృష్ణారావుగారు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. "ఆంధ్ర పత్రిక" ను 1908 లో బొంబాయినుంచి శ్రీ కాశీనాధుని నాగేశ్వర రావు వార పత్రికగా వెలువరించారు. దరిమిలాను 1914లో మదరాసువచ్చి దినపత్రికయింది.

కొన్ని రాజకీయ (వార) పత్రికలుగా పేరొందాయి వాటిలో 1908 లో బెజవాడయందు శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, అమలపల్లి నారాయణరావుల సంయుక్త సంపాదకత్వమున వెలువడిన "స్వరాజ్య" ది ప్రథమ స్థానము. కాని అంతకు పూర్వమే శ్రీ ఎ. సి. పార్థసారధి నాయుడు "ఆంధ్ర ప్రకాశిక"ను

1888 మొదలు 1928 వరకు నడిపారు. ఈయన లోకమాన్య తిలక్ ప్రియ శిష్యులు. ముద్దూరి అన్నపూర్ణయ్యగారి "కాంగ్రెసు" పదేళ్ళపాటు నిప్పులుక్కి ప్రభుత్వపు దమననీతికి ఆహుతి అయింది. అట్లాగే ఏలూరునుంచి శ్రీ ఆత్మకూరి గోవిందాచారి "సత్యాగ్రహి" ని నడిపారు. స్థానిక రాజకీయాలను శ్రీ మున్నంగి శర్మ "దేవదత్తం", "గాండీవమ్" పత్రికలలో ఘాటుగా విమర్శించేవారు. నెల్లూరి నుంచి శ్రీ రామానాయుడు సంపాదకత్వమున వెలువడిన "జమీన్ రైతు" ఆ వర్గ సమస్యలను విపులంగా చర్చించేది. వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రిగారి "త్రిలిఙ్గ" పత్రిక మితవాద వైఖరిని ప్రదర్శించేది. శ్రీ యన్. జి. ఆచార్యగారి "ప్రజాబంధు" వామపక్షీయులకు నీరాజనం పట్టేది. పింజల సుబ్రహ్మణ్యసెట్టిగారి "సమదర్శిని" జస్టిసు పార్టీకి ప్రచారంచేసేది. శ్రీ బి. వి. నరసింహాచారి "ఢంకా" ను మరువలేము. బి యస్. మూర్తి గారి "నవజీవన్" దళిత జాతుల సమస్యలను చర్చించేది. గూడవల్లి 'రామబ్రహ్మంగారి "ప్రజామిత్ర" స్థానిక జాతీయ అంతర్జాతీయ సమస్యలను నిశితంగా చర్చించేది. తాపీ ధర్మా రావు గారి "కాగడా" రాజకీయాలను సాంఘిక దృష్టితో పరిశీలించేది. "వాహిని" ఆచార్య రంగా రాజకీయాలను వివరించేది: బెంగుళూరునుంచి వెలువడే "ప్రజామత" విమర్శనా దృష్టితో రాజకీయాలను చర్చిస్తోంది. ఇవి వుదాహరణకు మాత్రమే.

మత, సాంఘిక, సారస్వత విషయాలకు అంకితమైన వార పత్రికలు చాలా వెలిశాయి. రాజా రామమోహనరాయి. కందుకూరి వీరేశలింగంగార్ల అడుగుజాడల్లో పయనించిన శ్రీ పాలపర్తి నరసింహం "ధర్మ సాధని" ని 1914 లో గుంటూరులో స్థాపించి సమర్థతతో నిర్వహించారు. నలభై ఏళ్ళ తర్వాత కాకినాడవచ్చి మాస పత్రికగా నడుస్తోంది. గాంధేయవాదులైన శ్రీ తల్లా ప్రగడ ప్రకాశరాయుడు "ధర్మజ్యోతి" ని, హరిజనోద్ధరణకు అంకితమైన శ్రీ గూడూరి రామచంద్ర రావు "అహింస" ను, శ్రీ వేమూరి రాంజీరావు "దీనబంధు" ను నిర్వహించారు. అట్లాగే దేవదాశీ సంఘీయులు "సంస్కారిణిని"ని నడిపారు. వీటన్నిటికన్నముందు రంగంలోకివచ్చి దారి చూపినది వీరేశలింగంగారి "సత్య సాధిని" పిల్లల అభ్యున్నతికి పాటిబండ మాధవ శర్మగారు "బాలప్రభ" ను ప్రచురించారు. నేడు "జ్వాల" కు "జ్యోతి" కి కూడ బహుళ ప్రచారంవుంది.

తెలంగాణాలో నైజాము హయామునందు వుర్దూ బోధనా భాషగాను పరిపాలనా భాషగానువున్నా, తెలుగు వార పత్రికలు వెలసి వర్ధిల్లాయి. వాటిలో ప్రథమ స్థానము శ్రీ సురవరం ప్రతాప రెడ్డి నిర్వహించిన "గోలకొండ పత్రిక" కు యివ్వాలి. చిపుకుల అప్పయ్య శాస్త్రి నిర్వహించిన 'దివ్యవాణి", భాగ్య రెడ్డి నడిపిన "భాగ్యనగరు" తర్వాత వస్తాయి. ఇనుగుర్తి నుంచి "తెలుగు పత్రిక". నల్గొండనుంచి "నీలగిరి", మహబూబ్‌నగర్ నుంచి శ్రీనివాస శర్మ గారి సంపాదకత్వమున "హిత బోధిని", వరంగల్‌నుంచి "శోభ" బయలుదేరాయి.

"ఆంధ్రప్రభ వార పత్రిక" చాలా ప్రతులు అమ్ముడు పోతున్నాయి. "ఆంధ్ర పత్రిక". "ఆంధ్ర జ్యోతి" "ప్రగతి" వారపత్రికలుకూడా; కాని అన్ని వార పత్రికలు సినీమా తారలకు, సినిమా విషయాలకు ప్రాధాన్యం యివ్వవలసి వస్తోంది. నేడు మన రాష్ట్రంలో మొత్తం డెబ్బది తెలుగు వార పత్రికలు వున్నాయి. వీటి సంఖ్య, స్థాయి, ప్రచారము వృద్ధి అయినకొద్దీ ప్రజానీకంయొక్క విజ్ఞానాలు వృద్ధి పొందుతాయి. ఇందుకు ప్రజలు, ప్రభుత్వం సమంగా సహకరించాలి.

మార్టిన్ లూథర్ కింగ్

మళీ గుర్తు చేసుకుందాం
మార్టిన్ లూథర్ కింగ్ మరణం.
నిజానికి కాదది మార్టిన్ మరణం.
అది ఉచ్చనీచ శక్తుల మధ్యరణం
అది శ్వేతజాత్యహంకారుల మారణహోమం
పరమ కిరాతకుల పైశాచిక నృత్యం
అది శాంతిదూత మహాప్రస్థానం
గాంధి, లింకన్, కెన్నడీల వారసత్వం.
హంతకుని అహంకారాని అది ఒక హద్దు
లూథరాత్మలో పొడిచినఅమరత్వపు హద్దు
కాల గర్భాన కలసింది ఆయన కాయం
కలకాలం నిలిచివుంటుంది మనగుండెలో యీగాయం
ఏమవుతుంది ఆయన వుద్యమం
ఆకాశం ఆక్రమిస్తుంది
నేల నాలుగు చెరుగుల పరాక్రమిస్తుంది

—పి. వెంకటకృష్ణయ్య

బహుముఖ ప్రతిభాశాలి

బూర్గుల రామకృష్ణారావు

తెలంగాణా నాయకులలో శ్రీ బూర్గుల రామకృష్ణారావు అగ్రశ్రేణికి చెందినవారు. ప్రజాశ్రేయస్సుకై అవిరళ కృషి చేసిన గొప్ప దేశ భక్తుడు. దేశం క్లిష్ట పరిస్థితిలో వున్నప్పుడు తన రాజకీయ ప్రజ్ఞాపాటవాలను, ప్రతిభా విశేషాలను దూరదృష్టితో ఉపయోగించి సమైక్య ఆంధ్రప్రదేశ్ అవతరణకు కృషిచేసిన రాజనీతిజ్ఞుడు శ్రీ బూర్గుల రామ కృష్ణారావు.

మహబూబునగరం జిల్లా పడకల్లు గ్రామంలో 1899 మార్చి 13 వ తేదీన శ్రీ రామకృష్ణారావు జన్మించారు. ఆయన స్వగ్రామం ఆ జిల్లాలోనే షాద్‌నగర్ తాలూకాలోని బూర్గుల. వారి యింటి పేరు 'పుల్లమ రాజు' వారు అని. కాని వారు గ్రామ నామంతోనే 'బూర్గుల' అనే యింటి పేర ప్రఖ్యాతులైరి. హైదరాబాద్ నిజాం కాలేజిలోను, పూనాలోని ఫెర్గూసన్ కాలేజిలోను చదివారు ప్రతిభావంతుడైన విద్యార్థిగా రాణించారు హైద్రాబాద్‌లో యంగ్‌మెన్స్ యూనియన్‌ను స్థాపించి దానికి ప్రథమ కార్యదర్శిగా ఎన్నికైనారు ఫ్యూడల్ రాష్ట్రంలో ప్రజలను విజ్ఞానవంతులుగా చేయడానికి కంకణం కట్టుకున్న సర్వశ్రీ వామన్ నాయక్ కేశవ రావు, కొరటకర్, మాడపాటి హనుమంత రావు వంటి నాయకుల సాహచర్యంలో మెలగి యువకుడైన రామకృష్ణారావు పెద్దల అడుగుజాడలలో నడిచారు. లోకమాన్య బాలగంగాధర్ తిలక్ కాలధర్మం చెందినప్పుడు ఫెర్గూసన్ కాలేజీలో విద్యార్థిగా వున్న రామకృష్ణారావు ఆందోళన లేవదీసి లోకమాన్యుని స్మృతి చిహ్నంగా కాలేజీకి సెలవిప్పించడానికి ముందంజ వేశారు. విద్యార్థిగా వున్నప్పుడుకూడా ఆయన ఖద్దరు దుస్తులే ధరించేవారు.

శ్రీ బూర్గుల రామకృష్ణారావు సాహితీవేత్త, బహు భాషా కోవిదుడు. ఆయనకు మాతృభాషతో సమంగా ఇంగ్లీషు ఉరుదు, హిందీ, పారశీక, మరాటీ, కన్నడ భాషల పరిచయం ఉండేది. సంస్కృతం బాగా నేర్చుకొని కొన్ని పారశీక గ్రంథాలను సంస్కృతంలోకి పద్యానువాదం చేశారు. 'ఉమర్ ఖయ్యాం'ను తెలుగు పద్య గ్రంథంగా అనువదించి మన్నన పొందారు. ఆ భాషలలో ఆయనకు కలంతోపాటు కంఠంగూడా అనర్గళంగా సాగుతుండేది. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిదినం రాత్రి 10 నుంచి 12గం వరకు దీక్షతో సంస్కృతం అధ్యయనంచేసేవారు. తత్ఫలితంగా వారు సంస్కృతంలో చక్కని రచన చేస్తుండేవారు. 1923 లో కాకినాడలో కాంగ్రెస్ మహాసభ జరిగినప్పుడు నాయకుల ఉరుదూ, హిందీ ఉపన్యాసాలను తెలుగులో అనువదించడానికి శ్రీమతి సరోజినీ నాయుడు కోరినమీదట యువకుడైన రామకృష్ణారావు ఆ పని నెరవేర్చారు. క్రమేణా ఆయన, రాజకీయాలు, ఆర్థిక విషయాలు, సోషలిజం, భారతీయ సంస్కృతివంటి అనేక విషయాలలో అత్యంత శ్రద్ధాసక్తులు చూపారు. త్వరలోనే ఆయన హైదరాబాదు సాంఘిక మహాసభకు ప్రథమ కార్యదర్శిగా ఎన్నికైనారు ఆంధ్రోద్యమమును లేవదీసిన నాయకుడుగా వాసికెక్కారు. గ్రామీణ గ్రంథాలయములను స్థాపించడానికి సమగ్రమైన ఒక కార్యక్రమమును రూపొందించారు.

నల్గొండ జిల్లాలోని దేవరకొండలో జరిగిన ద్వితీయ ఆంధ్ర మహాసభ వార్షికోత్సవానికి ఏకగ్రీవ అధ్యక్షుడుగా ఎన్నికైనారు. ఆయన 1937లో జరిగిన హైదరాబాదు పీపుల్స్ కన్వెన్షన్‌కు కార్యదర్శిగా పనిచేసారు. విశాల దృక్పథంగల వ్యక్తి ఆయన అన్ని మతాలకు అతీతుడుగా వున్నందువల్ల పూర్వపు హైదరాబాదు రాష్ట్రంలో ఆయన ఏకైక నాయకుడుగా వ్యవహరించగలిగారు. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు రెండు భాగాలుగా విడిపోయినప్పుడు ఆయన ఒక వర్గానికి నాయకత్వం వహించారు. ఈ రెండు వర్గాలకు మధ్య సామరస్యం ఏర్పాటుచేయడానికి సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ కృషిచేసి... ఈ రెండు వర్గాల ఏకీకరణకు రామకృష్ణారావు దైర్యోత్సాహాలను ప్రదర్శించారు 1950లో శ్రీ యం. కె. వెల్లోడి తన ప్రభుత్వంలో చేర్చుకున్న ప్రజా ప్రతినిధులు నలుగురిలో శ్రీ బూర్గుల రామకృష్ణారావు ఒకరు. ఆయనకు శ్రీ వెల్లోడి సీనియర్ మంత్రి హోదాను యిచ్చారు. ఈ మంత్రి వర్గంలో పండిత్ వినాయకరావు విద్యాలంకార్, శ్రీ ఫూల్‌చంద్ గాంధి. శ్రీ వి. బి రాజుగారలు కూడా చేరారు విద్య రెవిన్యూ శాఖల మంత్రిగా శ్రీ బూర్గుల విద్యా సంస్కరణలను ప్రవేశపెట్టారు 1952 మార్చి 6వ తేదీన ప్రథమ సాధారణ ఎన్నికలు జరిగిన తరువాత ఆయన కాంగ్రెసు పార్టీకి పోటీలేకుండా నాయకుడుగా ఎన్నికై ముఖ్యమంత్రిగా పనిచేశారు భాషా ప్రాతిపదికపైన హైద్రాబాదు రాష్ట్రం మూడు భాగాలుగా విభజింపబడి తెలంగాణాతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించేంతవరకు ఆయన హైదరాబాదు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు.

డాక్టర్ రామకృష్ణారావు 1956 నవంబరు 1 నుండి 1960 జూన్ 30 వరకు కేరళ రాష్ట్ర గవర్నరుగాను తరువాత 1962 వరకు ఉత్తరప్రదేశ్ గవర్నరుగాను నియమించబడినారు. ఆ తరువాత శ్రీ రావుగారు ఢిల్లీలో రాజ్య సభ సభ్యుడుగా కూడా కొన్నాళ్లు ప్రజా సేవచేశారు

1965 జూన్‌లో ఆయన ఆంధ్రప్రదేశ్ కేంద్ర భారతీయ విద్యాభవన్ శాఖకు అధ్యక్షుడుగా పనిచేశారు. రాష్ట్రప్రభుత్వం

ఏర్పాటుచేసిన అఖిల భారత ఖాదీ గ్రామ పరిశ్రమలసంఘానికిచెందిన వర్కింగ్ గ్రూపుకు అధ్యక్షుడుగా పనిచేశారు అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రాచ్య భాషల సంఘానికి అధ్యక్షుడుగా కూడా ఆయన పనిచేశారు. ఆ హోదాతో ఉన్నప్పుడు ఆయన సంస్కృతానికి ఎనలేని సేవచేశారు

ఆయన రాగద్వేషాలు లేకుండా రాజకీయ వ్యూహాలను రచించిన చతురుడు కనుకనే తనను నిరంతరం తీవ్రంగా ఎదుర్కొనిన ప్రత్యర్థుల అభిమానాలను ప్రశంసలను చూరగొనగలిగారు ఆయన స్ఫురద్రూపి. సునిశితమైన హాస్య రసోక్తులతో అందరిని లోబరుచు కొనగలిగిన వ్యక్తి. రాష్ట్ర ప్రజలకు సంబంధించిన విషయాలలో ఆయన అవలంబించిన పద్ధతి నెగ్గుతూ వచ్చింది. తాను చెప్పదలచుకున్న విషయాన్ని సమర్థించడానికి సునాయాసంగా ఉరుదూ, పార్శీ, తెలుగు, మరాఠీ భాషలలోని సుప్రసిద్ధ కవితలను ఉల్లేఖించేవారు. కోపోద్రిక్తులైన సభ్యులు కూడా ఆయన వాగ్ధోరణికి, కవిత్వ ధోరణికి నిరుత్తరులై ముగ్ధులైపోయేవారు. ప్రజలకు సమర్థవంతంగా నాయకత్వం వహించిన వ్యక్తి డా॥బూర్గుల రామకృష్ణారావు గొప్ప సాహితీపరుడు స్వయంగా పాండిత్యము గల కవిగూడ. గొప్ప మానవతా లక్షణాలు గల వ్యక్తి. సాహిత్యాన్ని రాజకీయాలతో జోడించి ఆత్మానందాన్నీ, ప్రజానందాన్నీ చూరగొన్న నాయకాగ్రణి డా॥ బూర్గుల రామకృష్ణారావు. ❀

అర్థమూ పరమార్థమూ

బద్దూరి నరసింహం

బస్సులో వెళుతూంటే
కనిపించే బోర్డు
"పరిమిత పరివారము
అపరిమితానందము"
ఇంట్లో రేడియో పెడితే
వినిపించే పాట

"ముచ్చటగా ముగ్గురున్న
గృహమే ఒక స్వర్గసీమ"
వీధుల్లో గోడలు చూస్తే
వెక్కిరించే వ్రాత

"లెక్కకు మిక్కిలిఉంటే పిల్లలు
చిక్కులు వచ్చును కొల్లలు కొల్లలు"

అప్పుడు గాని
నీవు
ఆత్మను శోధించుకోవు
ఇంటి ఖర్చు = ఆదాయము + అరువై అప్పు

చేజేతులా
కోరి కొనుక్కున్న ముప్పు
కాదు పోతే
తెలిసీ తెలిసీ చేసుకున్న తప్పు

జీవితమంటే
ఇల్లూ పిల్లలే కాదు
శాశ్వత సౌఖ్యాలకై
నిశ్చల తపస్సు కూడా

విద్యాధ్యయనమూ
ఉద్యోగమే కాదు
ఉజ్జ్వల భవిష్యత్తుకై
నిరంతర కృషి కూడా

గుమ్మడి-తీగ కొంచమే
కాని-కాయ ఘనం
అందిన ఆశ్రయమల్లా
అదిమి పట్టుకొని
అసరా లేందే
అడుక్కూడా జరపలేదు
నేల ప్రాకడమే తప్ప
తలెత్తుకు నిలువ లేదు

నీవూ అలానే బ్రతక్క
లేకున్నా ఉన్నట్లు నటించకు
బాధ్యతకు మించి బరువెత్తుకోకు
ఎవర్నీ ఎన్నడూ
దేహీ అనకు
స్వతంత్రంగా బ్రతుకు
సగర్వంగా బ్రతుకు

డియర్ బ్రదర్ !
దేశం నీనుంచి
ఎంతో ఆశిస్తోంది
పనికి మాలిన
పది బండ రాళ్లొద్దు
రెండే రెండైనా
ఆణి ముత్యాల్నే ఇవ్వు
అందులోనే—
అర్థమూ ఉంది
పరమార్థమూ ఉంటుంది.

రంగస్థల 'తార'

స్థానం నరసింహారావు



జీవితంలో అనేక గౌరవ సన్మానాలు, పురస్కారాలుపొంది పరిపూర్ణ జీవితం అనుభవించి 1971 ఫిబ్రవరి 21 న శ్రీ స్థానం నరసింహారావుగారు స్వర్గస్తు లయ్యారు. ఆయన మరణంతో ఆంధ్రప్రదేశ్ నాటక రంగంలో ఒక శకం ముగిసింది.

స్థానం నరసింహారావుగారు 1902 సెప్టెంబరు 23న గుంటూరు జిల్లా, బాపట్ల గ్రామంలో జన్మించారు. బోర్డు హైస్కూలులో విద్య నభ్యసించిన అనంతరం తొలిసారిగా 1919 లో బాపట్లలో రంగస్తల ప్రవేశం కావించారు. ఆ తర్వాత ఏడాదికి ఆయన తెనాలికి బస మార్చి శ్రీరామ విలాస సభ అనే నాటక సంస్థను నెలకొల్పారు. ఈ సంస్థద్వారానే స్థానం నరసింహారావుగారి అద్వితీయ కళా ప్రతిభ మొగ్గ తొడిగి, పూవుపూసి, పరిమళాలను వెదజల్లింది. ఆ పరిమళ వాయువులు కాలంగడిచే కొద్దీ ఆంధ్రప్రదేశ్ నలుమూలలకు విస్తరించాయి. ఎడనెడ మైసూరు, బెంగుళూరు, జెమ్‌షడ్‌పూర్, కలకత్తా, ఢిల్లీ, రంగూన్ వంటి రాష్ట్రేతర ప్రాంతాలకు కూడ ప్రసరించి ప్రజల నలరించి ఉపిరి బిక్కిరిచేసాయి.

ఈ శతాబ్ది రెండో దశాబ్దం ఆరంభంలో, స్త్రీలు నాటకాల్లో వేషాలు వేయడం ఎంతమాత్రం గౌరవప్రదంగా సమాజంలో భావించబడనికారణంచేత నటనా ప్రతిభ గల స్త్రీలు నాటకాల్లో పాల్గోవడానికి అంతగా ముందుకు వచ్చేవారు కాదు. అందువల్ల ఆరోజుల్లో పురుషులే స్త్రీ పాత్రలను ధరించ వలసి వస్తుండేది.

స్థానం నరసింహారావు గారి స్త్రీ పాత్రలు ఒక అపూర్వ సృష్టి. వాటికి వేసాటి. అలంకరణలోగాని, ఆహార్యంలోగాని, అభినయంలోగాని, అడుగుల కదలికలోగాని, హావయల్లోగాని, భావ ప్రకటన, పదఉచ్చారణల్లోగాని ప్రతిక్షణం, ప్రతికోణంలోనూ నిజమైన స్త్రీమూర్తే దర్శనమిస్తుంది. ఆడవాళ్ళనుసైతం మురిపించే స్త్రీసొగసు, హావయలు ఆయనసొమ్ము. స్థానంప్రదర్శించే "సత్యహరిశ్చంద్ర"లోని చంద్రమతి, "రోషనార"లోని రోషనార "సారంగధర"లోని చిత్రాంగి, "శ్రీకృష్ణతులాభారం" లోని సత్యభామ "కృష్ణలీలలు"లోని యశోధ. "చింతామణిలోని" చింతామణి, "చంద్రగుప్త"లోని ముర, "కన్యాశుల్కం"లోని మధురవాణి "బొబ్బిలిరాజు"లోని మల్లమదేవి, "విప్రనారాయణ"లోని దేవదేవి,' చండిక' లోని చండిక—యివన్నీ యీనలభై ఏళ్ళుగా ఎక్కడ ఎప్పుడు ప్రదర్శించబడినా ప్రేక్షకుల హృదయాలను గిలిగింతలు పెట్టి, ఆయనలోని అద్వితీయ ప్రతిభను బైటపెట్టి చిరస్థాయిని సంతరించిపెట్టాయి.

స్త్రీ సహజమైన సుకుమార లావణ్యశరీరంతో, తియ్యని కంఠంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి, స్త్రీపాత్రలలో తనంతతానుగా జవించి, సర్వేపల్లి రాధాకృష్ణన్ కొనియాడినట్లుగా "స్త్రీలనుసైతం సమ్మోహితులనుచేయగల" వ్యక్తి స్థానం.

స్థానం బహుముఖ నటనా ప్రతిభ అందరినీ మంత్రముగ్ధులను చేసి అందరి మెప్పునూ పొందింది ముఖంలో శృంగార హావ భావ విలాసాలు, కదలికలో హావయలు. హుందాగా నిండుగా చూసేచూపులు, చేసే చిలిపిచేష్టలు, ప్రేమ భావాన్ని ప్రకటించేప్పుడు నిజంగా స్త్రీమూర్తిని కళ్ళకు కట్టినట్టు చేస్తాయి. కోపంలోంచి ఒక్కసారిగా ఆనందంలోకి, నవ్వుతూ

అంతలోకే ఉగ్రకోపంలోకి, బాధనుండి దరహాసంలోకి చూస్తుండగానే ముఖభంగిమలను మార్చడం ఆయనలోని ప్రత్యేకత. రంగస్థలంమీద రాణించే నటులకు యీ గుణగణాలు తప్పని సరిగా వుండేవే అయినా స్థానంలో అవి మరింత ప్రత్యేకను సంతరించుకున్నాయి. బళ్ళారి రాఘవాచారి గారిలాగా స్థానం కూడా రంగస్థలం మీద నటిస్తూ ప్రేక్షకులకు ఏమాత్రం తెలిసిపోకుండా యితర నటులకు సూచనలు సైతం యిస్తూండేవారు.

చాలా ఏళ్ళక్రితమే స్థానం నరసింహారావుగారికి బహుమతులు రావడం ప్రారంభించాయి. నటకావతంస, నటశేఖర, నాటక కళాప్రపూర్ణ వంటిబిరుదులు ఆయనకు లభించాయి 1956 జనవరి 27న ఆనాటి భారత రాష్ట్రపతి డా. రాజేంద్రప్రసాద్ ఆయనకు 'పద్మశ్రీ' బిరుదాన్ని ప్రసాదించారు. 1961 ఫిబ్రవరిలో మళ్ళీ భారత రాష్ట్రపతి ఆయనకు జాతీయ బహుమతిని అందజేశారు. ఈ మహానటుని షష్టిపూర్తి ఉత్సవం 1962 సెప్టెంబరు 23 న హైదరాబాదులో బ్రహ్మాండంగా జరిగింది.

రంగస్థల కళా వికాసానికి సంబంధించిన వివిధ సంస్థల్లో స్థానం అనేక ప్రముఖ పాత్రలను వహించారు. 1918 లో ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం స్థానం నరసింహారావుగారిని తెలుగు నాటక పునరుద్ధరణ సంఘ సభ్యుడిగా నామినేట్ చేసింది. ఆ మరునటి సంవత్సరం మద్రాసులోని కళా కేంద్రానికి వ్యవస్థాపక డైరెక్టరుగా ఎన్నికయ్యారు. 1957లో సంగీతనాటక అకాడమీకి సంయుక్త కార్యదర్శిగా నియమింపబడ్డారు. అదే సంవత్సరం హైదరాబాదులోని ఆకాశవాణి కేంద్రంలో తెలుగు నాటకాల ప్రొడ్యూసర్‌గా నియమింపబడ్డారు.

తెలుగు నాటక రంగస్థలిలో 'స్థానానికి' ఎలాటిస్థానంవుంది? ఆయన గురించి ఒక విమర్శకుడు రాసిన మాటల్లోనే యీ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. "మగాళ్ళు స్త్రీ పాత్రలను ధరించారని గాని, ధరించ గలరనిగాని అంటే యీతరం వారికి చాలా హాస్యాస్పదంగా అనిపించవచ్చును. హావభావ విలాసాలను ప్రదర్శిస్తూ స్త్రీ అనే భ్రమను మగవాడు ఎలా కలిగిస్తాడా అని ఆశ్చర్యపోవచ్చు. దీనికి స్థానం నరసింహారావుగారే చక్కటి దృష్టాంతరం."

మా రచయితలు

సర్వశ్రీ

మధురాంతకం రాజారాం, దామల్ చెరువు, చిత్తూరుజిల్లా

సుమనశ్రీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం

ఆచంట జానకీరామ్, తిరుపతి

దేవులపల్లి కృష్ణశాస్త్రి, మద్రాసు

మిరియాల రామకృష్ణ, తెలుగు అకాడమీ, హైదరాబాదు

పోకూరి శ్రీరాములు, న్యూనల్లకుంట, హైదరాబాదు

రావూరు వెంకట సత్యనారాయణరావు, దుర్గివారి వీధి, విజయవాడ

వి. నాగేశ్వర శర్మ, జిల్లా పరిషత్తు కార్యాలయం, ఒంగోలు

పంద్రంగి రాజేశ్వరరావు, అడ్వకేటు, ఏలూరు

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, సమాచార, పౌరసంబంధ, యాత్రికశాఖ. హైదరాబాదు

టి. ఎ. పద్మనాభరావు, నెల్లూరు

అక్కిరాజు రమాపతిరావు, తెలుగు అకాడమీ, హైదరాబాదు

మల్లంపల్లి సోమశేఖర శర్మ

—మం. వెంకటరంగయ్య

ప్రాచీన, మధ్య యుగానికి చెందిన ఆంధ్ర చరిత్రను వెలుగులోనికి తీసుకొనివచ్చిన ప్రముఖ వ్యక్తులలో కీ॥ శే॥ మల్లంపలి సోమశేఖరశర్మగారు అగ్రగణ్యులు.

ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించడానికి అవకాశాలు లేక పోయినప్పటికీ, ఆయన గొప్ప చరిత్రకారుడుగా వాసికెక్కినాడంటే, అది ఆయన ప్రతిభా విశేషాలకు తార్కాణం. అంతే కాకుండా విశ్వవిద్యాలయ శాఖలకు సాధారణంగా వున్న సౌకర్యాలు కూడా తనకు ఏమాత్రం లేకుండావున్నప్పటికీ చాలావృద్ధాప్యం వరకు ఆయన చారిత్రక పరిశోధనలను కొనసాగించ వలసివచ్చింది. తనకు కావలసిన సాక్ష్యాధారాలను స్వయంగా కృషిచేసి సేకరించుకో వలసివచ్చింది. చారిత్రక పరిశోధనతో ఏమాత్రం సంబంధంలేని ఉద్యోగధర్మమును నిర్వహిస్తూ ఆయన ఈ కృషి చేయవలసి వచ్చింది.

ఆంధ్రపునరుద్ధరణ కాలానికి చెందినవ్యక్తి శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ. తెలుగు భాష, సాహిత్యంపైన గొప్ప అభిమానం గలవ్యక్తి. ఆంధ్రుల ప్రాచీన, మధ్య యుగంనాటి ఔన్నత్యాన్ని భారతదేశ సంస్కృతి, నాగరికత వ్యాప్తికి ఆంధ్రులు చేసిన మహత్తరకృషిని ప్రపంచానికి చాటి చెప్పాలని ఆయన మహాదాశయమైవుంది. ఆయన చారిత్రిక రచనలకు ఇదే మూలకారణం.

ఈశతాబ్ది ఆరంభకాలంలో ఈ విషయంలో నిష్ణాతులైన కొమర్రాజు లక్ష్మణరావు, చిలుకూరి వీరభద్రరావుగారల ప్రభావానికి ఆయన లోనైనారు. వారి మార్గదర్శకత్వం క్రింద చారిత్రిక పరిశోధనలు కొనసాగించినారు. కొమర్రాజు లక్ష్మణరావు గారి అధ్వర్యంలో పనిచేస్తూ శిలా శాసనాలను గురించి క్షుణ్ణంగా తెలుసుకొని ఈ విషయంలో నిపుణత సంపాదించారు. చారిత్రక విషయాలను వెలికి తీయడంలో ఆయన సాహిత్యంపైనకంటే శిలా శాసనాలపైననే ఎక్కువగా ఆధారపడినారు. ఆయన చేసిన కృషిలో దీనికి ప్రత్యేకతవుంది.

ఆంధ్ర విజ్ఞాన సర్వస్వమును రచించేందుకు ప్రధాన సంపాదకులుగా వుండిన శ్రీ లక్ష్మణరావు గారికి అనుయాయులుగా వుంటూ శ్రీ శర్మగారు తమ సాహిత్య వ్యాసంగం కొనసాగించారు. ఈ గ్రంథం రెండు సంపుటాలుగా ప్రచురితమైన తరువాత శ్రీ లక్ష్మణరావు కాలధర్మం చేశారు. అప్పుడు మిగిలిన సంపుటాలను ప్రచురించే బాధ్యత పూర్తిగా శ్రీ శర్మగారిపైన పడింది. ఎంతో నేర్పు, ఓర్పుతో ఆయన మూడవ సంపుటాన్ని ప్రచురించారు అయితే పబ్లిషర్లు ఈ గ్రంథ ప్రచురణను ఆపివేసినందువల్ల, ఆయన ఈ పనినుంచి విరమించుకొన్నారు. ఆ తరువాత ఆయన కొన్నేండ్లవరకు తెలుగు భారత్ మాస పత్రికలో పని చేశారు.

ఆయన తన విరామ సమయంలో ఆంధ్ర దేశమంతటా పర్యటించి, చారిత్రక ప్రాశస్త్యంగల ప్రాంతాలను దర్శించి అనేక కొత్త శాసనాలను సేకరించారు. ఆయన కనుగొన్న కొన్ని శాసనాలు అఖిల భారత ప్రాముఖ్యతగలవి. ఆయన ఎన్నో కొత్త, పాత శాసనాలను ఎడిట్ చేసి, వాటిని జాగ్రత్తగా, క్షుణ్ణంగా పరిశీలించి, వాటి చారిత్రిక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలిపారు. ఆయన చారిత్రక కృషిలో ఇది ఒకభాగం మాత్రమే.

చరిత్రను గురించిన ఆయన దృక్పథం సువిశాలమైనది. సరైన చరిత్ర అంటే రాజులవంశాలు, యుద్ధాలు, జైత్రయాత్రలు కాదని, సంస్కృతి నాగరికతలను ప్రతిబింబింపచేసేది చరిత్ర అని అయన విశ్వాసం. చారిత్రిక వ్యాసములు బౌద్ధయుగం అనే సంపుటిలో ఆయన ఈ విషయాన్ని సుస్పష్టంచేశారు. దీన్ని నిరూపించడానికి ఆయన మూడు వ్యాసాలు వ్రాశారు. ఆంధ్ర చరిత్రలో బౌద్ధయుగాన్ని గురించి ఆయన చక్కగా చిత్రీకరించారు. ఆంధ్రుల చరిత్రలో బౌద్ధయుగం మహోజ్జ్వలమైనదని ఆయన భావన.

ఆయన వ్రాసిన వ్యాసములన్నీ, ఆయన దేశ భక్తిని చాటి చెబుతాయి, హుందాగల చక్కనిశైలిలో ఆయన వ్రాసిన రచనలు పండితులకు పామరులకు పఠనీయములు. ఈ రచనలు ఆయన వ్యక్తిత్వాన్ని వెల్లడిచేస్తాయి. ఆయన వ్రాసిన రెండు వ్యాసములు-ప్రాచీన విద్యాసంస్థలు ప్రజల సాంస్కృతిక జీవితంలో దేవాలయాల స్థానం అన్నవి ఆయన రచానాపాటవానికి, ప్రతిభా విశేషాలకు మచ్చుతునకలు.

ఆయన ఆంగ్లంలో వ్రాసిన గ్రంథములలో రెండుచాల ముఖ్యమైనవి. వాటిలో ఒకదానివల్ల మనకు దక్కను, దక్షిణ దేశంలో

ముస్లిం దండయాత్రను ఎదుర్కొని దేశానికి వారి బారి నుంచి విముక్తి కల్గించడానికి ముసునూరు రాజ్యానికి చెందిన కాపయ నాయకుడు పూనుకొన్న చరిత్ర మనకు తెలుస్తున్నది. రెండవ ఆంగ్ల గ్రంథ రెడ్డి రాజుల చరిత్ర కాకతీయ సామ్రాజ్యము పతనమైన తరువాత ఆంధ్ర దేశంలోని రాజకీయ సాంఘిక, ఆర్థిక మత సాహిత్య సంస్కృతులలో గల విశేషాలు ఈ గ్రంథం మనకు సమగ్రంగా తెలియజేస్తుంది.

దీన్ని బట్టి శ్రీ శర్మ గారి కార్యదక్షత ద్యోతకమవుతుంది. వివాదగ్రస్తమైన ప్రతి అంశాన్ని గురించి ఒక నిర్ణయానికి వచ్చే ముందు దానిని అన్ని కోణాలనుంచి క్షుణ్ణంగా పరిశీలించేవారు. ఆయన ఆంధ్ర చరిత్రలో ఆయనకు సరిసమానుడైన డా. నేలటూరి వెంకటరామయ్య సహకారంతో దక్కన్ చరిత్ర సంపుటాలకు ఆయన వ్రాసిన అధ్యాయాలు కూడా ఈ విషయాన్నే బహిర్గతం చేస్తాయి. దక్కన్ చరిత్రను డా. ఎజ్దానీ ఎడిట్ చేశారు.

తెలుగు భాషా సమితివారు ప్రచురించిన తెలుగు విజ్ఞాన సర్వస్వంలోని ఆంధ్ర సంస్కృతి సంపుటానికి సంపాదకులుగాను, ఆంధ్ర చరిత్ర సంస్కృతికి సంబంధించిన విషయాలపై రచయితగాను ఆయన కృషి ఆయన పాండిత్యాన్ని చాటి చెబుతాయి ఆంధ్ర చరిత్ర, సంస్కృతికి ఆయన చేసిన ఎనలేని సేవ ఇది.

తెలుగు పత్రికలు, వార్తాపత్రికల సాహిత్య అనుబంధాలకు ఆయన ఎన్నో వ్యాసాలు వ్రాశారు. అనేక సభలు, సమావేశాలలో ఎన్నో ప్రసంగాలు చేశారు. ఆయన గొప్ప వక్త. చెప్పదలచు కొన్నది, పరులకు అర్థమయ్యే విధంగా వ్రాయడం ఆయన రచనలలో గల విశిష్టత.

కొన్నేండ్ల క్రిందట ఆయన ఆంధ్ర విశ్వ విద్యాలయానికి తరలి వెళ్లినపుడు మద్రాసులోని తెలుగు భాషా సమితి అధ్వర్యంలో జరిగిన ఒకసభలో అనేకమంది ప్రసంగిస్తూ చరిత్రకు శర్మగా చేసిన సేవలను, ఆయన పాండిత్యాని గుర్తించి విశ్వ విద్యాలయం ఆయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవ బిరుదును అనుగ్రహించ గలరన్న ఆశాభావం వెల్లడించారు. ఆయనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ బిరుదును ఇవ్వక పోవడం ఆయన సహచరులకు, ఆయన అభిమానులకు గొప్ప నిరాశకలిగించినది. ఈ అర్హతపొందడానికి ఆయనకు మించిన వ్యక్తి మరొకరు లేరు. అయితే తెలుగు భాష, సాహిత్యం జీవించి వుండేంతవరకు ఆయనస్మృతి వుంటుంది

[త్యాగరాజు కథ 29 వ పుట తరువాయి]

లే నాయనా ! నా కెందుకు నమస్కరిస్తావు నిన్ను, నన్ను సకల జనుల పోషించే ఆ రామునికి నమస్కరించు అంటూ లేవ నెత్తాడు. ఆ నూతనవ్యక్తి ముఖంలోని ఆనందరేఖలు గమనించాడు. అతనెవరో గొప్ప కళాకారుడిలా, సంగీత కోవిదుడుగా కనుపించాడు. అతని నింకా సంతసింప జేయాలని శిష్యులను మరొక కీర్తన పాడమన్నాడు త్యాగరాజు.

ఎవ్వరికయినా భోజనానంతరం తాంబూలం చేయడం అలవాటు. భుజించిన ఆహారం జీర్ణం అవుతుందంటారు. ఆ ధర్మాన్నే పాటిస్తూ రామునికి తాంబూలం సమర్పించాడు.

విదముసేయవే...నన్ను విడనాడకు యనేపల్లవి నందుకొన్నారు శిష్యులు. త్యాగరాజు మధ్య మధ్య గానంచేస్తూ శ్రోతల్ని ఆనంద పరిచారు.

అంతవరకు మారువేషముతో శరభోజి సరసన నిలబడి వున్న పంతులుగారు వేషముతీసి వేశారు. త్యాగరాజు ఆశ్చర్య పడ్డాడు.

మీరు మారువేషాలలో వచ్చారా స్వామీ ! అంటూ లేచి నమస్కరించాడు గురువుగారికి.

మా ఆహ్వానాన్ని నీవు తిరస్కరించితివిగా అంటూ నన్నగా నవ్వారు పంతులుగారు.

నేనా అంటూ విస్తుపోయ్యాడు త్యాగరాజు !

నేను పంపినా, మన రాజు పంపినా ఒకటి గాదా !

క్షమించాలి గురుదేవా ! ధనరాసులతోవచ్చి నన్ను ఆశ పెట్టినందుకు నా నిరసన తెలిపాను, అంటూ ప్రక్క వ్యక్తికేసి జూచాడు త్యాగరాజు.

వారే మన రాజుగారు శ్రీ శరభోజి మహారాజు. త్యాగరాజు హృదయ పూర్వకంగా రాజుకు నమస్కరించి యిరువురికి ఉచితాసనాలు చూపాడు.

త్యాగూ ! నీ తిరస్కారం రాజుగారికి ఆగ్రహం కల్గించలేదు. నీనిరాడంబరత్వానికి యెంతో మెచ్చుకొని నిన్ను స్వయంగా జూచి నీ గానం వినవలెనని వచ్చారు.

త్యాగరాజు సవినయంగా నమస్కరిస్తూ ఖరహరప్రియ రాగంలో చక్కని రాజమార్గముండగ సందుల దూరెదవేల మనసా యనిగానం చేశాడు.

శరభోజి, పంతులుగారలు యెంతో సంతసించారు. త్యాగరాజు వినయపూర్వకంగా యిరువురికి నమస్కరించాడు.

(సశేషం)

దీపస్తంభం



క్రీనీడల్లో

సుమశ్రీ

అందరూ ఇటురండి! ఇదిగో దర్శించండి!
ఇది సమాజపు అద్దుకోత పటం—
ఆవిష్కరిస్తున్నా నిప్పుడే వీక్షించండి!

ఎవరెన్ని బృహద్వ్యాఖ్యానాలు చేసినా
ఎవరెన్ని నైఘంటికార్థాలు ఎత్తిచూపినా
జీవితం ఆపాత మధురం కాదు
విషతుందిలమూ కాదు
జిలుగు రంగుల కలనేత, ద్వంద్వాల జమిలి చీర.

వ్యక్తిగత వైషమ్యాలూ మదమాత్సర్యాలూ నలుసులు
వర్గ విద్వేషాలు నిత్యమారణహోమాల కీలలు
నిర్మలాంతరంగాల నిరపేక్షాదృష్టి—విభూతి పండ్లు.

మనసు దాచేసుకుని మమతల్ని రాచేసుకుని
సాటివాని కన్నీటిని యింధనంగా రాజేసుకుని
తాము పూలబాటల్లోనో గులాబి తోటల్లోనో
విహరించేవాళ్ళు కొమ్ములూ కోరలూ లేని
ఆధునిక రాక్షసులు!

కార్లలో డన్‌లప్ పిల్లోల పిల్లల నునుమెత్తని ఉరువుల మధ్య
మత్తుగా మలిగేవాళ్ళు నవీనమహమ్మారులు!

అదృష్ట దురదృష్టాలు
జనానికి పంచే నేత్ర కుసుమాలు
మతాల కితాబులు
మనిషిచుట్టూ నాటిన బ్రహ్మజెముడుడొంకలు
మూఢవిశ్వాసాల పల్లేరులు
స్వార్థపరులు జల్లిన విషపుముళ్లు

ఈ వ్యవస్థాపీడితుల దయనీయ గాథలు
పారిస్తున్నాయి కన్నీటి కాల్వల్ని
పండిస్తున్నాయి శ్మశానాల్ని.

ఈ ఆరుబయట కారుచీకటిలో
ఒక్కడే కూర్చుని ఒక్కొక్క పేజీ తిరగేసుకుంటున్నాడు
సమస్యల చిక్కుముళ్ళు విప్పుకుంటున్నాడు మనిషి.
ఇదే సమాజం అద్దుకోత పటం—
ఇలారండి! దర్శించండి! అన్వేషించండి!

గతుకుల రోడ్లమీద చితికిన పుళ్ళు
ముళ్ళకంపల చెరలాటలో అతుకుల బొంతలు
అదే అదే గుమస్తాల జీవితం.

మొగ్గతొడగని ఆశల్ని గుండెల్లో దాచుకొని
మహదాశయాల వటవృక్షాల్ని నరుక్కొని

కాలకూటాన్ని కమ్మని పానీయంగా సేవిస్తూ
క్షణక్షణం సజీవ సమాధికి
ప్రయాణిస్తున్నారు గుమస్తాలు.

ఈ తారతమ్యాలు తామర తంపరలు
ఈ అడ్డుగోడల్ని పడగొడితే భూదేవి పులకిస్తుంది
ప్రతిమొక్కా విరగబడికాస్తుంది.

రండి! దర్శించండి ఈ పార్శ్వాన్ని—
ఇది సమాజం అద్దుకోత పటం.

జంగిడిలో జంతికలు పేర్చుకుని
వేరుశనక్కాయలూ కొబ్బరుండాలూ పోసుకుని
ప్రతిరోజూ స్కూలుదగ్గర ప్రత్యక్షమౌతుంది ముసలమ్మ
దానికళ్ళల్లో పువ్వులు, దాని చెవుల్లో పుట్టలు
గుండెల్నిండా నాగజెముడు మట్టలు
ఎందుకామెకు జీవితంమీద ఆశ?
ఉన్న ఒక్క నలుసుకోసం తీరని ఆరాటం!

కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి
నిరాశలు బుసకొడుతున్న వాకిలి
వర్తమాన జీవితం ఊసరవెల్లి
పొడుపుకొండమీద ప్రశ్నార్థకం

ఇదే నేటి సమాజం అద్దుకోత పటం!

గ్రంథ సమీక్ష

త్రివేణి కవితా సంకలనం

రచయితలు : ప్రభంజన్, శాంతమూర్తి, భావశ్రీ.

ప్రచురణ : స్పందన సాహితి, హైదరాబాదు–211

వెల రూపాయి : ప్రాప్తి : అంచల లక్ష్మినారాయణ

8–2–22/B, పంజగుట్ట హైదరాబాదు–4

ఇప్పుడీ 'త్రివేణి' ఒక ఆధునిక కవితా సంకలనం, ఇందులో రచనలు ముగ్గురివి మాత్రమే. ఈ ముగ్గురూ కలంపేర్లు ధరించినట్టు తోస్తుంది. ముగ్గురిలో ఒకరి (శాంతమూర్తి) రచనలు మాత్రం ఇదివరకే పత్రికల్లో వచ్చినవి, తతిమ్మా ఇద్దరివీ ఇప్పుడే తొలిసారి వెలికివచ్చాయి.

ఈ రచయితలు ముగ్గురూ వృత్తిలో సాంకేతిక విద్యా నిపుణులనీ, యంత్ర కర్మాగారంలో పనిచేస్తున్నారనీ 'స్పందన సాహితి' నిర్వాహకులు పరిచయం చేశారు.

ఈ సంపుటిలో మొదట ప్రభంజన్‌గారి 12 ఖండ కవితలున్నాయి. తన సాహిత్య ప్రయోజనాన్నీ కవిత్వ ఆశయాన్నీ పేర్కొంటూ బ్రతుకు 'మర' కాకూడదనీ మనిషి 'మర'గా మారకూడదనీ మరలా (మళ్ళా) మనిషిగా బ్రతకాలనీ అంటున్నాడతను. అది అతని జీవిత తత్వం.

ప్రభంజన్ పేరుకు తగ్గట్టు ఉద్రిక్త స్వభావం గలవాడుగా పాఠకులకు కనిపిస్తాడు. అలా ఒక Personality తో కనిపించడం సాహిత్యంలో ఉత్కృష్ట ధర్మమే.

ఇతని వ్రాతలు అభ్యుదయ కవిత్వాన్ని దాటి, దిగంబర కవితా కూలాన్ని సమీపించినట్టు కనిపిస్తుంది. కొన్ని శీర్షికలు చూడండి–అభ్యుదయం ముసుగులో; కలం కత్తిగా మారుస్తాను మొదలైనవి. ఇతను వాడే మాటలూ, ఉపమానాలూ కూడా తీవ్రమైనవే.

'సగం చచ్చిన మనుష్యుల కూటమి'గా ఈతనికి సంఘం కనిపించింది. "సమాజ శ్మశానపు గ్రద్దలు"గా గ్రామ పెద్దల్ని పోల్చాడు.

> 'నోట్లతో ఓట్లు కాజేస్తారు
> కోట్లతో కోటులు నింపుకుంటారు
> ఓట్లు వేసినవారి నోట్లో దుమ్ముకొడతారు
> వీళ్ళే ప్రజానాయకులు'

ఇందులో తీర్మాన మున్నంతగా, కోప తీవ్రత ఉన్నంతగా, కవితా పదార్థంలేదు. కొత్తదైన భావం లేదు. వక్రోక్తి లేదు. పాఠకుడికి వార్తా పత్రికనో కరపత్రికనో చదివినట్లు అవుతుందే కానీ, 'ఇది ఫలానా కవి పలుకు' అన్నంత స్పందన కలగదు.

నేడు జరుగుతున్న అన్యాయాలను అధిక్షేపించడం, దోపిడి మీదకోపించడం, దోపిడికి తిరిగి దోపిడి చికిత్స అనడం, అవినీతిని ఎత్తి చూపడం కార్మికులను సంఘటిత పరచడం (మార్క్సిజం)– ఇలాంటివి ఈతని వస్తువులు. వీటిని వస్తువులుగా తీసుకుంటున్న వారి గళాలన్నీ ఒకేలాగు పలుకుతున్నాయి ఈనాడు. వాచ్యం ఎక్కువవుతున్నది. యువకవులీ సంగతి గ్రహించి వ్యక్తిత్వం నిలుపుకోవాలి.

> 'సంపూర్ణ స్వాతంత్ర్య దినం' అనే కవితలో –లో
> తప్పును తప్పనటం తప్పు
> తప్పని బ్రతికిన వాడెవడో చెప్పు
> ఇక ఎక్కడనీ వాక్‌స్వాతంత్ర్యం'

అంటున్నారు. కానీ ఇది అతిశయోక్తి. కమ్యూనిస్టు నియంతృత్వ దేశాల్లో లాగ మన దేశంలో ఇంకా వాక్ స్వాతంత్ర్యం చెరిగిపోలేదు. అది ఉంది కనకనే ఈ రచయిత కూడా ఇంత సాహసంగా రాజకీయాలనీ, సంఘాన్నీ విమర్శించారు.

వాక్ స్వాతంత్ర్యం ఉండడంకాదు ప్రధానం. వాక్కును ఋక్కుగా వజ్రాయుధంగా వాడుకోగల్గిన స్వాతంత్ర్యం ఉండడం కవికి ప్రధానం. హృదయ స్పందన కలిగించడం వాక్కు యొక్క ప్రాణం.

తానింకా సాధన దశలో ఉన్నానని తెలుసుకోడం పరిపక్వ కవి కెవనికైనా వృద్ధి హేతువే మరి. 'శాంతమూర్తి'లో ఈ వినయం కనిపిస్తుంది. "ఫలానా కవిత్వం రాయాలి అనుకోకపోయినా, ముందుగా మంచి కవిత్వాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్నాను" అని చిత్తశుద్ధి ప్రకటించుకున్నాడితను.

ఇతనిది కొంతవరకూ గీతి రుచిరమైన రసభావం.

ఇతని 16 ఖండకవితల్లోనూ సగానికి సగం మాత్రాచ్ఛందను లోనూ మధుర భావనలోనూ నడిచాయి. ఇతని వస్తువులు కూడా ఆత్మాశ్రయంగా భాసిస్తాయి. ప్రభంజన్‌లోకన్నా స్పష్టంగా ఆస్తిక భావం ఉన్నదితనిలో (చూ. స్వామిదర్శనమనే కవిత)

మాత్రాచ్ఛందస్సుల్లో వాడుక భాషకన్నా గ్రాంథికం పలుకుబడి చూపించడం సహజం. ఇతనిలో ఆ రెండింటి కలగలుపూ ఉన్నది. 'చలి'ని గూర్చిన గేయంలో

> 'చందమామకు కోపమొచ్చీ
> మంచు ముద్దగ మారిపోయెను
> మంచి వెన్నెల బదులుగా మరి
> మంచునే వెన్నెలగ కురిసెను'

అంటాడు. ఇలా కాల్పనికతా ప్రభావం ఇతనిలో కనిపిస్తుంది. ఏమైనా భావనారమ్యం ఇతని కవిత. పోనుపోనూ వాస్తవికత నర్థం చేసుకున్నట్లు కూడా తర్వాతి కవితలు సాక్ష్యమిస్తాయి.

వెలుగునకు పుట్టుకనిచ్చే విలువైన బ్రతుకు అగ్గిపుల్లకున్నదని భావించడొకచోట. ఇతనిలో తాత్వికమైన చైతన్యం. చూపు ఉన్నాయి.

'పరుగు తీస్తున్న బస్సు'ను వర్ణిస్తూ "విసరివేసినట్టు పడి ఉన్న మాణిక్యాల్లాంటి పల్లెలనూ మణుల్లాంటి పట్టణాలనూ కలిపి దండగా గుచ్చుతున్న సూదిలా ఉంది బస్సు" అంటాడు. ఇలాంటి వర్ణన లితనిలోవున్న కవన ప్రతిభను అద్దంపట్టి చూపిస్తాయి.

"సంప్రదాయాన్ని కాలమనే బంగారు కుండలో నిండిన అమృతంగా" భావించే బుద్ధిమంతుడితను.

'నామతం' అనే ఖండిక ప్రస్తుత వ్యవస్థమీద సవికున్న సమన్వయ దృష్టిని తెల్పుతుంది. ప్రభంజన్‌లో వున్న 'కసిత్వం' ఇతనిలో కనబడదు. అతని రాజకీయ చైతన్యాన్ని ఇతడూ ఇతని భావనాశక్తినీ సమన్వయ రేఖనూ అతడూ అందుకుంటే ఇద్దరూ మంచి కవులవుతారు.

సాధారణంగా సమకాలీన కవిమూర్ధన్యుల ప్రభావం పిల్ల కవులమీద విశేషంగా ఉంటుంది. ఆ ప్రభావాన్ని జీర్ణంచేసుకుని, తద్భిన్నమైన జీవశక్తి సంపాదించుకోడంలోనే ఉత్తమ కవులద యిసారు. 'శాంతమూర్తి' అటు సొంత గొంతుకకూ ఇటు అనుకరణ గళానికీ మధ్య కొట్టుమిట్టాడుతున్నట్లుంది. ఇతని 'వానచినుకులు' ఖండిక చదివినపుడు తటిత్తులా 'నగరంలోవాన' అనే 'కుందుర్తి' ఖండిక మెరిసిపోతుంది. అయినా, శాంతమూర్తిలో ప్రతిభ ఉన్నది అది నిజరూపంతో త్వరలోనేరావచ్చు.

ఈ సంపుటిలో మూడో రచయిత పేరు భావశ్రీ. "పాతంతా రోతకాదు, కొత్తంతా వింతకాదు; పాతలోని తేట తెల్సుకో కొత్తలోని చెత్త వదులుకో" అని ఇతని స్వగతం.

ఈతని ఆశయం కొత్తపాతల మేలు కలయిక ఇతని 11 ఖండికల్లో మొదటిది దేశభక్తి స్ఫోరకమైన గీతం 'నవకవిత' అంటే ఏమిటో దాని స్వరూప స్వభావాలను గూర్చి చెప్పడం మరో ఖండిక కానీ ఇతని (Expression) వ్యక్తీకరణ ఇంకా పాకంలో పడలేదు. 'నవకవిత'లో నవకవితను గూర్చి అధిక్షేపమే ఉన్నదో అభిమానమే ఉన్నదో స్పష్టీకృతం కాలేదు. 'అస్పష్టత' అనేది కవిత్వానికి బద్ధవిరోధి.

'ప్రణయగీతి'లో కవిని విధ్వంస బీజాలు నాటమని ప్రబోధిస్తూ 'ఆహ్వానంలో' యంత్ర జీవికి ప్రకృతి సౌందర్యాన్ని చూపుతున్నాడు. ఇవన్నీ కవికి ఇంకా ప్రాప్తించని భావయౌవనానికి సూచనలు. ప్రతిధ్వనులకు ప్రతీకలు. 'మేఘసందేశం' అనే ఖండికలోంచి శ్రీశ్రీగారి 'శరచ్చంద్రిక' మార్మోగుతూంది.

అయితే 'భావశ్రీ'లో భావనా బీజాలు లేవనడంలేదు. 'జీవితం రైలుబండి' అనే ఖండిక రచనలో రచయిత తాలూకు భావనా సమాధి కనిపిస్తున్నది.

అసహజంగా కనిపించే సంస్కృత పదవిన్యాసాన్ని ఇతను కొంత తగ్గించడం సముచితం. ఉదా:— త్రిస్తగ్రసిత విదగ్ధ సమాజం (విదగ్ధ శబ్దం నేర్పు అనే అర్థంలో యాథం): ధ్వంస నాశక తర్జనములు; నీచ యుగణ్యదమన వృత్తులు; కోకిలపాన సుధామృతపాన ఛవి మొదలైనవి.

మూడు భిన్నపథాల పయనించే ఈ త్రివేణిని స్పందన సాహితి తనలో కలుపుకుంది.

పుస్తకం అట్టమీద శీలా వీర్రాజుగారి ఆధునిక చిత్ర సంకేతం ఆకర్షణీయంగా ఉంది.

పుస్తకం గోపల—అందులోనూ కవితలో—ఘోర ముద్రా రాక్షసాలు వెక్కిరిస్తున్నాయని చెప్పాలి ఒక గొప్ప విషయ పుస్తకం భలే చౌక కదూ!

గ్రామరాజ్యం

రచన—కోసనం మహేశ్వరరావు

బొమ్మలు—మంగళారా జ్ఞానేశ్వర్.


ప్రాప్తి—శ్రీవాణీ ప్రచురణలు 6—3—354/18, హిందీ నగర్ హైదరాబాదు-34, వెల—రు 1—60 పైసలు. పేజీలు—60.

నూతనాక్షరాస్యుడంటే ఇంచుమించు వయఃపరంగానేకాక, మనఃపరంగా కూడా పసివాడే కావచ్చు. అలాంటివాడికివన్నీ అరటి పండులా, అనుభవాని కందాలంటే కథారూపంలోనూ, సరళవచనం లోనూ ఉండాలి. శ్రీ కోసనం మహేశ్వరరావుగారు, ఈ రహస్యాన్ని, గుర్తించి ఒక గ్రామాన్ని కథాస్థలంగా తీసుకుని, అక్కడి కొందరు వ్యక్తుల్ని పాత్రలుగా ఎన్నుకొని, వారి సమస్యల్ని ఆ పాత్రల సంభాషణల ద్వారానూ, సన్నివేశాలద్వారానూ ఆకర్షణీయ వచనంలో అభివర్ణించారు.

ఈర్ష్యలూ, దర్పాలూ వదిలి, సహకార పద్ధతిమీద, ఊరిని ఎలా బలపరుచుకోవాలో, సందేశమివ్వడానికి, యత్నించారు. "పని లేకుండా తిరుగుతున్న వారివల్ల సమాజానికి ఎంతటి కష్టనష్టాలు సంభవిస్తుంటాయో, అలాంటివారు డబ్బుకు ఆశపడి, ఎంతెంత ఉపద్రవాలకు అయినా ఎలా సిద్ధపడుతారో, సంకుచిత స్వార్థపరులు, ఇలాంటివారినేవిధంగా ఉపయోగించుకుంటారో" నిరూపించడానికీ పరిష్కార మార్గం చూపడానికీ తన రచనను వినియోగించారు.

'ఆశ్రిత పక్షపాతం, కులమత వర్గాలు ఏవిధంగా పని చేస్తున్నదీ, వాటివల్ల మనం కోరుకుంటున్న రామరాజ్యంఎలా దూరమవుతున్నదీ,' పాత్రలచేతనే అనిపించారు ఆఖరి సన్నివేశంలో. రామయ్య, రాజయ్య, రహీమ్ మొదలైన పాత్రల్లో రామయ్య మరీ ఆదర్శ పురుషుడుగా కనిపిస్తాడు. అతణ్ణి గాంధీ నిర్వచించిన గ్రామరాజ్యానికి ప్రతినిధిగా చిత్రించాలని రచయిత తపించాడు. ఈ పుస్తకం 'వందేమాతరం' గీతం పాడే బడిపిల్లల వర్ణనతో ఆరంభమవుతుంది. గ్రామాల్లో మంచితనాని కెదురవుతున్న దుష్టశక్తుల నిరూపణతో సాగుతుంది. రచ్చబండమీద, రామయ్య అధ్యక్షతను, గ్రామీణులంతా సమైక్య ప్రతిజ్ఞచేస్తూ, పాడే జాతీయ గీతంతో ముగుస్తుంది.

—ఆనందవర్ధన్



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఫిబ్రవరి 17 న ఏలూరులో ఆంధ్రప్రదేశ్ ఎన్‌జివో సంఘ వార్షిక సమావేశంలో ప్రారంభోపన్యాసం చేశారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కూడా హాజరయ్యారు.

జిల్లాల్లో

ఉత్తమగిరిజన రైతు

శ్రీకాకుళం జిల్లా సారవకోట సమితి, వరాంపురమునకు చెందిన శ్రీ అగదల రాములు (గిరిజన) ఎకరమునకు 1125 కేజీల సంకరగంటి పండించినందుకు యిటీవల జరిగిన సమాజ వికాస వారోత్సవములలో "ఉత్తమ రైతుగా" ఎన్నిక చేయబడినారు. ఆర్.డి.ఓ. శ్రీ ఆర్. కోదండరామరెడ్డిచే రజిత పతకము వీరికి బహూకరింపబడింది.




ఉత్తమ గిరిజన రైతు శ్రీ అగదల రాములు

ఈయనకుగల 5 ఎకరముల పొలములోను, సంకరగంటి. సంకర మొక్కజొన్న, ఐ.ఆర్-8 మొ॥ అధిక దిగుబడినిచ్చు వంగడములు పండించుట ద్వారా అధికారుల ప్రశంసకు పాత్రుడయ్యాడు.



పంజాబ్ గవర్నర్ డా.డి.సి. పవటే ఫిబ్రవరి 8న తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ 14వ స్నాతకోత్సవ ప్రసంగం కావించారు. ఈ స్నాతకోత్సవానికి ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ అధ్యక్షత వహించారు.



విజయవాడలో విజయవాడ సహకార కేంద్ర బ్యాంకు స్వర్ణోత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఫిబ్రవరి 5న ప్రసంగించారు.



వ్యవసాయ శాఖా మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం జనవరి 31న కాకినాడలో దక్షిణ ప్రాంతీయ పశువుల, కోళ్ళ ప్రదర్శనలో సమాచార శాఖకు ప్రారంభోత్సవం కావించారు.

పేద రైతు అయినప్పటికీ స్టేట్ బ్యాంక్ సహాయముతో యిటీవల ఒక వ్యవసాయపు "బావిని"కూడా త్రవ్వాడు.

రాములుచేయు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనేక మంది గిరిజనులలో ఉత్సాహము కలిగించుచున్నాయి.

బ్లాక్ అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుతో మాట్లాడుతూ రాములు "ఆత్మ విశ్వాసంతో, ప్రభుత్వం అందించే సహాయమును సద్వినియోగపరచుకొంటె ప్రతీ పేద రైతు అభివృద్ధి చెందగలడు"అని అన్నారు.

వ్యవసాయ పట్టభద్రులకు స్వయం ఉద్యోగ పథకాలు

తూర్పు గోదావరి జిల్లాకలెక్టరు శ్రీ యల్. మాలకొండయ్య అధ్యక్షతన ఇటీవల కాకినాడలో నిరుద్యోగులైన వ్యవసాయ పట్టభద్రుల సమావేశం జరిగింది.

ఈ జిల్లాలో నిరుద్యోగులుగా వుంటున్న వ్యవసాయ పట్టభద్రులకు ఉద్యోగాలు కల్పించేనిమిత్తం వివిధ అంశాలను చర్చించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేయబడిందని కలెక్టరు చెప్పారు. వీరిలో నిరుద్యోగ సమస్యను తీర్చడానికి వ్యవసాయం ప్రాతిపదికగాగల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. వ్యవసాయ పరికరాల సర్వీసింగ్ వర్క్‌షాపులు మున్నగువాటిని స్థాపించవచ్చని ఆయన సూచించారు.


నిరుద్యోగులైన వ్యవసాయ పట్టభద్రులు, స్వయంగా పూనుకొని, స్వయం ఉపాధి కల్పించుకోవాలని ఆయన ఉద్బోధించారు. ప్రభుత్వ సర్వీసులో అందరినీ తీసుకోవడానికి అవకాశాలు లేవని ఆయన చెప్పారు. ఆచరణయోగ్యమైన పథకాలను అమలుపరచడానికి జిల్లాలోని షెడ్యూలు బ్యాంకులు, సహకార సంస్థలు సహాయపడగలవని ఆయన హామీ ఇచ్చారు.

అంతకుముందు వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టరు శ్రీ పిచ్చేశ్వరరావు ప్రసంగిస్తూ, రాష్ట్రంలోని మూడు వ్యవసాయ కళాశాలలనుంచి ప్రతియేటా 400 మంది వ్యవసాయ పట్టభద్రులు ఉత్తీర్ణులవుతున్నారనీ, వీరందరికీ స్వయం ఉపాధి కల్పించడానికి అనువైన పథకాలను రూపొందించవలసిన అవసరం ఏర్పడిందనీ చెప్పారు.

కరీంనగరంలో లఘు పరిశ్రమలకు ప్రారంభోత్సవం

తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో లఘు పరిశ్రమల అభివృద్ధిని తీవ్రతరం చేసే సంకల్పంతో, జగిత్యాలలోని పరిశ్రమల శాఖ విస్తరణ అధికారి శ్రీ బి. గంగాదేవరాజం నాయకత్వంలో కొంతమంది పారిశ్రామికదారులు హైదరాబాదులోని లఘు పరిశ్రమల సేవా సంస్థ ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ ఈ కార్యక్రమం చేపట్టింది.

ఈ కార్యక్రమం ఫలితంగా కరీంనగరం జిల్లాలో 15 లఘు పరిశ్రమల యూనిట్లు కొత్తగా రిజిస్టరు చేయబడినాయి. మిఠాయి, సుగంధ ద్రవ్యములు, ఊరగాయలు వగైరాలకు చెందిన లఘు పరిశ్రమలు నమోదు అయినాయి. నాప్తాలిన్, బిస్కట్ల తయారీ, పశు గ్రాసం- కోళ్ళ మేత యూనిట్లూ, మిరప పొడి, పసుపు పొడి యూనిట్లూ, రంపపు మిల్లులు, బిస్కట్ల తయారీ యూనిట్లు మున్నగునవికూడా రిజిస్టరైనాయి. అద్దె కొనుగోలు పద్ధతిపైన వచ్చిన దరఖాస్తులను భారత ప్రభుత్వపు జాతీయ లఘు పరిశ్రమల సంస్థకు పంపబడినాయి. పరిశ్రమ దారులకు త్వరలోనే అద్దె కొనుగోలు పద్ధతి పైన అవసరమైయంత్రములు సరఫరా చేయబడుతాయి.




ముఖ్య మంత్రి ఫిబ్రవరి 7న గుంటూరులో గుంటూరు వైద్య కళాశాల రజితోత్సవాలకు ప్రారంభోత్సవం చేశారు.

మునిసిపల్ హౌసింగ్ కాలనీకి ప్రారంభోత్సవం

సమాచార, పౌర సంబంధ శాఖా మంత్రి శ్రీ ఎ. వాసుదేవ రావు నల్గొండలో జనవరి 29 వ తేదీన మునిసిపల్ యల్. ఐ. జి. ఉద్యోగుల ఇండ్ల కాలనీకి ప్రారంభోత్సవం జరిపారు. ఈ కాలనీకి తక్కువ జీతంగల ఉద్యోగులకొరకు రూ. 65,000 ల ఖర్చుతో 6 ఇండ్లు నిర్మించబడినాయి.

మునిసిపల్ ఛైర్మన్ శ్రీ రాజరత్నం, మంత్రికి స్వాగతం చెప్పారు.

ఈ సందర్భంలో ఏర్పాటుచేయబడిన సభకు చిన్నతరహా నీటి పారుదల శాఖామంత్రి శ్రీ వి. పురుషోత్తమ రెడ్డి, జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ కె. రంగారెడ్డి, జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులు శ్రీ యల్లా రెడ్డి కూడా హాజరైనారు.




పంచాయతీరాజ్ మంత్రి శ్రీ తోట రామస్వామి జనవరి 31న కాకినాడలో దక్షిణ ప్రాంతీయ పశు, కోళ్ళ ప్రదర్శనలోని సమాచార శాఖ స్టాలులో తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించిన ఒక పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కుటుంబ నియంత్రణ ఉపకేంద్రానికి శంకుస్థాపన

హోం మంత్రి శ్రీ జె. వెంగళరావు ఖమ్మం జిల్లా కల్లూరు పంచాయతీ సమితిలో లంకసాగరు గ్రామంలో ఇటీవల కుటుంబ నియంత్రణ ఉపకేంద్రానికి ప్రారంభోత్సవం జరిపారు.


వర్తమాన సంవత్సరంలో సత్యనారాయణపురం, నెల్లిపాక, కామపల్లి, పెద్ద గోపతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కుటుంబ నియంత్రణ ఉద్యోగులకు యిళ్ళు కట్టించడానికి రూ. 3 లక్షలు మంజూరైనాయని వెల్లడి చేశారు. ఈ నాలుగు కేంద్రాలలో ఒక్కొక్క దానిలోరూ. 75,000 ల ఖర్చుతో ఉద్యోగులకు ఇండ్లు నిర్మించబడుతాయి. ఖమ్మం జిల్లాలో 15 ప్రాథమిక కేంద్రాలలో ఒక్కొక్క కేంద్రంలో రూ. 12,000 ల చొప్పున మొత్తం రూ. 4.80 లక్షల ఖర్చుతో 40 కుటుంబనియంత్రణ ఉప కేంద్రాలు నిర్మించబడుతాయని మంత్రి చెప్పారు. ఈ సభకు జిల్లా పరిషత్తు మాజీ అధ్యక్షులు శ్రీ జె. కొండలరావు అధ్యక్షత వహించారు. అంతకు ముందు పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ వై. రంగా రెడ్డి అతిధులకు స్వాగతం చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వి. కృష్ణారావు వందన సమర్పణ చేశారు.




పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ ఆనం సంజీవరెడ్డి ఫిబ్రవరి 5న నెల్లూరు జిల్లాలోని పొదలకూరులోగల కాయధాన్యాల పరిశోధనా కేంద్రంలో రైతుల దినోత్సవానికి ప్రారంభోత్సవం చేశారు.

నిరోధ్ పంపిణీలో లక్ష్యసాధన


నిజామాబాద్ జిల్లాలో జరిగిన నిరోధ్ పక్షోత్సవాల సందర్భంలో, నిర్ణయించిన లక్ష్యాలను సాధించడం జరిగింది. ఈ



ఆదిలాబాదు జిల్లా కలెక్టరు శ్రీ మహమ్మద్ జియాయుద్దీన్ జనవరి 26న ఫారెస్టర్ శ్రీ కె. రాములుకు విశిష్ట సేవా బహుమతిని అందజేశారు.



వ్యవసాయ శాఖ డైరెక్టరు శ్రీ కె. సుబ్రమణ్యం, మెదక్ జిల్లా కలెక్టరు శ్రీ ఎస్. చక్రవర్తి ఫిబ్రవరి 3న జహీరాబాదు సమితిని సందర్శించి యు. పి. 301 రకం గోధుమ పొలాలను పరిశీలించారు.



ఢిల్లీలోగల ఆగ్నేయాసియా విషయాల యునెసెఫ్ డైరెక్టరు శ్రీ గార్డన్ కార్టర్ జనవరి 31న నల్గొండ జిల్లా సందర్శించి రిగ్గు కార్యక్రమం ఎలా కొనసాగుతున్నదో పరిశీలించారు

ఉద్యమంలో ఈ జిల్లాలో 27 గ్రామములు, 6 పట్టణాలలో 1,90,000 నిరోధ్‌లు ప్రజలకు పంపిణీ చేయడం జరిగింది.

పీలేరు ఆసుపత్రికి రూ. 4 లక్షలు మంజూరు

రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని పీలేరు ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ. 3 లక్షలు, పరికరాలకు రూ. 1 లక్ష మంజూరుచేసింది.

పుంగనూరు, సత్యవీడులలోని ఆసుపత్రులకు రాష్ట్ర ప్రభుత్వం లోగడ 30 మంచములుగల ఆసుపత్రుల నిర్మాణానికి నిధులు విడుదల చేసింది.

గ్రంథాలయ శాఖకు ప్రారంభోత్సవం

ప్రభుత్వ విద్యాశాఖ జాయింటు సెక్రటరీ శ్రీ యం. వి. రాజగోపాల్ ఇటీవల నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెంలో గ్రంథాలయ శాఖకు ప్రారంభోత్సవం జరిపారు. నెల్లూరు జిల్లా స్థానిక గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షులు శ్రీ ఆనం వెంకటరెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

శ్రీ పుచ్చలపల్లి పేరరెడ్డి, శ్రీ ఎ. సుందర రామిరెడ్డి గారలు యిచ్చిన విరాళం రూ. 10,000 ల డబ్బుతో రీడింగ్‌రూం, గ్రంథాలయ భవనం నిర్మించబడినాయి. ఈ దాతల చిత్రపటాలను శ్రీ ఆర్. లక్ష్మీ నరసారెడ్డి, శ్రీ వెంకటరెడ్డిగారలు ఆవిష్కరించారు.

జిల్లా స్థానిక గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శ్రీ యన్. హరిశ్చంద్రారెడ్డి ప్రసంగిస్తూ లైబ్రరీ సెస్సు విధానాన్ని ప్రభుత్వం సవరించాలని స్థానికంగా వసూలయ్యే ఈ నిధిని నేరుగా జిల్లా స్థానిక గ్రంథాలయ సంస్థకు సంక్రమించేట్లు చేసినట్లయితే గ్రంథాలయం అభివృద్ధికి తోడ్పడడానికి వీలు కలుగుతుందని ఆయన చెప్పారు. జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ యం. గోపాలకృష్ణారెడ్డి, శాసనసభ్యులు శ్రీ స్వర్ణ వేమయ్య మున్నగువారు కూడా ప్రసంగించారు.

గిరిజనులకు భూముల పంపిణీ

వరంగల్లు జిల్లా కలెక్టరు శ్రీ కె. ఆర్. వేణుగోపాల్ ఏటూరి నాగారం పంచాయతీ సమితిలోని ఓరటం గిరిజన గ్రామంలో 180 కుటుంబాలకు 314 ఎకరాల భూమి పంచిపెట్టారు. అంతే కాకుండా కలెక్టరు ఈ గ్రామంలో 7 జతల ఎద్దులు, 2 ఆయిలు ఇంజనులు, 60 జతల దుస్తులు కూడా పంచిపెట్టారు.

కలెక్టరు ఈ సందర్భంలో ప్రసంగిస్తూ సామాన్య ప్రజల శ్రేయస్సుకై ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను గురించి వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన గిరిజనులకు ఉద్బోధ చేశారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సమితి ప్రెసిడెంటు శ్రీ పి. లక్ష్మీనరసయ్య ప్రసంగిస్తూ ఈ జిల్లాలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికై కలెక్టరు శ్రద్ధ తీసుకొంటున్నందుకు. ఆయనను కొనియాడారు.

హరిజనుల గృహ నిర్మాణానికి సహాయం

వర్ధన్నపేట పంచాయతి సమితి అధ్యక్షులు శ్రీ టి. అమృతరావు, షాపూరు గ్రామంలో 28 హరిజన కుటుంబాలకు ఒక్కొక్కదానికి రూ. 50ల చొప్పున మొత్తం రూ. 1400 లు పంచిపెట్టారు. 1971 జనవరి 31 న హరిజన దినోత్సవ సందర్భంగా సంక్షేమ శాఖ హరిజనులకు ఇండ్ల స్థలాలను కేటాయించింది. హరిజనులు మూఢనమ్మకాల దురలవాట్లను వదలిపెట్టి మంచి మార్గంలో అభివృద్ధి పథంలో ముందడుగు వేయాలని సమితి అధ్యక్షులూ, బి.డి.ఓ హరిజనులను ఉద్బోధించారు. సభానంతరం హరిజనులు, ఇతర అన్ని కులాలవారు కలసి భోజనంచేశారు.

గిరిజనులకు పట్టా భూముల పంపిణీ

హోం మంత్రి శ్రీ జె. వెంగళరావు ఖమ్మం జిల్లాలోని మల్లారం, మద్దెలగూడెం, నాయుడుపేట, దమ్మపేట శివారు గ్రామాలలో గిరిజనులకు 218 ఎకరాలుగల 73 పట్టాలను పంచిపెట్టారు. ఆయన వ్యవసాయ రుణాలక్రింద తిరుమల కుంట, సున్నంబట్టి, వినాయకపురం, ఊటుపల్లి, కేశవపురం, దమ్మపేట గ్రామాలలోని గిరిజనులకు రూ. 4785 లు పంచిపెట్టారు. పాలవంచ ఏజెన్సీ ఉత్పత్తి సహకార మార్కెటింగు సొసైటీద్వారా గిరిజన సంస్థ ఈ ఋణాన్ని మంజూరుచేసింది. మంత్రి పట్వారి గూడంలోని 20 మంది బీద గిరిజనులకు దుస్తులు, ఆరు బీద గిరిజన కుటుంబాలకు ఒక్కొక్కదానికి రూ. 20 ల చొప్పున మొత్తం రూ. 120 లు పంచిపెట్టారు. గిరిజన సంక్షేమశాఖ ఈ డబ్బును మంజూరుచేసింది.

హోం మంత్రి లంకసాగరం, పెనుబల్లి, ఎర్రగుంట, రాజాపురం, అన్నపురెడ్డిపల్లి, కిష్టారం, అశ్వారావుపేట, వినాయకపురం. దమ్మగూడెం, పట్వారిగూడెం, జగన్నాధపురం, అంకపాలెం, ములకలపల్లి గ్రామాలలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 2,000 జతల దుస్తులు పంచిపెట్టారు.

మంత్రి, అశ్వారావుపేటలో నిమ్నజాతుల విద్యార్థుల హాస్టలుకు ప్రారంభోత్సవం జరిపారు. దీని నిర్మాణానికి రూ 30,000లు ఖర్చు అయింది. ఇక్కడ పశువుల కృత్రిమ గర్భోత్పత్తి కేంద్రానికి కూడా మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ భవనాలకు లోగడ ఉపముఖ్యమంత్రి శ్రీ జె. వి. నర్సింగరావు శంకుస్థాపన చేశారు.

చిత్తూరు జిల్లాలో 400 కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల నిర్వహణ

చిత్తూరు జిల్లా నగరిలో 200 పడకల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సా శిబిరాన్ని 10 రోజులపాటు నిర్వహించారు. 130 శస్త్రచికిత్సలను చేశారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి కృష్ణమూర్తి, గత మంగళవారం నాడు పత్రికా ప్రతినిధుల బృందానికి యీ శిబిరాన్ని చూపి, నిర్వహణ వివరాలు తెలిపారు. జిల్లా పశ్చిమభాగం ప్రజల ప్రయోజనార్థం మదనపల్లిలో సామూహిక శస్త్రచికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. అల్పాదాయవర్గాల ప్రజలు ముఖ్యంగా హరిజనులు గిరిజనులు యీ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారనీ, శస్త్రచికిత్స చేయించుకున్నవారికి రు. 15 ల ప్రోత్సాహక బహుమతి, ఒక చీరతోపాటు వారికి ఉచిత భోజన వసతి సౌకర్యం కూడా కల్పించబడుతున్నదనీ ఆయన అన్నారు ఈ జిల్లాలో 18,000 శస్త్రచికిత్సలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించబడగా యింతవరకు 8,000 శస్త్ర చికిత్సలను నిర్వహించారని ఆయన వెల్లడించారు. చిత్తూరు, మదనపల్లి ఆసుపత్రులలో 30 పడకల చొప్పున శస్త్రచికిత్స విభాగాలను ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన అన్నారు.

విద్యుచ్ఛక్తి సరఫరాకు ఉపముఖ్యమంత్రి ప్రారంభోత్సవం

ఉపముఖ్యమంత్రి శ్రీ జె. వి నర్సింగరావు యిటీవల ఆదిలాబాదు జిల్లా, లక్సెట్టిపేట సమితిలోని కృష్ణాపురం గ్రామంలో విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ వ్యవసాయ ఉత్పత్తిని అధికం చేయడానికి యీ విద్యుచ్ఛక్తిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఉద్బోధించారు. గ్రామంలో పాఠశాల భవనాన్ని మంజూరు చేస్తామని ఆయన హామీయిచ్చారు.

ఆ తర్వాత ఉపముఖ్యమంత్రి గృహనిర్మాణం నిమిత్తం 17 మంది అల్లీపూర్ హరిజనులకు రు. 1700 లు పంపిణీచేశారు. ఖాజీపేటకు చెందిన 58 మంది హరిజనులకు కూడా తలా రు. 100 ల చొప్పున సహాయం అందజేశారు.

నెల్లూరు జిల్లాలకు రూ. 187 లక్షల బడ్జెటు

ఇటీవల నెల్లూరు జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ యం. గోపాలకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో 1969_70 సం. నికి సవరించబడిన బడ్జెటు అంచెనాలు, 1971_72 సంవత్సరానికి బడ్జెటు అంచెనాలు ఆమోదించబడినాయి.



పుష్కలమైన పంటలకు ఫాక్టమ్‌ఫాస్

అన్ని రకముల భూములకు, పైర్లకు, అనుకూలమై తన ఆధిక్యతను నిరూపించుకున్న, అద్భుత సంకీర్ణ ఎరువు. దక్షిణ ప్రాంత రాష్ట్రముల రైతులు విరివిగా వాడు ఎరువు. భారత దేశంలో రసాయన ఎరువుల ఉత్పత్తికే పునాది వేసిన బ్రహ్మాండమైన ప్రప్రథమ ఫాక్ట్ ఎరువుల ఫాక్టరీ ప్రతిష్ఠను చాటే ఎరువు.

వరి పైరుకు శిఫారసు చేయబడ్డ ఎరువుల మోతాదులు ఎకరాకు కిలోగ్రాములలో

	ఫాక్టమ్‌ఫాస్ 16 · 20	మ్యూరియేట్ ఆఫ్ పొటాష్	యూరియా
వరి :			
(ఎ) అధిక దిగుబడినిచ్చే రకాలు	180	50	58
(బి) దేశవాళీ రకాలు	135	26	12

FACT

ఫాక్ట్ కర్షక బంధు

ది ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కూర్ లిమిటెడ్, ఉద్యోగమండల్ - కేరళ

ఆంధ్రప్రదేశ్ ఏరియా ఆఫీసు. షాపూర్ వాడి, హైద్రాబాద్ - 4


ప్రాంతీయ కార్యాలయాలు.- నిజామాబాద్, వరంగల్, కర్నూలు, నెల్లూరు

aries EKM FT.152.TL

PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD
PUBLISHED BY, THE DIRECTOR OF INFORMATION, PUBLICRELATIONS AND TOURISM, ANDHRA PRADESH, HYDERABAD.

ఆంధ్రప్రదేశ్ గురించి

* ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 8 శాతానికీ, ఆంధ్ర ప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.
* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 27509 చ.కి. మీటర్లు.
* 1961 లో సేకరించిన లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా, 3,59,83,447 మంది.
* 1961లెక్కల ప్రకారం, అక్షరాస్యుల శాతాన్నిబట్టి, ఆంధ్రప్రదేశ్ భారతదేశ రాష్ట్రాలలో పదవ స్థానం ఆక్రమించింది.
* 1961 లెక్కల ప్రకారం, జనాభాలో అక్షరాస్యులు 21.2 శాతం మంది వున్నారు. కాగా భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 24.0.
* 1961 లో హైదరాబాదు, కృష్ణా, పశ్చిమగోదావరి, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలలో అక్షరాస్యులు, అఖిల భారత స్థాయికంటే ఎక్కువ మంది వున్నారు.
* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ.306లు. మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటున ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.
* రాష్ట్రంలో 1000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నులబొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.
* భారత దేశంలో, బైరైట్స్ వుత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. దేశంలో వుత్పత్తి అయ్యే బైరైట్స్‌లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో వుత్పత్తి అవుతున్నది.
* అభ్రకం వుత్పత్తిలో బీహారు, రాజస్తాన్ రాష్ట్రాల తరువాతి స్థానం ఆంధ్రప్రదేశ్‌ది.


Reg. No. H. 133